# జాతీయ స్ఫూర్తి

2020 మార్చి 1-31

వెల : రూ.30/-

పక్షపత్రిక




## భగత్‌సింగ్‌పై ప్రత్యేక వ్యాసాలు

జాతీయ **స్ఫూర్తి** పక్షపత్రిక

వ్యవస్థాపక సంపాదకులు, ప్రచురణకర్త
నిడదవోలు వెంకటేశ్వరరావు

2020 మార్చి 1-31 సంపుటి : 28 సంచిక : 11,12

డి.వి.వి.యస్. వర్మ, ప్రధాన సంపాదకులు
సంపాదక వర్గం
డా॥ బి. రమేష్‌చంద్రబాబు
కొప్పర్తి వెంకట రమణమూర్తి
డి. సోమసుందర్
మందలపర్తి కిషోర్

వెల : 15/- రూపాయలు

## ఈ సంచికలో...


3 అమరుల త్యాగానికి గుర్తింపేది? - మాడభూషి శ్రీధర్

4 చిన్న పుస్తకం, గొప్ప జీవితం భగత్ సింగ్ ! - తెలకపల్లి రవి

5 భగత్ సింగ్ జీవిత సంగ్రహం

8 భగత్ సింగ్ రాజకీయ జీవితం ఒక ఉత్తమ పోరాట ఆదర్శం

13 సంపూర్ణ విప్లవమే భగత్‌సింగ్ లక్ష్యం - కందిమళ్ళ ప్రతాపరెడ్డి

15 క్షమాభిక్ష కోరం- మమ్మల్ని కాల్చి చంపండి

17 నాకు క్షమాభిక్ష ప్రసాదించండి

19 భగత్ సింగ్ పిస్టల్ 85 ఏళ్ల తర్వాత ఎలా దొరికింది? - దలీప్ సింఘ్తీ

21 భగత్ సింగ్ పిస్టల్ - అనేకానేక స్మృతులు - ఎన్ వేణుగోపాల్

23 90 ఏళ్ల క్రితం కులం గురించి భగత్‌సింగ్ ఏం చెప్పారు? - వెంకట కిషన్ ప్రసాద్టీ

25 భగత్ సింగ్ దళిత దార్శనికత - ఆచార్య వి. కృష్ణ

26 అంబేద్కర్ పత్రికకు వందేళ్లు - డా॥ జి.కె.డి. ప్రసాద్

27 రాజ్యాంగ పఠనమే ప్రాణవాయువు - ప్రొ॥ కంచ ఐలయ్య

29 సమైక్య స్ఫూర్తిగా బాపు, బాబాసాహెబ్ - రామచంద్ర గుహ

31 ఇదే భగత్‌సింగ్ పూర్వీకుల ఇల్లు

33 మనమంతా భారతీయులం

34 ముసల్మాన్ల మొహల్లా - నిఖిల్ సచాన్

36 మార్క్సిజం ఎందుకు మెరుగైన తత్వశాస్త్రం?

38 నీవూ మార్క్సిస్టువే -పీటర్ కావుఫ్‌మన్ - డా॥ బి. రమేష్ చంద్రబాబు

40 మార్క్సిజాన్ని మించిన కరదీపిక లేదు - హెచ్చార్కే


## ఈ సంచిక గురించి... సంపాదకీయం

# భగత్‌సింగ్ వర్ధంతి

మార్చి 23న భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల వర్ధంతి. భగత్‌సింగ్ సహచరులు ఇచ్చిన ఇంక్విలాబ్ జిందాబాద్ అన్న నినాదం భారతదేశం అంతటా మారుమోగుతూనే వుంది. యువతరాన్ని ఉత్తేజపరుస్తూనే వుంది. విప్లవం అంటే కేవలం స్వాతంత్ర్యం మాత్రమే కాదని దోపిడీ లేని సమసమాజాన్ని సాధించడమేనని వారు ప్రకటించారు. మార్క్సిజంలోనే వారు మరో ప్రపంచాన్ని చూశారు. ప్రముఖ చరిత్రకారుడు ఫణిక్కర్ చెప్పినట్లుగా భారతదేశంలో తొలి మార్క్సిస్టు భగత్‌సింగ్.

ఈ సంచికలో భగత్‌సింగ్ జీవిత సంగ్రహంతో పాటు రాజకీయ ఆదర్శాలను, కులం పట్ల, మతం పట్ల గల శాస్త్రీయ అవగాహనను వివరించే వ్యాసాలను అందిస్తున్నాము.

బ్రిటిష్ ప్రభుత్వానికి ఇంక్విలాబ్ భగత్‌సింగ్ - హిందూత్వ సావర్కార్‌లు రాసిన రెండు లేఖల్ని కూడా పొందుపర్చాము. భగత్‌సింగ్ సహచరులు తాము క్షమాభిక్ష కోరం - కాల్చి చంపండి అంటే హిందూత్వ సావర్కర్ నాకు క్షమాభిక్ష ప్రసాదించండి. నేను మీకు సేవలందిస్తాను అన్న లేఖలు వారి వారి నిజస్వరూపాన్ని బహిర్గతం చేస్తున్నాయి. జాతీయోద్యమంలో హిందూత్వ శక్తుల పాత్రను ఈ లేఖ విశదపరుస్తుంది.

దేశంలో హిందూత్వవాదుల నిజస్వరూపాన్ని, వారి దేశభక్తి బండారాన్ని బహిర్గతం చెయ్యడానికి దేశవ్యాప్తంగా వామపక్ష పార్టీలు పెద్ద ఎత్తున నిర్వహించ తలపెట్టిన భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమాలకు ఈ సంచిక ఉపకరిస్తుందని భావిస్తున్నాము. ❑

## విన్నపము

మార్చి 23వ తేదీ భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా స్ఫూర్తి మార్చి నెల సంచికను భగత్‌సింగ్‌పై ప్రత్యేక వ్యాసాలతో ప్రచురించాలని భావించాం. కానీ కరోనా వైరస్ గురించి దేశవ్యాప్తంగా విధించిన లాక్‌డౌన్‌లో భాగంగా స్ఫూర్తి కార్యాలయం మరియు ప్రింటింగ్ ప్రెస్ లాక్‌డౌన్ చేయవలసి వచ్చినది. దానితో పత్రికను ముద్రించడం వీలు కానందున మీకు అందచేయలేకపోయాం. ఇప్పటికి పరిస్థితులు ఇంకా మెరుగుపడనందున ఈ పత్రికను ముద్రించి మీకు అందచేయలేకపోతున్నాం. దాని బదులుగా ఈ-పేపర్‌ను మీకు అందచేస్తున్నాం. పాఠకులు గమనించగలరు.

పరిస్థితులు మెరుగుపడ్డాక యధావిధిగా స్ఫూర్తి పత్రికను ముద్రించి మీకు అందచేయగలం.

- పబ్లిషర్



# అమరుల త్యాగానికి గుర్తింపేది?

**మాడభూషి శ్రీధర్**
బెన్నెట్ యూనివర్సిటీ ప్రొఫెసర్
కేంద్ర సమాచార మాజీ కమిషనర్

భగత్‌సింగ్ వర్ధంతి వ్యాసాలు

## విశ్లేషణ

సర్దార్ భగత్ సింగ్, భారత్ గర్వించదగిన సమరయోధుడు. జాతిపిత గాంధీజీ శాంతి ఉద్యమం ఎంత సమున్నతమైనదో, భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వంటి యువకుల ప్రాణ త్యాగం కూడా అంతే కీలకమైంది. నేతాజీ నడిపిన ఆజాద్ హింద్ ఫౌజ్ బ్రిటిష్ సైన్యంతో పోరాడింది. వారిని గుర్తిస్తున్నామా? అధికారికంగా మన దేశం వారికి ఏ స్థాయి కల్పిస్తున్నది? భగత్ సింగ్‌ను షహీద్ అని ప్రభుత్వం గుర్తించిందా లేదా, గుర్తించడానికి చట్టపరంగా ఏవైనా ఇబ్బందులు, పరిమితులు, ఆంక్షలు ఉన్నాయా, కనీసం ఆయనను స్వతంత్ర సేనానిగా ప్రభుత్వం అంగీకరిస్తుందా అని సమాచారం అడిగారు అమిత్. ఆయన అడిగింది రాష్ట్రపతి భవన్ అధికారులను. వారు ఆయన ఆర్టీఐ దరఖాస్తును హోం శాఖకు పంపించారు.

హోం శాఖ దాన్ని అదే వేగంతో పురావస్తుశాఖకు తరలించింది. భగత్‌సింగ్ జీవితానికి, పోరాటానికి సంబంధించిన పత్రాలను ఎవరైనా వచ్చి చదువుకోవచ్చునని, భగత్ సింగ్ గుర్తింపుపై సమాచారం తమ దగ్గర ఉన్న దస్తావేజులలో లేదని పురావస్తు శాఖ తెలిపింది. సంతృప్తి చెందని అమిత్ కుమార్ సమాచార కమిషన్ తలుపు తట్టారు.

ఈ సమాచార అభ్యర్థన నిజానికి ప్రభుత్వం భగత్ సింగ్ వంటి వీర పుత్రుల గురించి ఏదైనా విధాన నిర్ణయం తీసుకుందా, తీసుకుంటే ఆ విధానం గురించి సమాచారం ఇస్తుందా అనేవి అసలు ప్రశ్నలు. ఈ వీరులు తమ యవ్వనాన్ని లెక్క చేయకుండా దేశానికి అర్పించారని ప్రధాని నివాళులర్పించారు. ఆ ముగ్గురు వీరులు ఉరికంబానికి వేలాడిన మార్చి 23న దేశ భక్తులంతా నివాళులర్పిస్తారు. వారు అమరులై 81 ఏళ్లు దాటింది.

ఈ సంవత్సరం మార్చి 25న ఆరోరా అనే న్యాయవాది, భగత్ సింగ్ విషయంలో ప్రభుత్వ విధానం ఏమిటని అడిగారు. దానికి హోం మంత్రిత్వ శాఖ 'జీవించి ఉన్న వారినైనా మరణించిన వారినైనా అమర వీరులుగా అధికారికంగా గుర్తించలేదు' అంటూ ఈ దరఖాస్తును జాతీయ పురావస్తు విభాగానికి బదిలీ చేశారు. ఇలా అయితే రాబోయే తరాలు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, ఉద్ధంసింగ్, కర్తార్ సింగ్ వంటి అమరుల త్యాగాలను మరిచి పోతాయని ఆరోరా అన్నారు. భారత ప్రభుత్వం లేదా పంజాబ్, హరియాణ రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అమరవీరులకు షహీద్ గౌరవాన్ని ఇవ్వాలి. అధికారికంగా ప్రకటన జారీ చేయాలని ఆరోరా కోరారు. అమర వీరులు, స్వాతంత్ర్య పోరాట వీరుల జాబితాలను ముందు తరాల వారి కోసం అధికారికంగా విడుదల చేయాలని కోరారు. ప్రతి ఏడాదీ ఇటువంటి డిమాండ్ వస్తూనే ఉంది. హోం శాఖ మా దగ్గర ఏ అధికారిక పత్రం లేదు. కనుక మేం చెప్పేది ఏమీ లేదని జవాబు ఇస్తూనే ఉంది.


పంజాబ్ ప్రభుత్వం సరబ్జిత్ సింగ్‌ను జాతీయ అమర వీరుడుగా ప్రకటించింది. మరి భగత్‌సింగ్‌ను ఎందుకు వదిలేశారు అని వీరు అడుగుతున్నారు. పంజాబ్, హరియాణా హైకోర్టు మార్చి 20 (2018) నాటి తీర్పులో ఈ ముగ్గురు వీరులను షహీద్ అని ప్రకటించాలని ఆదేశించడానికి ఏ చట్టమూ లేదని వివరించింది. ఆర్టికల్ 18 ప్రకారం బిరుదులు ఇవ్వడానికి వీల్లేదని పంజాబ్ ప్రభుత్వం వాదించింది. బీరేంద్ర సంగ్వాన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో ఢిల్లీ హైకోర్టు డివిజన్ బెంచి న్యాయమూర్తులు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి గీతా మిట్టల్, సి.హరిశంకర్ డిసెంబర్ 12, 2017న ఈ విధమైన తీర్పు ఇచ్చిందని పంజాబ్ హరియాణా కోర్టు ఉటంకించింది. 2015లో ఆర్టీఐ దరఖాస్తుకు కూడా హోం శాఖ ఇదే సమాచారం ఇచ్చింది. ఆనాటి ప్రధానమంత్రి, మన్మోహన్ సింగ్ ప్రసంగిస్తూ 'భగత్‌సింగ్ గురించి అధికారిక పత్రాలు ఉన్నా, లేకపోయినా, వారు ఈ దేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో అవిభాజ్యమైన భాగస్వాములుగా ఉంటారు.

వారి వారసత్వాన్ని జాతి గర్వంగా స్వీకరిస్తుంద'ని అన్నారు. భగత్‌సింగ్ మనవడు అధికారికంగా వారికి షహీద్ హోదా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. విభిన్న రంగాలలో పేరెన్నిక గన్న వారికి భారతరత్న, పద్మ అవార్డులు ఇవ్వడానికి, సైన్యంలోని వారికి వీరచక్ర బిరుదులు ఇవ్వడానికి, క్రీడాకారులకు ఖేల్ రత్న బిరుదులు ఇవ్వడానికి అడ్డురాని ఆర్టికల్ 18 భగత్ సింగ్‌ను అమరవీరుడని అధికారికంగా పిలవడానికి అడ్డొస్తుందా? భగత్‌సింగ్ వంటి వీరులను, ఆజాద్ హింద్ ఫౌజ్ సైనికులను అధికారికంగా గుర్తించడానికి ఏమైనా ఆలోచిస్తున్నారో లేదా అనే విషయమై ఇప్పటి ప్రభుత్వాన్ని సంప్రదించేందుకు వీలుగా హోంమంత్రి ముందు ఈ దరఖాస్తును ఉంచాలని సీఐసీ ఆదేశించింది. ❑

భగత్‌సింగ్
వర్ధంతి
వ్యాసాలు

# చిన్న పుస్తకం, గొప్ప జీవితం
# భగత్ సింగ్ !

**తెలకపల్లి రవి**
ఎడిటర్, ప్రస్థానం మాసపత్రిక



ఆ పేరు తల్చుకోగానే భారతీయులలో సాహస స్ఫూర్తి కదలాడుతుంది. ఒకదశలోనైతే భగత్ సింగ్ పేరు ప్రఖ్యాతులు మహాత్మాగాంధీని కూడా మించిపోయాయట. ఎప్పటికీ మరపురాని స్ఫూర్తిగా నిలిచిపోవడం భగత్‌సింగ్ ప్రత్యేకత. 1906 సెప్టెంబరు 2న జన్మించిన భగత్ సింగ్ శతజయంతి సంవత్సరం సందర్భంగా భగత్ సింగ్ జీవిత రాజకీయ విశిష్టతలను వివరిస్తూ, విశ్లేషిస్తూ అశోక్ ధావలే రాసిన పుస్తకం 'నిరంతర పోరాట స్ఫూర్తి భగత్ సింగ్'. 40 పేజీల ఈ పుస్తకంలో నాటి దేశ రాజకీయ పూర్వరంగాన్ని, భగత్‌సింగ్‌ను విలక్షణ విప్లవ కారుడుగా నిలిపిన అంశాలనూ తెలుసుకోగలం. అశోక్ ధావలె అనేక గ్రంథాలు అధ్యయనం చేసి రాసిన కారణంగా ఎన్నో విషయాలు తెలుస్తాయి.




తొలి దశలో పంజాబ్, బెంగాల్‌లో ప్రధానంగానూ, కొంత వరకు మహారాష్ట్రలోనూ విప్లవకారులుండేవారు. ప్రాణాలను కూడా లెక్కించకుండా వీరు బ్రిటీష్ ప్రభుత్వాన్ని సవాలు చేశారు. అయితే ప్రజల చైతన్యం తగినంతగా పెరగని దశ అది. అందుకే వారి త్యాగాలు గుర్తింపుకు నోచుకోలేదు. భగత్‌సింగ్ బృందం రంగంలోకి వచ్చే నాటికి ప్రజలు పోరాటాలలో వువ్వెత్తున పాల్గొంటున్నారు. వారి సాహసోపేత పోరాటాలూ, బలిదానాలు చెరగని ముద్ర వేశాయి.

విద్యావతి, కిషన్‌సింగ్ దంపతుల కుమారుడు భగత్ సింగ్. తండ్రి, మామయ్య కూడా స్వాతంత్ర్య యోధులుగా జైలుకు వెళ్లిన వారే. ఉరికంబమెక్కిన వీరుడు కర్తార్ సింగ్ ఫొటో జేబులో పెట్టుకుని తిరిగేవాడు. జలియన్‌వాలాబాగ్ వెళ్లి మృతులకు శ్రద్ధాంజలి ఘటించి అక్కడ సేకరించిన మట్టిని ఒక సీసాలో వేసి జీవితమంతా అట్టి పెట్టుకున్నాడు. బిఎ చదువుతూ మధ్యలోనే ఆపేశాడు. పెళ్లికి బలవంతం చేస్తే 'ఇది పెళ్లికి సమయం కాదు. దేశమాత నన్ను పిలుస్తోంది' అని జవాబు చెప్పాడు.

గాంధీజీ పిలుపుపై వువ్వెత్తున రగుల్కొన్న సహాయనిరాకరణ ఉద్యమాన్ని చౌరీచౌరా ఘటన కారణంగా ఉపసంహరించడం (1922) యువతను తీవ్రాగ్రహానికి గురి చేసింది. గాంధీజీపై ఆశలు పెట్టుకున్న యువత మళ్లీ తీవ్రవాదం వైపు మొగ్గడం మొదలైంది. 1921లో భగత్‌సింగ్ ఒక వ్యాసంలో తన అభిప్రాయాలు వివరించారు. నిజమైన విప్లవకారులు గ్రామాల్లోనూ, ఫ్యాక్టరీలోనూ వున్నారని తెలిసినా ఒక్కసారి వారిని మేల్కొల్పితే తర్వాత కూడా ఆపలేమన్న భయంతో మన నాయకులు వారిని రంగంలోకి తీసుకురావడం లేదని విమర్శించాడు. రష్యాలో వచ్చిన బోల్షివిక్ విప్లవం వారిపై ప్రభావం చూపింది. 1920లోనే కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది.

ఈ ఘటనలన్నిటి నేపథ్యంలో భగత్‌సింగ్ బాగా లోతుగా అధ్యయనం చేశాడు. మార్క్సిజం వైపు ఆకర్షితుడయ్యాడు. కాన్పూర్‌లోని హిందూస్థాన్ రిపబ్లికన్ ఆర్మీలో చేరాడు. ఆ సంస్థ ప్రణాళికకు 'విప్లవకారుడు' అని పేరు పెట్టారు. వీరంతా విప్లవ రాజకీయాలను చేపట్టడం, అదే సమయంలో వ్యూహాత్మక విప్లవ దశ నుంచి బయట పడలేకపోవడం గమనించాల్సిన అంశాలు. హెచ్‌ఆర్‌ఎ లూటీలు, ఆయుధాల అపహరణ వంటి పనులు చేసింది. పట్టుబడిన వారికి శిక్షలూ పడ్డాయి.

ఆ తర్వాత మిత్రులతో కలిసి 'నౌజవాన్ భారత్' సభ ఏర్పాటు చేశాడు. పలు శాఖలు ఏర్పడ్డాయి. ప్రజల కోసం ప్రజల చేత విప్లవం తెస్తామని అందులో ప్రకటించారు. వారికి కమ్యూనిస్టులతోనూ సంబంధాలు ఏర్పడ్డాయి. ఈ సంస్థ మతతత్వానికి ఏ మాత్రం ఆస్కారం లేని లౌకిక విధానం కూడా ప్రకటించింది. లాలాజీ ఒక దశలో మతతత్వానికి లోనైనప్పుడు భగత్‌సింగ్ ఆయన పేరెత్తకుండానే శక్తివంతమైన విమర్శ చేశాడు. క్రమేణా చంద్రశేఖర్ ఆజాద్ కమాండర్‌గా 'హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లిక్ ఆర్మీ' ఏర్పాటైంది. భగత్‌సింగ్ సూచనపై సోషలిజాన్ని అది తన లక్ష్యంగా ప్రకటించింది. దానిలోని రాజకీయాలే గాక రచనాశైలి కూడా చాలా ఉత్తేజకరంగా వుంటుంది. ఈలోగా లాలాజీపై లాఠీచార్జి, ఆ దెబ్బలతో ఆయన మృతి చెందడం దేశాన్ని కుదిపేశాయి. జాతిచైతన్యాన్ని ప్రతిబింబించేందుకై ఇందుకు కారకుడైన శాండర్స్‌ను హతమార్చాలని నిర్ణయించారు. ఉధృతమవుతున్న పోరాటాలను అణచేసేందుకు ప్రజా భద్రతా చట్టం పేరిట నిరంకుశ శాసనం తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ సందర్భంగా 192 ఏప్రిల్ న జాతీయ శాసన సభలో బాంబులు వేసిన ఘటన భగత్ సింగ్ విప్లవ జీవితానికి తారాస్థాయి.

☞ మిగతా 18వ పేజీలో

భగత్‌సింగ్
వర్ధంతి
వ్యాసాలు

# భగత్ సింగ్ జీవిత సంగ్రహం

*(భారతీయ విప్లవకారుడు, మార్క్సిస్టు, స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్‌పై రూపొందించిన జనవిజ్ఞాన వేదిక కథనం)*

భగత్ సింగ్ (1907 సెప్టెంబరు 28–1931 మార్చి 23) స్వాతంత్ర్య సమర యోధుడు, ప్రఖ్యాత ఉద్యమకారుడు. ఢిల్లీ వీధిలో ఎర్ర కాగితాలు చల్లి ప్రజలను చైతన్య పరిచాడు. విప్లవం వర్ధిల్లాలి అనే నినాదాన్ని ఇచ్చింది కూడా భగత్ సింగే. భారత స్వాతంత్ర్యోద్యమములో పోరాడిన అత్యంత ప్రభావశీల విప్లవకారులలో ఆయన ఒకడు. ఈ కారణంగానే షహీద్ భగత్ సింగ్‌గా కొనియాడబడతాడు.



చరిత్రకారుడు కె.ఎన్. పణిక్కర్ ప్రకారం భగత్ సింగ్, భారతదేశంలో ఆరంభ మార్క్సిస్టు. భగత్‌సింగ్ హిందుస్తాన్ సోషలిస్టు రిపబ్లికన్ పార్టీ స్థాపక సభ్యులలో ఒకడు. ఇప్పుడు పాకిస్తాన్‌లో ఉన్న లాయల్ జిల్లా బంగా గ్రామంలో కిషన్ సింగ్, విద్యావతి దంపతులకు భగత్ సింగ్ జన్మించాడు. భారత్‌లో బ్రిటీషు పాలనను వ్యతిరేకిస్తూ విప్లవాత్మక ఉద్యమాలను చేపట్టిన కుటుంబంలో ఆయన జన్మించాడు. యుక్త వయస్సులోనే ఐరోపా విప్లవ ఉద్యమాలను గురించి చదివిన సింగ్ అరాజకవాదం మరియు సామ్యవాదమునకు ఆకర్షితుడయ్యాడు. అనేక విప్లవాత్మక సంస్థల్లో ఆయన చేరాడు. హిందూస్తాన్ గణతంత్ర సంఘం (HRA)లో ఒక్కో మెట్టు ఎక్కుతూ అనతికాలంలోనే అందులోని నాయకుల్లో ఒకడుగా ఎదిగిన ఆయన ఆ తర్వాత దానిని హిందూస్తాన్ సామ్యవాద గణతంత్ర సంఘం (HSRA)గా మార్చాడు. భారత మరియు బ్రిటన్ రాజకీయ ఖైదీలకు సమాన హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ జైలులో 64 రోజుల నిరాహారదీక్షను చేపట్టడం ద్వారా సింగ్ విపరీతమైన మద్దతును కూడగట్టుకున్నాడు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు లాలా లజ్‌పత్ రాయ్ హత్య నేపథ్యంలో ఒక పోలీసు అధికారిని కాల్చినందుకు ఆయన్ను ఉరితీశారు. ఆయన ఉత్తరదాయిత్వం భారత స్వాతంత్ర్య సిద్ధికి పోరాడేలా భారత యువతను ప్రేరేపించింది. అంతేకాక భారత్‌లో సామ్యవాద వ్యాప్తి మరింత పుంజుకుంది.

## బాల్యం, జీవితం

భగత్ సింగ్ పంజాబ్‌లోని లాయల్పూర్ జిల్లా, బంగా సమీపంలోని ఖత్కర్ కలాన్ గ్రామంలో సర్దార్ కిషన్ సింగ్ మరియు విద్యావతి దంపతులకు పుట్టిన సంధు ఝాట్ కుటుంబీకుడు. భగత్ అనే పదానికి "భక్తుడు" అని అర్థం. సింగ్ యొక్క దేశభక్త సిక్కు కుటుంబంలోని కొందరు భారత స్వాతంత్ర్యోద్యమాల్లోనూ మరికొందరు మహారాజా రంజిత్ సింగ్ సైన్యంలోనూ పనిచేశారు. భగత్ సింగ్ మూడేళ్ళ పిల్లాడిగా ఉన్నప్పుడు అతని తండ్రి కిషన్ సింగ్ భగత్ సింగ్‌ను చంకకెత్తుకొని, తన స్నేహితుడు నందకిశోర్ మెహతాతో పాటు కొత్తగా వేస్తున్న తోటను చూడ్డానికి పొలాల్లోకి వెళ్ళాడు. వెంటనే కిందికి దిగిన భగత్ సింగ్ ఆ మట్టిలో ఆడుకుంటూనే చిన్న చిన్న గడ్డిపరకలను నాటడం మొదలు పెట్టాడు. తండ్రి " ఏం చేస్తున్నావ్ నాన్నా" అని ప్రశ్నిస్తే, భగత్ సింగ్ ఇచ్చిన జవాబు విని వాళ్ళు అవాక్కయ్యారు. భగత్ సింగ్ అన్న మాటలు ఇవి " తుపాకులు నాటుతున్నా". భవిష్యత్తుకు బాల్యమే మొలక. మొలకలు వేసే వయస్సులో తుపాకులను మొలకెత్తించాలని చూడడం అతని వ్యక్తిత్వానికి మచ్చుతునక. విద్యార్థి దశలో స్కూల్లో కూడా ఆటపాటల్లోనే కాదు అందరితో కలివిడిగా ఉండేవాడు భగత్ సింగ్. బాబాయి సర్దార్ అజిత్ సింగ్ ఆంగ్లేయులతో పోరాడుతూ విదేశాల్లో ఉంటున్న సమయంలో, కంట నీరు పెట్టుకొనే చిన్నమ్మ హర్నామ్ కౌర్‌ను చూసి నాలుగేళ్ళ భగత్ సింగ్ " పిన్నీ ఏడవొద్దు. నేను ఆంగ్లేయులపై ప్రతీకారం తీర్చుకుంటా" అని ప్రతిజ్ఞలు చేసేవాడు. స్వామి దయానంద సరస్వతి అనుచరుడైన సింగ్ తాత అర్జున్ సింగ్ హిందూ సంస్కరణ ఉద్యమం, ఆర్యసమాజ్‌లో భాగం కావడం కూడా ఆయనపై విపరీతమైన ప్రభావం పడేందుకు

దోహదపడింది. ఆయన పినతండ్రులు అజిత్ సింగ్, స్వరణ్ సింగ్ తండ్రులు కర్తార్ సింగ్ సారభా గ్రివాల్ మరియు హర్ దయాల్ నేతృత్వంలోని గద్దర్ పార్టీ సభ్యులే. తనపై ఉన్న అపరిష్కృత కేసుల కారణంగా అజిత్ సింగ్ పెర్షియాకు పారిపోగా, కకోరి రైలు దోపిడీ 1925లో హస్తముందంటూ స్వరణ్ సింగ్‌ను 19 డిసెంబరు 1927న ఉరితీశారు. బ్రిటీషు సంస్థల యెడల పాఠశాల అధికారులకు ఉన్న విధేయత ఆయన తాతకు నచ్చకపోవడంతో భగత్ తన వయస్సు సిక్కులు వలె లాహోర్‌లోని ఖల్సా ఉన్నత పాఠశాలకు హాజరు కాలేదు. బదులుగా ఆర్య సామాజిక పాఠశాల దయానంద్ ఆంగ్లో వేదిక్ ఉన్నత పాఠశాలలో భగత్‌ను ఆయన తండ్రి చేర్పించాడు. 13 ఏళ్ల ప్రాయంలోనే మహాత్మా గాంధీ సహాయ నిరాకరణోద్యమానికి సింగ్ ప్రభావితుడయ్యాడు. ఆ సమయంలో బ్రిటీష్ ప్రభుత్వానికి ఎదురు తిరిగిన భగత్ ప్రభుత్వ పాఠశాల పుస్తకాలు మరియు బ్రిటీషు దిగుమతి దుస్తులను తగులబెట్టడం ద్వారా గాంధీ సిద్ధాంతాలను అనుసరించాడు. ఉత్తరప్రదేశ్‌లోని చౌరీ చౌరా గ్రామస్తులు పోలీసులను హింసాత్మకంగా హతమార్చిన నేపథ్యంలో ఉద్యమాన్ని గాంధీ ఉపసంహరించుకున్నాడు. ఆయన అహింసావాదంపై అసంతృప్తి చెందిన సింగ్ యువ విప్లవోద్యమంలో చేరి, తెల్ల దొరలకు వ్యతిరేకంగా హింసాత్మక ఉద్యమాన్ని ఉధృతం చేశాడు.

1923లో పంజాబ్ హిందీ సాహిత్య సమ్మేళన్ నిర్వహించిన వ్యాసరచన పోటీలో భగత్ విజయం సాధించాడు. దానితో పంజాబ్ హిందీ సాహిత్య సమ్మేళన్ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ భీమ్ సేన్ విద్యాలంకార్ సహా పలువురు సభ్యుల దృష్టిని ఆకర్షించాడు. ఆ వయసులోనే ప్రముఖ పంజాబీ సాహిత్యాన్ని ఉటంకించడమే కాక పంజాబ్ సమస్యలను ప్రస్తావించాడు. పంజాబీ రచయితలు మరియు సియోల్‌కోట్‌కు చెందిన తనకెంతో ఇష్టమైన కవి అల్లామా ఇక్బాల్ రాసిన పలు కవితలు, సాహిత్యాన్ని ఆయన పఠించాడు. యుక్త వయస్సులో ఉన్నప్పుడు భగత్ సింగ్ లాహోర్‌లోని నేషనల్ కాలేజీలో విద్యనభ్యసించాడు. అప్పుడే పెళ్లి చేసుకోవడం ఇష్టం లేని ఆయన ఇల్లు విడిచి పారిపోయి నౌజవాన్ భారత్ సభ ("భారత యువజన సంఘం")లో చేరాడు. నౌజవాన్ భారత్ సభ ద్వారా భగత్, ఆయన సహ విప్లవకారులు యువత దృష్టిని ఆకర్షించారు. ప్రొఫెసర్ విద్యాలంకార్ విజ్ఞప్తి మేరకు అప్పట్లో రామ్‌ప్రసాద్ బిస్మిల్ మరియు అష్ఫాఖుల్లా ఖాన్ నాయకత్వం వహిస్తున్న హిందూస్తాన్ గణతంత్ర సంఘంలోనూ సింగ్ చేరాడు. కకోరి రైలు దోపిడీ గురించి ఆయనకు అవగాహన ఉందని భావించారు. ఆయన అమృత్‌సర్ నుంచి ప్రచురించబడిన ఉర్దూ మరియు పంజాబీ వార్తాపత్రికలలో వార్తలను వ్రాశాడు మరియు సరిదిద్దాడు. సెప్టెంబరు 1928లో దేశవ్యాప్తంగా ఉన్న అనేక మంది విప్లవకారులు కీర్తి కిసాన్ పార్టీ పేరుతో ఢిల్లీలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. దానికి భగత్‌సింగ్ కార్యదర్శిగా వ్యవహరించాడు. అనంతరం సంఘం అధ్యక్షుడిగా భగత్ పలు విప్లవాత్మక కార్యక్రమాలు చేపట్టాడు. HRA ప్రధాన నాయకులను పట్టుకుని ఉరితీసిన కారణంగా ఆయన తన సహ విప్లవకారుడు సుఖ్‌దేవ్ థాపర్‌తో పాటు అనతికాలంలోనే ప్రత్యేక అధికారాన్ని చేజిక్కుంచుకోవడానికి కారణమైంది.

భగత్‌సింగ్ వర్ధంతి వ్యాసాలు

ఉరిశిక్ష ఖాయమన్న సంగతి తెలిసిన తర్వాతే కాదు అంతకు ముందు నుంచి కూడా కటకటాల వెనకాల భగత్ సింగ్ ఒక అధ్యయనశీలిగా కాలాన్ని గడిపాడు. రాజనీతి, అర్థశాస్త్రం, సామాజిక శాస్త్ర విషయాలను ప్రబోధించే అనేక గ్రంథాలను ఆయన అధ్యయనం చేశాడు. పుస్తకం చదువుతూ మధ్యలో హఠాత్తుగా లేచి అటూ ఇటూ తిరుగుతూ, విప్లవకారుడు రాంప్రసాద్ భిస్మిల్ వ్రాసిన ఈ పాటను పాడేవాడు.

మేరా రంగ్ దే బసంతీ చోలా
ఇసీ రంగ్ మే రంగ్ కే శివానే, మాకా బంధన్ ఖోలా
మేరా రంగ్ దే బసంతీ చోలా
యహీ రంగ్ హల్దీ ఘాటీ మే, ఖుల్ కర్కే థా ఖేలా
నవ్ బసంత్ మే, భారత్ కే హిత్ వీరోంకా యహ్ మేలా
మేరా రంగ్ దే బసంతీ చోలా

## తదనంతర విప్లవాత్మక కార్యక్రమాలు

లాలా లజపత్ రాయ్ మరణం మరియు సాండర్స్ హత్య 1928లో భారత్‌లోని వర్ధమాన రాజకీయ పరిస్థితిపై నివేదికను కోరుతూ సర్ జాన్ సైమన్ నేతృత్వంలో బ్రిటీష్ ప్రభుత్వం ఒక కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అయితే కమిషన్ సభ్యుడిగా ఒక్క భారతీయుడిని కూడా నియమించకపోవడంతో భారత రాజకీయ పార్టీలు దానిని బహిష్కరించాయి. ఫలితంగా దేశవ్యాప్తంగా పలు నిరసన ప్రదర్శనలు వెల్లువెత్తాయి. 30 అక్టోబరు 1928న కమిషన్ లాహోర్‌ను సందర్శించినప్పుడు సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా లాలాలజ్‌పత్ రాయ్ నేతృత్వంలో నిశ్శబ్ద అహింసా పద్ధతిలో ఒక నిరసన కార్యక్రమం జరిగింది. అయితే హింస తలెత్తడానికి పోలీసులు కారణమయ్యారు. లాలాలజ్‌పత్‌రాయ్ ఛాతీపై పోలీసులు లాఠీలతో కొట్టారు. దాంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటనను కళ్లారా చూసిన భగత్ సింగ్ ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించుకున్నాడు. పోలీసు అధికారి

భగత్‌సింగ్ వర్ధంతి వ్యాసాలు

స్కాట్‌ను హతమార్చడానికి విప్లవకారులు శివరామ్ రాజ్‌గురు, జై గోపాల్ మరియు సుఖ్‌దేవ్ థాపర్లతో ఆయన చేతులు కలిపాడు. స్కాట్‌ను గుర్తించిన జైపాల్ ఆయున్ను కాల్చమంటూ సింగ్‌కు సంకేతాలిచ్చాడు. అయితే పొరపాటు గుర్తింపు కారణంగా డీఎస్పీ J.P.సాండర్స్ కనిపించినప్పుడు సింగ్‌కు జై పాల్ సంకేతమిచ్చాడు. ఫలితంగా స్కాట్‌కు బదులు సాండర్స్ హతమయ్యాడు. దాంతో పోలీసుల కంట పడకుండా ఉండటానికి భగత్ లాహోర్ పారిపోయాడు. గుర్తు పట్టకుండా ఉండటానికి గడ్డాన్ని గీసుకోవడం, వెంట్రుకలు కత్తిరించుకోవడం ద్వారా సిక్కు మత విశ్వాసాల ఉల్లంఘనకు సింగ్ పాల్పడ్డాడు.

## అసెంబ్లీలో బాంబు

విప్లవకారుల చర్యలను అణచివేసే దిశగా భారత రక్షణ చట్టమును తీసుకురావడం ద్వారా పోలీసులకు బ్రిటీష్ ప్రభుత్వం మరింత అధికారం కల్పించింది. భగత్‌సింగ్ వంటి విప్లవకారుల ను అణచివేయడం ఈ చట్టం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. ఆ తర్వాత ప్రజాహితం కోసమేనంటూ ప్రత్యేక శాసనం కింద ఈ చట్టాన్ని ఆమోదించారు. అయితే ఆ చట్టాన్ని వ్యతిరేకిస్తూ అది ఆమోదితం కానున్న కేంద్ర శాసనసభపై బాంబు పేలుడుకు హిందూస్తాన్ సామ్యవాద గణతంత్ర సంఘం వ్యూహరచన చేసింది. బాంబు పేలుడుకు భగత్ సింగ్ ప్రయత్నించకుండా మరో ప్రముఖ విప్లవకారుడు చంద్రశేఖర్ ఆజాద్ అడ్డుకున్నాడు. అయితే సింగ్ ఆశయాలను అంగీకరించే విధంగా మిగిలిన పార్టీ సభ్యులు ఆయనపై ఒత్తిడి తీసుకొచ్చారు. అసెంబ్లీపై భగత్ సింగ్‌తో పాటు మరో విప్లవకారుడు 8 ఏప్రిల్ 1929న అసెంబ్లీ వసారాలపై సింగ్ మరియు దత్‌లు బాంబు విసిరి, "ఇంక్విలాబ్ జిందాబాద్! భగత్ సింగ్ రిమంబర్డ్ – డైలీ టైమ్స్ పాకిస్తాన్డీ-ని తర్వాత వినికిడి శక్తి కోల్పోయేలా గొంతెత్తి అరుస్తామని ముద్రించబడిన పలు కరపత్రాలను వెదజల్లారు. భగత్ సింగ్ రచనలు) కేంద్ర అసెంబ్లీ ఆవరణలో కరపత్రం విసిరివేత' బాంబు దాడి వల్ల ఏ ఒక్కరూ మరణించడం గానీ గాయపడటం గానీ జరగలేదు. తమ వ్యూహంలో భాగంగా ఉద్దేశ్యపూర్వకంగానే జాగ్రత్తలతో దాడి చేసినట్లు సింగ్, దత్ అంగీకరించారు. బాంబు గాయపరిచేటంత శక్తివంతమైంది కాదని బ్రిటీష్ ఫోరెన్సిక్స్ విచారణాధికారులు కూడా తేల్చి చెప్పారు. వాస్తవానికి బాంబు జనాలకు దూర బాంబు దాడి తర్వాత సింగ్, దత్ ఇద్దరూ లొంగిపోయారు. 12 జూన్ 1929న సింగ్ మరియు దత్ 'జీవితకాల దేశ బహిష్కరణ' కు గురయ్యారు.

## విచారణ మరియు ఉరి

సింగ్ అరెస్టు అనంతరం అసెంబ్లీ పేలుడుపై విచారణ నేపథ్యంలో J.P. సాండర్స్ హత్య వెనుక ఆయన హస్తంపై బ్రిటీష్ ప్రభుత్వం ఆరా తీసింది. హత్యకు సంబంధించి భగత్ సింగ్, రాజ్‌గురు మరియు సుఖ్‌దేవ్‌పై అభియోగాలు మోపారు. భారత స్వాతంత్ర్యానికి తన గళాన్ని వినిపించుకునేందుకు కోర్టునే ఒక ప్రచార వేదికగా మలుచుకోవాలని భగత్ సింగ్ నిర్ణయించు కున్నాడు. హత్యా నేరాన్ని అంగీకరించిన ఆయన విచారణ సమయంలో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా ప్రకటనలు చేశాడు. విచారణ సమయంలో HSRA సభ్యులు లేకుండా కేసు విచారణ కొనసాగించాలని ఆదేశించారు. తద్వారా సింగ్ తన భావాలను ఇక ఎప్పుడూ ప్రచారం చేయలేడనే ఆవేదనతో ఆయన మద్దతుదారులు తీవ్రంగా మండిపడ్డారు.

ఖైదీలు మరియు విచారణ ఖైదీల హక్కుల కోసం భగత్ సింగ్ మరియు ఇతర ఖైదీలు జైలులోనే నిరాహారదీక్ష చేపట్టారు. చట్టం ప్రకారం ఉత్తమ హక్కులు కల్పించాల్సిన భారత రాజకీయ ఖైదీల కంటే బ్రిటీష్ హంతకులు మరియు దొంగలకు ప్రాధాన్యత ఇవ్వడం దీక్షకు దారితీసింది. రాజకీయ ఖైదీలకు పౌష్టికాహారం, పుస్తకాలు, దినపత్రికల సదుపాయం, మంచి బట్టలు, టాయిలెట్ ఇతర దైనందిన సదుపాయాలు కల్పించడం వారి డిమాండ్లు. అలాగే కార్మిక లేదా హోదాకు తగని పనిచేసే విధంగా రాజకీయ ఖైదీలపై ఒత్తిడి తీసుకురాకూడదని సింగ్ డిమాండ్ చేశాడు. 63 రోజుల పాటు కొనసాగిన నిరాహారదీక్ష సింగ్ డిమాండ్లకు బ్రిటీష్ ప్రభుత్వం తలొగ్గడం ద్వారా ముగిసింది. తద్వారా ఆయనకు సాధారణ భారతీయుల్లో ఆదరణ పెరిగింది. దీక్షకు ముందు ఆయన ప్రాభవం ప్రధానంగా పంజాబ్ ప్రాంతం వరకే పరిమితమైంది.

కేంద్ర శాసనసభపై బాంబు దాడి జరిగినప్పుడు అక్కడున్న రాజకీయ నాయకుల్లో ఒకరైన మహ్మద్ అలీ జిన్నా లాహోర్ ఖైదీలకు బహిరంగంగానే తన సానుభూతి తెలిపాడు. నిరాహార దీక్షపై మాట్లాడుతూ "నిరాహారదీక్ష చేసే వ్యక్తిలో ఆత్మ ఉంటుంది. ఆ ఆత్మతోనే తను ముందుకు సాగుతాడు. తన పోరాటానికి న్యాయం జరుగుతుందని విశ్వసిస్తాడు" అని వ్యాఖ్యానించాడు. సింగ్ చర్యలపై మాట్లాడుతూ, "ఏదేమైనప్పటికీ, వారిని ఎక్కువగా నిందించినా మరియు ఎక్కువగా చెప్పినా వారు తప్పుదోవ పడుతారు. తద్వారా ఏర్పడే పాలనా ధిక్కార వ్యవస్థను ప్రజలు చీదరిస్తారు" అని అన్నాడు.

☞ మిగతా 20వ పేజీలో

# భగత్ సింగ్ రాజకీయ జీవితం ఒక ఉత్తమ పోరాట ఆదర్శం

దివి కుమార్
ప్రజాసాహితి

భగత్‌సింగ్ వర్ధంతి వ్యాసాలు

అమరవీరుడు భగత్ సింగ్ తన 24వ ఏటనే దేశం కోసం జీవితాన్ని బలిదానం గావించాడు. దేశభక్తికీ, త్యాగానికి, లౌకిక విలువలకూ, ఉత్తమ ఆదర్శాలకు ప్రతీకగా నిలిచాడు. అతను ఆకాశంలో తళుక్కున మెరిసి మాయమైపోయే మెరుపు కాదు, తొలిపొద్దును సూచించే, కర్తవ్య నిర్వహణకై దిక్కుని నిర్దేశించే వేగుచుక్క. నేటికీ మన యువతరానికి స్ఫూర్తిదాయకమైన మార్గదర్శకునిగా నిలిచే విశిష్ట వ్యక్తిత్వం భగత్ సింగ్‌ది.



భగత్‌సింగ్ రాజకీయ జీవితం సుమారు ఏడు సంవత్సరాలు. కానీ తను ఉరికంబమెక్కి ఆత్మబలిదానం గావించే నాటికి దేశమంతా బాగా ఎరిగిన గాంధీ అంత పేరున్నది భగత్ సింగ్‌కే. భగత్ సింగ్ యొక్క త్యాగపూరిత చరిత్రనూ అచంచల దేశభక్తినీ శ్లాఘించకుండా ఎవరూ ఉండలేరు. కనుక ఆయన తాత్త్విక, రాజకీయ, ఉద్యమపరమైన కృషినీ వాటి సారాన్నీ సాధ్యమైనంత మరుగుపర్చి, ఆయన్నొక హింసావాదపు టెర్రరిస్టు వీరునిగా ప్రజలు అభిప్రాయపడేట్లు చేయటం ఒక రాజకీయ విధానంగా అమలు జరుగుతూ వస్తోంది. భూస్వామ్య ధనిక వర్గాల ప్రయోజనాలకు నష్టం కలుగని "స్వాతంత్ర్యాన్ని" ఆశించిన నాయకులకు భిన్నంగా, అత్యంత స్పష్టంగా స్వాతంత్ర్యం అంటే కార్మిక-కర్షక రాజ్యంగా, ఒక వ్యక్తిని మరొక వ్యక్తి దోపిడీ చేసే అవకాశం లేని "సోషలిజం" లక్ష్యంగా ఉద్యమించాలని, అది విప్లవాత్మకమైన మార్పుగా వుండాలని బలంగా ఒక శ్రామికవర్గ ప్రత్యామ్నాయాన్ని దేశం ముందు నిలిపిన క్రాంతదర్శి కామ్రేడ్ భగత్ సింగ్. 'నవ జవాన్ భారతసభ' ప్రధాన కార్యదర్శిగా విప్లవ ఆశయాన్ని, సామ్రాజ్యవాద వ్యతిరేక దేశభక్త చైతన్యాన్ని ప్రజలలోకి ప్రత్యేకించి యువకులలో వ్యాప్తి చెందేట్లు తీవ్రంగా కృషి చేశాడు. సిక్కుల గురుద్వారాలపై మహంతులనే పూజారి వర్గపు ఆధిపత్యానికి నిరసనగా ప్రజాస్వామికంగా ఎంపిక చేయబడిన కమిటీలుండాలనే ఉద్యమానికి (బబ్బర్ ఖాల్సా) అండదండలిచ్చి 'అకాలీ'ల సాంఘిక సంస్కరణోద్యమానికి భగత్ సింగ్ సాహసోపేతంగా ముందుకొచ్చి సహాయ సహకారాలందించాడు.

తనకంటే ముందు విప్లవకారులుగా కృషి చేసిన గదర్ వీరుల నుండి లౌకిక చింతనను, త్యాగనిరతిని ఆయన అలవరచుకున్నాడు. తన తొలి ఉద్యమ నిర్మాణరూపమైన హిందుస్తాన్ రిపబ్లికన్ అసోసియేషన్ (ఆర్మీ)లోని కార్యక్రమం-పంథాల కొరతలను అధిగమించి, తనను తాను మెరుగు పరుచుకుంటూ ''టెర్రరిజం నుండి మార్క్సిజం" దాకా ఎదిగాడు. హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ గా తమ సంస్థ పేరుని రూపొందించాడు.

భగత్ సింగ్ రాజకీయరంగ ప్రవేశం చేయడానికి ముందు అన్ని రకాల స్వాతంత్రోద్యమకారులకు "వందేమాతరం" ఒక నినాదంగా వుండేది. అప్పటికా నినాదం పుట్టి 30 సంవత్సరాల పైనే అయినా, బెంగాల్ విభజనానంతరమే (1905) అది దేశవ్యాపిత నినాదంగా ప్రాచుర్యం పొంది, ప్రేరణాత్మకంగా వుండేది. వందేమాతరంలో కొంత సాంప్రదాయక మార్మికత, మరికొంత ఉద్వేగ భావావేశం మిశ్రమమై వున్నాయి. నిర్దుష్ట కార్యాచరణను సూచించేదిగా అదిలేదు. దానికన్నా బాలగంగాధర తిలక్ నినదించిన "స్వాతంత్ర్యం నా జన్మహక్కు"లో స్పష్టత, సూటిదనం ఎక్కువ వున్నాయి. లాహోరు కాంగ్రెసు (1929) దాకా అంటే తాను పుట్టిన 44 సంవత్సరాలదాకా "సంపూర్ణ స్వాతంత్ర్యం" కోరుతూ కాంగ్రెసు పార్టీ తీర్మానం చేయలేక పోయిందనేది గమనంలో వుంచుకుంటే తిలక్ యిచ్చిన "స్వాతంత్ర్యం నా జన్మహక్కు" అన్న నినాదం యొక్క ప్రాముఖ్యత మనకు అర్థమవుతుంది.

"విప్లవం వర్ధిల్లాలి" అనే నినాదాన్ని ప్రాచుర్యంలోకి తేవడానికి ముందు నవజవాన్ భారత్ సభవారి నినాదం "హిందుస్థాన్ జిందాబాద్', తర్వాత కాలంలో సుభాసుచంద్రబోసు యిచ్చిన "జైహింద్"కూ దీనికీ పెద్ద భేదం లేదు. అయితే "హిందు" అనేది ప్రాంతీయ నామంగా ప్రాచుర్యంలో వుందనేది ఎరగనివారు

భగత్‌సింగ్ వర్ధంతి వ్యాసాలు

దాన్ని మతపరమైనదిగా భావించే అవకాశం వుంది. యువకుల్ని రాజకీయ కార్యాచరణకు ప్రోత్సహించాల్సిన సంస్థ యిచ్చే నినాదం విస్పష్టంగా వినిపించాలి. మిగిలిన రాజకీయ వాదులకూ తమకూ గల భేదాన్ని సూచించే విధంగా సూటిగా, వాడిగా, వేడిగా వుండాలి. అలా రూపొందినదే "ఇంక్విలాబ్ జిందాబాద్" అన్న నినాదం. దేశవ్యాపితంగా ఎక్కువ ప్రాచుర్యంలో వున్న "వందేమాతరం" నినాదం స్థానంలో "విప్లవం వర్ధిల్లాలి" (ఇంక్విలాబ్ జిందాబాద్) అనే దాన్ని విస్తృతంగా వ్యాప్తిలోకి తెచ్చినవాడు భగత్ సింగ్. భగత్ సింగ్, ఆయన తోటి కామ్రేడ్సు విప్లవాన్ని స్పష్టంగా నిర్వచించారు. సామ్రాజ్యవాదాన్ని భారతదేశం (భూప్రపంచంలో) లేకుండా జేయటం వారి విప్లవలక్ష్యాలలో మొదటిది. శ్రమజీవుల రాజ్యం ఏర్పడి కార్మిక, కర్షకుల పునాదిగా సోషలిజం, సామ్యవాద వ్యవస్థ నిర్మాణం కావాలని ఆశించిన సుందర స్వాప్నికుడు, ఆశాజీవి భగత్ సింగ్. విప్లవం ద్వారానే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధిస్తుందని విప్లవకారుల విశ్వాసం. విదేశీ పాలకులతోనూ, వారి తొత్తులతోనూ, సమరశీల పోరాటం జరగాలని మాత్రమే కాదు. ఈ పోరాటంతో పాటుగానే, నూతన సామాజిక వ్యవస్థ ద్వారా దేశాన్ని విముక్తి చేయాలన్నది కూడా వారు అవగాహన చేసుకున్న, కృషి చేస్తున్న విప్లవానికి అర్థం.

''పెట్టుబడిదారీవర్గాలను, దాని విధానాన్ని ప్రత్యేకాధికారాలను కొంత మందికి మాత్రమే కట్టబెట్టే పద్ధతిని విప్లవం అంతమొందిస్తుంది. అది జాతిని తన కాళ్లమీద తాను నిలబడేలా చేస్తుంది. ఆ విధంగా ఒక కొత్త జాతి, ఓ సరికొత్త సమాజమూ వూపిర్లు పోసుకుంటాయి. విప్లవం వల్ల అన్నిటికన్నా ఎక్కువగా ఒన గూడేదేమిటంటే–అది రాజకీయాధికారాన్ని గుప్పెట్లో పెట్టుకొని కూచున్న అవాంఛనీయమైన సామాజిక శక్తులన్నింటినీ పూర్తిగా తుడిచిపెట్టేసి, రైతు కూలీ రాజ్యాన్ని నెలకొల్పుతుంది"

***(బాంబుతత్త్వం–ఫిలాసఫీ ఆఫ్ బాంబ్ – కరపత్రం నుండి)***

"సామ్రాజ్యవాదుల ఆధిపత్యాన్ని పీకి పారేయడానికి భారతదేశంలో వొకేవొక్క ఆయుధం వుంది. అది శ్రామికవర్గ విప్లవం. దానితో తప్ప మరెలాంటి మార్గం ద్వారా ఈ ఆశయం పరిపూర్తి కాదు".

"టెర్రరిస్టు కార్యాచరణని మనం పూర్తిగా అంగీకరించటం లేదని వేరే చెప్పనవసరం లేదనుకుంటాను. మనం శ్రామికవర్గ దృక్కోణంలో టెర్రరిజాన్ని సరిగ్గా విశ్లేషిస్తున్నాం"

(భారత జాతీయ విముక్తి పోరాటం దిశలు–భగత్ సింగ్)

"ఇంక్విలాబ్ జిందాబాద్" నినాదం ప్రాచుర్యం పొందేలా వ్యాప్తిలోకి తెచ్చేనాటికే దానిపట్ల భగత్ సింగ్ కి స్పష్టత వుంది. ఆనాటికి ప్రపంచవ్యాపితంగా పెట్టుబడిదారీ విధానం భయంకరమైన ఆర్థిక సంక్షోభం (1929–33)లో కూరుకుపోయి వుంది. సామ్రాజ్యవాదం నుండి పూర్తి విముక్తి పొందాలని భావించే దేశభక్తి గల జాతీయ శక్తులన్నిటికీ సోవియట్ యూనియన్‌లోని శ్రామిక శ్రేయోరాజ్యం ఆర్థిక సంక్షోభరహితంగా అభివృద్ధిపథంలో సాగుతూండటం కూడా గొప్ప స్ఫూర్తినిచ్చింది. భగత్ సింగ్ లాంటి వారు విప్లవాన్ని వొక తాత్త్వికస్థాయిలో అర్థం చేసుకుని ప్రతి చారిత్రక మలుపులోనూ విప్లవాత్మక చైతన్యం ఆవశ్యకతని గుర్తించారు. గాంధీయిజపు సర్దుబాటు తత్వాన్ని జీర్ణం చేసుకోలేని యువతరమంతా "ఇంక్విలాబ్ జిందాబాద్"ను తమ నినాదంగా స్వీకరించి కాశ్మీరు నుండి కన్యాకుమారిదాకా మార్మోగించారు. ఏనాటికీ సజీవతను కోల్పోని నినాదం అది. అందుకే ఇంకా దాని ధ్వనులూ, ప్రతిధ్వనులు మనం వింటూ వున్నాము. దూరదృష్టి గల రాజకీయ నాయకునిగా ప్రాసంగికత (రెలవెన్స్) కోల్పోని నినాదాన్ని దేశానికి అందించిన ఘనత భగత్ సింగ్‌దే.

ఒక రాజకీయ నినాదాన్ని ప్రాచుర్యంలోకి తీసుకువెళ్ళటం, సమయోచిత నిర్ణయాలు తీసుకుని సమర్థవంతంగా అమలు జరపటం అనేది ఆచరణాత్మకమైన ఎత్తుగడల నాయకత్వపు విశిష్ట లక్షణం. ఎత్తుగడలంటే పూటకొక రకంగా స్ఫురించిన ప్రతి వినూత్న పథకాన్ని అమలు చేయించటం లేక చేయటం కాదు. ఎత్తుగడ అంటే వ్యూహానికి అనుగుణంగా అనగా తాము సాధించదలుచుకున్న లక్ష్యానికి అతిసులువుగా, అతి తక్కువ నష్టంతో చేరుకునే విధంగా నడిపించగలిగిన ఉద్యమ, నిర్మాణపరమైన రాజకీయకార్యాచరణ. శత్రువు వ్యూహాన్ని ఎత్తుగడలను సక్రమంగా అర్థం చేసుకుని, తమ బలాన్ని శక్తి సామర్థ్యాలను బేరీజు వేసుకుని ఆచితూచి తీసుకోవలసిన ఆచరణాత్మక విధాన నిర్ణయం .

చట్టబద్ధ – చట్ట వ్యతిరేక పోరాటాల్ని సమన్వయించటం భగత్ సింగ్‌లో పిండరూపంలో కనిపిస్తుంది. అలాగే కాంగ్రెసు రాజీకోరుతనాన్ని వ్యతిరేకిస్తూనే, బ్రిటీషువారికి వ్యతిరేకంగా ప్రజల్ని బజారులోకి కదిపినందుకు వారిని అభినందించాల్సిందే నంటాడు. ఉద్యమాచరణలో లాలాలజపతిరాయ్ లాంటి ఛాందసవాదితో కూడా కలసి సైమన్ కమీషన్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన చేసాడు. చేయని నేరానికి (1927లో) బంధించినందుకు చట్టబద్ధ పోరాటం చేసి విడుదలై వచ్చాడు. తామే విసిరిన బాంబులను, తాము విసరలేదని కానీ, అందుకై క్షమాభిక్షను పెట్టమని గానీ ప్రకటించలేదు. కోరలేదు. ఇవన్నీ

పట్టువిడుపులతో భగత్ సింగ్ అనుసరించిన ఎత్తుగడలు. వీటిని ఇంకొంత వివరంగా చూద్దాం.

లాహోరు కేంద్రంగా భగత్ సింగ్ ప్రధాన కార్యదర్శిగా 1925లో ప్రారంభమైన "నవజవాన్ భారత్ సభ" సంపూర్ణ స్వతంత్రం సాధించాలనీ, కార్మిక–కర్షక రాజ్యం స్థాపించాలని సోషలిస్టు సమాజాన్ని నిర్మించాలనే లక్ష్యంతో ఏర్పడింది. "సాధ్యమైన అన్ని మార్గాల ద్వారా" పై కార్యక్రమాన్ని నెరవేర్చ వచ్చని భావించారు. వ్యక్తిగత హింసావాదాన్ని సభ తిరస్కరించిందని ఆనాటి దాని అధ్యక్షుడు రామచంద్ర అనే ఆయన 1986లో రాశారు. గత కాలపు విప్లవకారుల నుండి ఒక స్పష్టమైన విభజన మాత్రం వుంది. ప్రజలలోకి ముఖ్యంగా విద్యార్థి యువజనులలోకి వెళ్లి తమ సంస్థ ఆశయాలను, దేశం కోసం త్యాగం చేయ్యాల్సిన ఆవశ్యకతను, బ్రిటీషు సామ్రాజ్యవాదుల దోపిడీ అణచివేతలను వివరించి వారిని ఆకర్షించేవారు 1928లో అమృతసర్‌లో జరిగిన పంజాబ్ కాంగ్రెసు సభలలో "యువజన" సభను కూడా సమన్వయం చేసి జరపటమే కాక, కాంగ్రెసుకున్న 3 రంగుల జెండాను ఎర్రజెండాగా మార్చుకోవాలనీ, రాజకీయాలలోకి మతాన్ని చొప్పించకూడదనీ, మతం వ్యక్తిగత అంశంగా పరిగణించాలని తీర్మానం కూడా చేశారు. 1926లో "సభ" తరఫున కేంద్ర రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో కూడా పాల్గొన్నట్లు రామచంద్ర రాశారు. 1927లో బ్రిటీషు ప్రభుత్వం భగత్ సింగ్‌ను అక్రమంగా అరెస్టుచేసి జైల్లో పెట్టింది. కోర్టులలో చట్టబద్ధ పోరాటం చేసి తాను నిర్దోషిననిపించుకుని నెలరోజులలో భగత్ సింగ్ బయటకు వచ్చాడు.

హిందూస్తాన్ రిపబ్లికన్ అసోసియేషన్‌ను హిందూస్తాన్ సోషలిస్టు రిపబ్లిక్ అసోసియేషన్‌గా మార్పు తీసుకునేట్టు చేయటంలో భగత్ సింగ్‌దే కీలకపాత్ర. 1928 సెప్టెంబరు 8–9 తేదీలలో ఢిల్లీ ఫిరోజ్ షా కోట్ల లోపల జరిగిన ఈ సమావేశానికి చంద్రశేఖర ఆజాద్ సాంకేతిక కారణాల వలన హాజరు కాకపోయినా, ఆయనతో ముందుగానే చర్చించి "సోషలిస్టు" పదం మార్పుకు ఆమోదం పొంది వున్నాడు. పాతసంస్థలో చురుకుగా పనిచేసి, అరెస్టు కాకుండా రహస్యంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న నాయకుడు ఆజాద్. చదువు తక్కువా, ఆర్య సమాజపు ప్రభావము ఎక్కువా గల ఆజాద్ తన పేదరికపు జీవితానుభవం నుండి సోషలిజాన్ని మనఃస్ఫూర్తిగా ఆమోదించాడు. పార్టీ యొక్క సైనిక విభాగానికి ఆజాదే సర్వసైన్యాధిపతి. ప్రజాకార్యకలాపాలు నిర్వహించాలనీ, సైమన్ కమీషను వ్యతిరేకంగా ఆందోళన నిర్మించాలనీ స్వాతంత్ర్యమంటే కార్మిక–కర్షక రాజ్యమనే భావాన్ని, అదీ విప్లవం ద్వారానే సాధ్యమనే ఆలోచనను యువజనులలో వ్యాప్తి చేయాలని నిర్ణయించారు. చాలామంది అనుకున్నట్టు సాండర్స్ హత్య తరువాత లాహోరు నుండి కలకత్తాకు తప్పించుకు పోవాల్సిన సమయంలో దొరవేషం కోసం భగత్ సింగ్ "సిక్కు" తల వెంట్రుకలూ, గడ్డము తీసివేయించుకున్నాడన్నది నిజం కాదు. పార్టీ సెంట్రలు కమిటీ సమావేశం (1928 సెప్టెంబరు) కంటె ముందే సిక్కుల కుండే శిగను, పెరిగిన గడ్డాన్ని భగత్ సింగ్ 'ట్రిమ్' చేయించాడు.

భగత్‌సింగ్ వర్ధంతి వ్యాసాలు

1928 అక్టోబరు 30వ తేదీనాడు లాహోరుకు వేంచేయనున్న సైమన్ కమీషన్‌కు వ్యతిరేకంగా ప్రజాందోళనను ఉద్యమరూపంగా వ్యక్తమయేట్టు కృషి చేయాలని నవజవాన్ భారత సభ, హిందుస్తాన్ సోషలిస్టు రిపబ్లిక్ అసోసియేషన్ నిర్ణయించాయి. అప్పటికే లాలాలజపతిరాయ్ హిందూ మహాసభలాంటి అభివృద్ధి నిరోధక, మతతత్త్వ సంస్థలవైపు స్పష్టంగా మొగ్గును కలిగి వున్నాడు. అయినా ప్రజలలో ఆయనకు గల పలుకుబడి, ప్రతిష్టలను పరిగణనలోకి తీసుకుని ఆందోళనకు ఆయన్ను నాయకునిగా నిలిపి, యువకులను ఆయనకు తోడుగా వెంట నడిపారు. ఆనాడు బ్రిటీషు పోలీసు అధికారులు ఎంచుకుని కొట్టిన లాఠీ దెబ్బలకు లజపతిరాయ్ ఆసుపత్రిపాలై తరువాత మరణించాడు. అప్పటికి 20–25 సంవత్సరాలుగా పంజాబ్‌లో బ్రిటీషు దమనకాండ అత్యంత దారుణంగా అమలు జరుగుతోంది. రైతుల పైనే కాక సిక్కు మతంలో ప్రజాస్వామిక సంస్కరణలు కోరే వారిపైనా, గదరా పార్టీ కార్యకర్తల సానుభూతిపరులపైనా, శాంతియుతంగా బ్రిటీషు పాలనావిధానాలను. "రౌలట్" లాంటి నిరంకుశచట్టాలను నిరసించే ప్రజల పైనా జలియన్‌వాలాబాగ్ లాంటి దురంతాలను అమలు జరిపారు. లాలాలజపతిరాయ్ హత్యతో దేశమంతటా బ్రిటిషు సైనిక, పోలీసు నిరంకుశ పాలనపై నిరసన వెల్లువెత్తి వుంది.

భారతీయులు, పంజాబీలు పౌరుష హీనులనే ఆత్మన్యూనత కు గురవుతూండిన వాతావరణంలో సాండర్స్ హత్య దేశం దేశమంతా లాహోరువైపుకీ, నవజవాన్ భారత్ సభ, హిందూస్తాన్ సోషలిస్టు రిపబ్లికన్ సంస్థ వైపుకీ దృష్టిసారించే విధంగా ఆకర్షింపబడింది. జవహర్‌లాల్ నెహ్రూ మాటల్లో చెప్పాలంటే– "ఆ సమయము నందు భగత్ సింగ్, లజపతిరాయ్ గౌరవాన్నీ తద్వారా జాతి గౌరవాన్ని రక్షించాడని అందరూ భావించారు" (ఆత్మకథ).

**భగత్‌సింగ్ వర్ధంతి వ్యాసాలు**

నిజానికి చంపాలనుకొన్నది స్కాట్ అనే బ్రిటీషు అధికారిని. కానీ ఆకారాలు పొరబడి అందించిన సంకేతం కారణంగా సాండర్స్ హతుడైనాడు. ప్రజలకు సంబంధించినంత వరకు పేరులతో, వ్యక్తులతో నిమిత్తం లేదు. తమ ఆగ్రహానికి ఒక తెల్లదొర నట్టనడిబజారులో హతుడయినాడన్నదే వారి భావన.

1929 ఏప్రిల్ 8వ తేదీన ఢిల్లీ సెంట్రల్ అసెంబ్లీలో భగత్ సింగ్, బటుకేశ్వరదత్తులు బాంబులు విసరటం అనే నిర్ణయం వెనుక చైతన్యవంతమైన రాజకీయ దృష్టి వుంది. భారతీయులకు ప్రమాదకరమైన కార్మిక వ్యతిరేక, ప్రజావ్యతిరేక బిల్లులను రెండింటిని బ్రిటిషు ప్రభుత్వం కేంద్ర అసెంబ్లీ ఆమోదానికి రంగాన్ని సిద్ధం చేసుకుంది. అందులో ఒకటి–పారిశ్రామిక వివాదాలచట్టం (ఇండస్ట్రియల్ డిస్పూట్స్ యాక్ట్), రెండవది–ప్రజారక్షణ చట్టం (పబ్లిక్ సేఫ్టీ యాక్ట్)

అప్పటికే బొంబాయి, కలకత్తా, కాన్పూరు, మద్రాసు లాంటి నగరాల్లో కార్మికవర్గం తమ సొంత డిమాండ్లకోసం, స్వాతంత్రోద్యమానికి సంఘీభావంగా పెద్దఎత్తున వీధుల్లోకి వస్తున్నారు. కార్మికుల పోరాటాలను అణచటానికి, వారి నాయకులను విచారణ లేకుండా ఏళ్ల తరబడి జైళ్లపాలు గావించటానికి ప్రభుత్వం కుట్రపన్నింది. దురాక్రమణదారులైన బ్రిటీషు సామ్రాజ్యవాదుల ప్రభుత్వ భద్రతకు విఘాతం కలిగించే చర్యలూ, ప్రసంగాలూ కూడా చట్టవిరుద్ధమైనవుతాయనీ, అవి ప్రజాభద్రతకు కూడా నష్టం కలిగించినవిగా పరిగణించి నిర్బంధించే చట్టబద్ధ అధికారాలను ప్రభుత్వానికి పై బిల్లులు సమకూరుస్తాయి. అవి ఆమోదింపబడటం నిజానికి దేశం మొత్తానికి నష్టకరం. కేంద్ర అసెంబ్లీలోని పచ్చి మితవాద భారతీయులు కూడా ఆ బిల్లులను వ్యతిరేకించారు. బిల్లులకు అనుకూలంగా, వ్యతిరేకంగా చేరి 61 ఓట్లు లభించి సమానమయింది. (టై) అప్పటి సభాధ్యక్షుడు విఠల్ బాయ్ పటేల్ తమ ఓటుని బిల్లుకు వ్యతిరేకంగా వేశాడు. ఆ విధంగా బిల్లు వీగిపోయినా, వైస్రాయ్ ఆర్డినెన్స్ ద్వారా దాన్ని అమలు జరుపుకునే హక్కు ఆనాటి పాలకులు కలిగి వున్నారు.

అటువంటి పరిస్థితులలో ప్రభుత్వం బిల్లును నిరంకుశంగా ఆమోదింప జేసుకున్నట్టు ప్రకటించిన వెంటనే భగత్ సింగ్, బటుకేశ్వరదతులు కేంద్ర అసెంబ్లీలో (ఇపుడు దాన్నే పార్లమెంటు అంటున్నారు) మనుషుల ప్రాణాలకు హాని చేయని, శబ్దం ఎక్కువ వచ్చే పొగబాంబులు విసిరారు. తప్పించుకు పారిపోవటానికి అవకాశం వున్నా నిర్భయంగా గ్యాలరీలోనే నిలబడి నినాదాలిచ్చారు. తమ ఆశయాలను తెలియపర్చే కరపత్రాలను వెదజల్లారు. ప్రజల్నీ, కార్మికుల్నీ మరిన్ని సమరశీల పోరాటాలకు సమాయత్తులు కండంటూ పిలుపునిచ్చారు. ఉరికంబం ఎక్కవలసి వస్తుందని తెలిసీ కూడా అరెస్టవటానికే సిద్ధపడి వున్నారు.

వారప్పుడు యిచ్చిన నినాదాలు వారి రాజకీయ, సామాజిక దృక్కోణాన్ని స్పష్టం చేస్తాయి. అవి సామ్రాజ్యవాదం నశించాలి! కార్మికవర్గం వర్ధిల్లాలి!! విప్లవం వర్ధిల్లాలి!!!

ఆనాటి చారిత్రక పరిస్థితులలో స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెసు పార్టీ, బ్రిటీషు సామ్రాజ్యవాదులతో అడుగడుగునా రాజీపడుతూ, ఉన్నత సంపన్నవర్గాల ప్రయోజనాలకు భంగం కలుగకుండానూ, పుట్టి 44 సంవత్సరాలైనా ఇంకా సంపూర్ణ స్వాతంత్ర్యం సాధించటమే పార్టీ లక్ష్యంగా ప్రకటించుకోకుండానూ వుంటే శ్రామికవర్గ దృక్కోణంతో హిందుస్తాన్ సోషలిస్టు రిపబ్లిక్ అసోసియేషన్ తరపున భగత్ సింగ్ – బటుకేశ్వరదత్ తమ విస్పష్టగళాన్నీ, భావజాలబలాన్నీ వినిపించారు, ప్రదర్శించారు.

పార్టీ నిర్ణయం ప్రకారం, భగత్ సింగ్ నేతృత్వాన జైళ్ళలో సంస్కరణల కోసం, రాజకీయ ఖైదీల హక్కుల కోసం, బ్రిటీషు న్యాయంలోని సామ్రాజ్యవాదతత్త్వాన్ని బహిర్గతపరుస్తూ సాగించిన ఆందోళన కూడా చాలా ప్రాముఖ్యంగలది. విప్లవకారుడు జనంలో వున్నా, జైల్లోవున్నా "అలజడి మా జీవితం. ఆందోళన మా ఊపిరి, దోపిడీ వ్యవస్థపై తిరుగుబాటు మా వేదాంతం" అంటూనే పోరాడుతాడని భగత్ సింగ్ రుజువుపర్చాడు. ఆనాటి కాంగ్రెసులోని "పెద్ద" నాయకులకు బ్రిటిషు పాలకులు కల్పించిన సౌకర్యాలూ, భగత్ సింగ్ తదితర కామ్రేడ్ పట్ల నిర్దాక్షిణ్యంగా వ్యవహరించిన తీరులోని వ్యత్యాసం కూడా వారి వారి వర్గ ప్రాతిపదికకు నిదర్శనంగా నిలుస్తాయి.

భగత్ సింగ్ ప్రభృతులపట్ల బ్రిటిషుపాలకులు వ్యవహరించిన అమానవీయ, అప్రజాస్వామిక పద్ధతులను కేంద్ర అసెంబ్లీలో ముస్లింలీగు నాయకుడు మహమ్మదాలీ జిన్నా తీవ్రంగా విమర్శిస్తూ ప్రసంగించాడు. కానీ 'అహింసామూర్తి' గాంధీ అటువంటి ప్రయత్నమేమీ చేయలేదనే సత్యాన్ని మరుగు పర్చాల్సిన అవసరమేమీ లేదు.

జైలును, కోర్టును కూడా పోరాట వేదికగా మార్చటమేకాక భగత్ సింగ్ దాన్నొక అధ్యయన కేంద్రంగా చేసుకున్నాడు. క్రూర నిర్బంధ వాతావరణం మధ్య కూడా ప్రపంచ చరిత్రనూ, దేశీయ చరిత్రనూ, సాహిత్యాన్నీ, విప్లవ సిద్ధాంత అన్వయాలనూ అధ్యయనం చేశాడు. తను ఉరికంబం మీద మరికొద్ది నిమిషాలలో

శవమై వేలాడవలసి వస్తుందని తెలిసినా, ఆఖరి నిమిషందాకా ఆయన చదువుతుండిన పుస్తకం లెనిన్ జీవిత చరిత్ర. ఆరోజు ఉదయమే భగత్ సింగ్‌కు మిత్రుడూ, లాయరూ అయిన ప్రాణనాథ్ మెహతా తెచ్చి యిచ్చాడు. ఈ రాత్రిలోగా దీన్నిచదివేస్తానన్నాడట భగత్ సింగ్. లెక్కప్రకారం మరుసటి రోజు మార్చి 24 ఉదయం ఉరి తీయాలి. కానీ ఆ సాయంత్రమే అది జరిగిపోతుందని వారికి తెలియదు. అందుకే "సర్దార్జీ ఉరికి వేళయింది. మీరిక బయలుదేరాలి" అని జైలువార్డరు చెప్పగానే తను తదేకంగా చదువుతున్న పుస్తకం చేతుల్లో వుంచుకునే "ఒక విప్లవకారుడు మరొక విప్లవకారునితో సంభాషిస్తున్నాడు. అవతలికెళ్ళండి" అన్నాడు. తీరా ఉరికంబంవైపు వెళ్ళవలసి వచ్చేసరికి తాను ఎక్కడ వరకు లెనిన్ జీవిత గ్రంథాన్ని చదివాడో అంతవరకు తెరచివుంచి, తను వదలి వెళ్ళిన కర్తవ్యాన్ని లెనిన్ మార్గంలో పూర్తిచేయండి. అన్నట్టు భారతీయ యువకులకు ఆఖరి సందేశాన్నిచ్చి వెళ్ళాడు.

పెట్టుబడి గుత్త పెట్టుబడిగా, ద్రవ్య పెట్టుబడిగా, ప్రపంచ దేశాల మార్కెట్లను, సంపదలను కొల్లగొట్టే సామ్రాజ్యవాదంగా మారిన తర్వాత దాన్ని పెట్టుబడిదారీ విధానపు పతన దశగానూ, ప్రపంచస్థాయి అభివృద్ధి నిరోధకశక్తిగానూ లెనిన్ సిద్ధాంతీకరించాడు. దాన్ని ఆకళింపు చేసుకున్న వారిలో భగత్ సింగ్ కూడా ఒకడు. అందుకే అతను ఉరికంబంమీద వేలాడటానికి ముందు యిచ్చిన "సామ్రాజ్యవాదం నశించాలి" "విప్లవం వర్ధిల్లాలి" అనే నినాదాలు 17 ఏళ్ళ యువకుని కాలంలో యిచ్చిన వాటికంటే మరింత అర్థవంతమైనవి. చైతన్యపూరితమైనవి.

గత 73 సంవత్సరాలలో ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు మరెందరో వీరులు అమరులు కావటాలూ జరిగినప్పటికీ విప్లవం విజయవంతం కాలేదన్నది ఎంత సత్యమో ప్రపంచంలోనే కాదు భారతదేశంలో కూడా సామ్రాజ్యవాదం నశించలేదన్నది అంతే సత్యం. గాంధీ తరహా నాయకత్వం సామ్రాజ్యవాదంతో రాజీతో పోరాటాన్ని నిలిపివేస్తుందని భగత్ సింగ్ సరిగా అంచనాకట్టాడు. తమ ప్రయోజనాలకు, తమ దళారీ శక్తుల ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా ఒప్పందాలు, షరతులతో కూడిన "అధికార మార్పిడి"నే భారత, పాకిస్తాన్ పాలకులు స్వాతంత్ర్యం అంటున్నారు. బ్రిటీషు పాలకులు కోరుకున్న విధంగానే దేశాన్ని రెండుగా మత ప్రాతిపదికన విభజించారు. మారిన

ప్రపంచ పరిస్థితులలో అమెరికా సామ్రాజ్యవాదపు అగ్రరాజ్యతత్వానికి భారత పాకిస్తాను పాలకులు తలలూపుతున్నారు. సహాయం-అప్పు-తాకట్టు-అమ్మకం" అనే దశల గుండా స్వాతంత్రాన్ని నడిపించి ఈనాడు సంపూర్ణంగా బహుళ జాతి కంపెనీల బహుముఖ దోపిడీకి అదుపు అడ్డంకి లేకుండా స్వాగత సత్కారాలు కల్పిస్తున్నారు. ఒకనాటి ప్రత్యక్ష వలస దోపిడీ కాలంలో (భగత్ సింగ్ వాళ్ల కాలంలో) వలె నేడూ కరువు కాటకాలతో, గ్రామీణ పేదరికం, పట్టణాలకు వలసలతో, కనీస హక్కులు కూడా కోల్పోయిన స్థితిలో కార్మిక-కర్షకుల జీవితాలు తిరిగి సామ్రాజ్యవాదుల ప్రపంచీకరణ రథచక్రాలకు కట్టివేయబడ్డాయి.

**భగత్‌సింగ్ వర్ధంతి వ్యాసాలు**

కేవలం 7 సంవత్సరాల రాజకీయ జీవితకాలంలో విప్లవ దార్శనికతనీ, సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ చైతన్యాన్నీ, విస్పష్టమైన సోషలిస్టు లక్ష్యాన్ని చాటటంతో పాటు వాటిని సాధించటానికి అవసరమైన అంకుఠిత దీక్షాతత్వాన్నీ, త్యాగనిరతిని ప్రదర్శించిన భగత్ సింగ్‌ను ఈ దేశ పాలకులు సాధ్యమయినంత వరకు విస్మరించే పనిలోనే వున్నారు. ప్రతిదశలోనూ నిజమైన లౌకికవాదిగా జీవించిన భగత్ సింగ్‌ను లౌకికవాదిగా స్మరించని భారతీయ జనతాపార్టీ పాలకులు సావర్కారుని వీరునిగా ప్రదర్శిస్తున్నారు. తన జీవితకాలంలో అండమాను జైలుకు రాక పూర్వం వరకే విప్లవకారునిగా జీవించి తరువాత 3 సార్లు బ్రిటీషు పాలకులకు, 2 సార్లు కాంగ్రెసువారికీ "లొంగుబాట్లు" (అండర్ టేకింగ్స్) యిచ్చి జైలు నుండి బయటపడాలని చూచిన సావర్కారు - త్యాగజీవి భగత్ సింగూ సాటిగా ఎలా నిలవగలుగుతాడు? రాజకీయాలలో మతానికి స్థానం కూడదన్న భగత్ సింగూ నేడు మత ద్వేష రాజకీయాలతో అధికార సోపానాలెక్కాలని ప్రయత్నించే భాజపాలకుల 'హిందుత్వ" సిద్ధాంత ప్రవక్త సావర్కారుదీ పరస్పర విరుద్ధ చరిత్ర. వారి సామాజిక దృక్పథం కూడా అటువంటిదే.

కామ్రేడ్ భగత్ సింగ్ రాజగురు-సుఖదేవ్‌లను బ్రిటీషు ముష్కరులు ఉరితీసిన మార్చి 23 (1931)ను లౌకిక ప్రజాస్వామ్య దినంగా ప్రకటించమని యువజనులు డిమాండు చేయాలి. అలాగే భగత్ సింగ్ రచనలన్నింటినీ, ప్రధాన భారతీయ భాషల్లోకి అనువాదాలు చేయించి ముద్రించాలి. భగత్ సింగ్ వీలునామాను విద్యార్థులకు పాఠ్యాంశంగా నిర్ణయించమని కోరాలి.

ఉరికంబంపై నిలబడి దిక్కులు పిక్కటిల్లేలా యిచ్చిన నినాదాలు ఇంకా సజీవంగానే ఉన్నాయంటే వారి ఆశయాలు, లక్ష్యాలు ఇంకా నెరవేరనట్టే లెక్క. వారికి నివాళి అర్పించటమంటే వారు మిగిల్చి వెళ్లిన కర్తవ్యాలను నెరవేర్చే కృషిలో నిమగ్నమవటానికి నిబద్ధులవటమే! కనుక చివరగా వారిచ్చిన నినాదాల్ని మన మనసులనిండా నిలుపుకుందాం.

విప్లవం వర్ధిల్లాలి! సామ్రాజ్యవాదం నశించాలి!! ❑



# సంపూర్ణ విప్లవమే భగత్‌సింగ్ లక్ష్యం

భగత్‌సింగ్ వర్ధంతి వ్యాసాలు

**కందిమళ్ళ ప్రతాపరెడ్డి**

23 సంవత్సరాల వయస్సులో సామ్రాజ్యవాదుల బానిస సంకెళ్ళ నుండి మాతృదేశాన్ని విముక్తి చేయడానికి తన ప్రాణాన్ని ఫణంగా పెట్టిన వీరుడు భగత్ సింగ్.



ఏళ్ళు గడుస్తున్నా, తరాలు మారుతున్నా, భారత ప్రజల హృదయంలలో విప్లవ వీరుడుగా, చిరంజీవిగా నిలిచిపోయాడు.

భగత్ సింగ్ – మరెందరో వీరులు దేశం కోసం ప్రాణాల ర్పించారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నాయి.

ఆనాడు ఆంగ్లేయులు, భగత్‌సింగ్‌ను టెర్రరిస్టు, అరాచకవాది, హింసావాది అన్నారు. హత్యానేరంతోనే అతన్ని, మరో ఇద్దరు విప్లవకారులు రాజగురు, సుఖదేవులను ఉరికంబమెక్కించారు.

ఇంతకూ భగత్ సింగ్ టెర్రరిస్టా? అన్న దానికి సమాధానం అతని మాటల్లోనే...

"నేను టెర్రరిస్టును కాను. ఆ పద్ధతి ద్వారా మనమేమీ సాధించలేమని అర్థం చేసుకున్నాను. హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ చరిత్రే అందుకు నిదర్శనం. మా కార్యక్రమాలు ఒక లక్ష్యం కోసం నిర్దేశించబడ్డాయి. ఆ మహోద్యమంలో సైనిక విభాగం పాత్రను గుర్తిస్తున్నాం. నన్నెవరైనా అపార్థం చేసుకుని వుంటే తమ అభిప్రాయాలను మార్చుకొమ్మని కోరుతున్నాను. బాంబులు పిస్తోళ్ళు నిరుపయోగమని నేనడంలేదు. కాని, కొన్ని సందర్భాల్లో బాంబులు వేయడం నిరుపయోగమే కాదు – హానికరం" అన్నాడు.

భగత్ సింగ్ రాజకీయ జీవితం అహింసావాదిగా, గాంధేయవాదిగా 1921లో సహాయ నిరాకరణోద్యమంతో ప్రారంభ మయ్యింది. ఆ మహోద్యమాన్ని మధ్యలో ఆపేసినందుకు ఆవేశం పొంది – ప్రత్యామ్నాయ మార్గం కోసం చూసిన నాటి లక్షలాది మందిలో అతనొకడు. కొందరు హింసకు–హింసే సమాధానం. తుపాకులతో – సాయుధ సమరం ద్వారానే దేశానికి విముక్తి లభిస్తుందని నమ్మిన యువకుల్లో అతనొకడు. అందుకే విప్లవకారుడిగా టెర్రరిస్టు కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. భారత్ నవజవాన్ సభలో సభ్యుడైనాడు. క్రమంగా – ఒక చిన్న యువజన సంఘం, లేదా ఒక పట్టణం, ఉద్యమాన్ని నిర్వహించలేవని గ్రహించాడు. అందుకే – ఉత్తరభారతంలో ఒక విప్లవ సంస్థ నిర్మాణంలో పాత్రధారుడయ్యాడు. హిందుస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్ ఏర్పడింది. ఆచరణలో, అనుభవంలో కొన్ని గుణ పాఠాలు నేర్చుకున్నారు. హిందుస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్ సభ్యులు – రాంప్రసాద్ బిస్మిల్, రోషన్ సింగ్, రాజేంద్ర లాహిరి, అస్ఫఖ్ వుల్లాఖాన్ ఉరికంబమెక్కారు. అనుభవాలతో పాటు విప్లవ సాహిత్య అధ్యయనం, వారి ఆలోచనా పద్ధతిని మార్చివేశాయి. పద్ధతులు తెలుసుకున్నారు. ముఖ్యంగా మార్క్సిజం – లెనినిజం మూల సూత్రాలు వారి భవిష్యత్ కార్యాచరణకు మార్గదర్శక మయ్యాయి. 1928 నాటికి హిందుస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్ శాస్త్రీయ సోషలిజం తన సిద్ధాంతంగా ఎంచుకున్నది. అందుకు నిదర్శనం – 1928 సెప్టెంబరులో ఢిల్లీ ఫిరోజ్‌షా కోటలో రహస్యంగా జరిగిన సమావేశంలో – హిందుస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్, హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్‌గా మార్పు జరిగింది. సిద్ధాంత కర్తగా భగత్‌సింగ్ ఎదిగాడు. హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ రాజకీయ నాయకుడిగా భగత్ సింగ్, సైనిక విభాగం అధిపతిగా ఆజాద్ ఎన్నుకోబడ్డారు. తమ రాజకీయ పంథాను వివరిస్తూ భగత్ సింగ్ "విప్లవమంటే రక్తపాతం కాదు. వ్యక్తిగత హింస కాదు – లేక బాంబు పిస్తోలు కాదు. విప్లవమంటే ఈనాటి వ్యవస్థను, దాన్ని కాపాడే శాసనాలను, వాటి ఆధారంగా జరిపే అక్రమాలను అంతం చేయడం" అన్నాడు.

అలాగే "ఒక దేశం మరొకదేశాన్ని, ఒక మనిషి మరొక మనిషిని దోపిడి చేసే వ్యవస్థ పోవాలి... అది విప్లవం ద్వారానే సాధ్యమవుతుంది. విప్లవం ద్వారా కార్మిక కర్షక రాజ్య మేర్పడుతుంది. పెట్టుబడిదారుల వర్గదోపిడి నుండి, యుద్ధాల మారణహోమం నుండి ప్రపంచ మానవాళిని విముక్తి చేసి సమసమాజాన్ని స్థాపించడమే మా సిద్ధాంతం" అన్నాడు.

"ఒకరిద్దరు వ్యక్తులను హతమార్చడం ద్వారా రాజ్యాధికారం మారదు" అన్నాడు.

భగత్‌సింగ్ వర్ధంతి వ్యాసాలు

ఆ తరువాత జరిగిన పరిణామాలు - సైమన్ రాకకు వ్యతిరేకంగా దేశమంతటా నిరసన జ్వాలలు లేచాయి. 1928 అక్టోబరు 30న సైమన్ కమిషన్ లాహోరు వచ్చింది. "సైమన్ గో బ్యాక్" నినాదంతో వందలాది మంది అడ్డు నిలిచారు. అందులో పంజాబుకేసరి లాలా లజపతిరాయ్ తదితర గాంధేయ వాదులు, పెజంట్సు అండ్ వర్కర్స్ పార్టీ పేరుతో వున్న కమ్యూనిస్టులు, భగత్ సింగ్ నేతృత్వంలో హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ సభ్యులున్నారు. శాంతియుత ప్రదర్శన జరుపుతున్న వారిపై పోలీసు సూపరిండెంట్ స్కాట్ - అతని డిప్యూటి సాండర్సు పిచ్చికుక్కల్లా విరుచుకుపడ్డారు. కాళ్ళూ చేతులు విరిగాయి. తలలు పగిలాయి.

లాలాలజపతిరాయ్ తలకు బలమైన గాయమయ్యింది. పడిపోయిన లాలాజీ గుండెమీద తుపాకి మడమలతో గుద్దారు. ఆ గాయాలతో నవంబరు 17, లాలాజీ కన్నుమూశాడు.

అంతకు ముందు సంవత్సరం డిసెంబరు 17న కకోరి వీరులు బిస్మిల్, లాహిరి, రోషన్, అస్ఫఖ్ ఉరికంబాలపై వొరిగిపోయింది మరిచిపోలేదు. ప్రభుత్వ క్రూరత్వానికి తలొగ్గడం కాదు. హెచ్చరిక అవసరమని హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ భావించింది. అందుకే - లాలాజీ మరణానికి కారకుడైన దుర్మార్గపు స్కాట్‌ను హతమార్చాలనుకున్నారు. కానీ, అతను కాకుండా సాండర్సు మరణించాడు. ఏదైనా వారి చర్య లాలాజీ మరణంతో ఆవేశంతో వుడికిపోతున్న ప్రజలకు తగిన శాస్తి జరిగిందన్న సంతృప్తినిచ్చింది.

1930 అక్టోబరు 7న - భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్‌లకు ఉరిశిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వచ్చింది.

భగత్‌సింగ్ పేరు దేశమంతటా వినిపించింది. "ఇన్‌క్విలాబ్ నినాదం" ప్రతిధ్వనించింది.

ఉరిశిక్షను వ్యతిరేకిస్తూ, ప్రభుత్వ వ్యతిరేకతను చాటుతూ ఎన్నో సంఘటనలు జరిగాయి.

### భగత్ సింగ్ తన మిత్రులకు పంపిన లేఖలో...

"మనం పరదేశస్తుల బానిసత్వం నుండే కాదు - స్వదేశీ పెట్టుబడిదారుల, భూస్వాముల చెర నుండి కూడా విముక్తి చెందాలి. కాంగ్రెస్ లక్ష్యం అది కాదు. సంపూర్ణ విప్లవం దాని విధానం కాదు" అన్నాడు.

భగత్‌సింగ్ ప్రాణం దేశ ప్రజలందరికి స్వాతంత్ర్యమంత విలువైనదిగా మారింది. చివరకు భగత్‌సింగ్ తండ్రి ఆఖరి ప్రయత్నంగా గవర్నర్‌కు క్షమాభిక్ష కోరుతూ రాసిన ఉత్తరం భగత్ సింగ్‌కు ఆగ్రహం కలిగించింది. ఆవేశంతో తండ్రికి రాసిన ఉత్తరంలో...

"పితాజీ.. నేను సంకోచిస్తున్నది.. సభ్యత, గౌరవం, మర్యాద విస్మరించి మీ గురించి కఠినమైన పదాలను ఉపయోగిస్తానేమో నన్న సంశయం కలుగుతున్నది. ఇదే పని మరొకరు చేసి వుంటే... అతనొక విప్లవ ద్రోహి అనేవాణ్ణి. కానీ మీరు పుత్రవాత్సల్యంతో ఈ బలహీనత చూపారు. నాకు వెన్నుపోటు పొడిచారు. నా తరపున మాట్లాడే హక్కు మీకెక్కడిది?" అని ప్రశ్నించాడు.

### రాష్ట్ర గవర్నర్‌కు రాసిన లేఖలో...

"మమ్మల్ని ఉరి తీయడానికి నిర్ణయించిన మీరు తప్పకుండా దాన్ని అమలు జరుపుతారని మా నమ్మకం. ఎందుకంటే మీరు పాలకులు - అదే మీకున్న గొప్ప బలం. శక్తికి మించిన సత్యం లేదన్నది మీ సూత్రం. మా కేసు విచారణంతా అందుకు నిదర్శనం. అయితే మిమ్మల్ని క్షమాభిక్ష కోరడం లేదు. అలాంటిది మీ నుండి ఆశించడం లేదు. మీ దృష్టికి తేవాలనుకున్నది - మీ తీర్పు ప్రకారం మేము యుద్ధం ప్రకటించాం. యుద్ధ ఖైదీలం, ఆ విధంగానే మమ్మల్ని గుర్తించాలి. మామూలు నేరస్తులుగా మమ్మల్ని ఉరితీయకుండా యుద్ధ ఖైదీలుగా మీ సైనిక బృందంతో కాల్చి వేయాలి" అన్నాడు.

### పోరాట లక్ష్యాన్ని వివరిస్తూ...

"సోషలిస్టు రాజ్య స్థాపన జరిగే వరకూ, ఇప్పటి వ్యవస్థ స్థానంలో నూతన వ్యవస్థ ఏర్పడే వరకు మా పోరాటం కొనసాగుతుంది. దోపిడీ విధానాన్ని సమూలంగా నిర్మూలించి, నూతన సాంఘిక వ్యవస్థ నెలకొల్పబడి, మానవాళి సుస్థిర శాంతి, సౌభాగ్యాలతో జీవించే వరకు మా పోరాటం సాగుతుంది" అన్నాడు.

22-3-1931న తన మిత్రులకు పంపిన ఆఖరి లేఖలో...

"నేను బతికున్నా ఇంతకంటే ఉన్నత శిఖరాలకు చేరలేను. దేశ ప్రజలకు నా బలహీనతలు బయటపడతాయి. విప్లవ పార్టీ ప్రతిష్ట దెబ్బ తింటుంది. తీరని కష్టాన్ని కలిగిస్తుంది. అదే.. నేను ధైర్యంగా ఉరికంబమెక్కితే ఈ దేశంలోని తల్లులు తమ బిడ్డలకు భగత్‌సింగ్ వలె పేరు గడించాలని దీవిస్తారు. రానున్న యువతరం మాతృదేశ దాస్య శృంఖలాలను తెంచడానికి ప్రతిజ్ఞ చేస్తారు. త్యాగానికి సిద్ధపడతారు. వారి సంఖ్య నానాటికీ పెరుగుతుంది. సామ్రాజ్యవాదులు ఎన్ని అవరోధాలు కల్పించినా, ఆ విప్లవ శక్తిని ఆపలేరు..." అన్నాడు.

1931 మార్చి 23, సాయంత్రం 7.33 నిమిషాలు, నల్లని గుడ్డ భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల ముఖాలను కప్పేసింది.

"ఇన్‌క్విలాబ్ జిందాబాద్..." నినదిస్తూ... లాహోరు జైలు ఉరికొయ్యలపై ముగ్గురు వీరులు వొరిగిపోయారు. ప్రజలు శోకతప్త హృదయాలతో వీరుడు భగత్‌సింగ్‌కు నివాళులర్పించారు. ❑

భగత్‌సింగ్ వర్ధంతి వ్యాసాలు

# రెండు లేఖలు భగత్‌సింగ్, సావర్కర్‌ల విభిన్న వ్యక్తిత్వాలు

బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా విప్లవోద్యమంలో పాల్గొని శిక్ష విధించబడ్డ వారిలో భగత్‌సింగ్, విడిసావర్కర్‌లు ప్రభుత్వానికి వేర్వేరుగా చేసిన విజ్ఞప్తులివి. సామ్యవాద సిద్ధాంత భూమిక ఉన్న భగత్‌సింగ్‌కూ అతని మిత్రులకూ ఉరిశిక్ష విధించబడితే, 'భరతమాత' విముక్తి కోసం తీవ్రవాద కార్యకలాపాల్లో పాల్గొన్నందుకు సావర్కర్‌కు 50 సం॥రాలు శిక్ష పడింది. భగత్‌సింగ్‌నూ అతని మిత్రుల్ని లాహోర్ జైలులో నిర్బంధిస్తే, సావర్కర్‌ను అండమాన్ జైలుకు పంపారు. బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించినట్లు మోపబడిన అభియోగాన్ని గౌరవంగా స్వీకరించిన భగత్‌సింగ్ తమను ఉరి తీయడం సరి కాదనీ, కాల్చి చంపాలనీ అందుకు ఒక బెటాలియన్‌ను తమ పైకి పంపాలని యుద్ధగర్జన చేశాడు.

కాగా, క్షమాభిక్ష కోరుతూ సావర్కర్ తనను ప్రమాదకర ఖైదీగా గుర్తించడం అన్యాయమనీ శిక్ష తనను నీరు గారుస్తున్నదనీ, విప్లవ కార్యక్రమాన్ని విడిచిపెట్టి ప్రభుత్వ అనుకూలునిగా మారతాననీ పదే పదే సాగిలపడ్డాడు. **1931**లో భగత్‌సింగ్ ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ ఉరికంబం ఎక్కితే, **1924**లో విడుదలైన సావర్కర్ అన్నట్టుగానే 'హిందూత్వ' ప్రతిపాదనతో హిందూ ముస్లిం విభజనకు కారకుడై బ్రిటీష్‌కు సహకరించాడు. భారతీయ జనతా పార్టీ జాతీయవాదానికి దుర్ వ్యాఖ్యానం చేస్తున్న ఈ దశలో ఈ రెండు లేఖల్లో వ్యక్తమైన వ్యక్తిత్వాల మధ్య వైరుధ్యం గమనించండి.

## భగత్‌సింగ్, రాజగురు సుఖ్‌దేవ్‌ల లేఖ

# క్షమాభిక్ష కోరం - మమ్మల్ని కాల్చి చంపండి

*ఒకవైపున శ్రేయోభిలాషులు క్షమాభిక్ష పిటిషన్‌పై సంతకం చేయించాలని ప్రయత్నిస్తుంటే మరో వైపున భగత్ సింగ్ ప్రభృతులు తమను ఉరి తీయడానికి బదులు కాల్చిచంపాలంటూ గవర్నర్‌కు లేఖ రాశారు. తాము బ్రిటిష్ రాజుకు వ్యతిరేకంగా కుట్ర పన్నామని అభియోగంతో శిక్ష విధించారు గనక యుద్ధఖైదీలుగా పరిగణించి కాల్చిచంపాలనేది వారి వాదన.*



*మార్చి 20, 1931*

పంజాబ్ గవర్నర్ గారికి,

సర్,

సగౌరవంగా కింది విషయం మీ దృష్టికి తెస్తున్నాము :

భారతదేశంలోని బ్రిటీషు ప్రభుత్వాధినేత అయిన వైస్రాయి ఆర్డినెన్సు ప్రకారం ఏర్పడిన లాహోరు కుట్ర కేసు స్పెషల్ ట్రిబ్యునల్ మాకు 1930లో ఉరిశిక్ష విధించింది. అయిదవ జార్జి చక్రవర్తికి వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించామనేది మా పైన మోపబడిన అభియోగాలన్నిటిలోకి పెద్దది.

కోర్టు ఇచ్చిన ఈ తీర్పులో రెండు ప్రధానాంశాలున్నాయి : ఒకటి – ఆంగ్లజాతికీ, భారతీయులకీ మధ్య ఓయుద్ధం నడుస్తున్నది. రెండవది మేం వాస్తవంగా ఆ యుద్ధంలో పాల్గొన్నాము. అందువల్ల మేం రాజకీయ యుద్ధఖైదీలమై వున్నాము.

ఈ రెండు నిర్ధారణ మరీ అతిశయోక్తిగా అనిపించినప్పుడు, అది మిమ్మల్ని గౌరవించడంగా భావించకుండా వుండటం కష్టం..

మొదటి వ్యాఖ్య గురించి కాస్త వివరంగా చర్చిస్తాము. పైకి చూస్తే ఎలాంటి యుద్ధమూ జరగడం లేదు. అయినప్పటికి కోర్టు వారి ఈ వ్యాఖ్యం విలువైందిగానే తీసుకోదలిచాం. అయితే దాన్ని సరిగ్గా అర్థం చేసుకోవడానికిగాను మేము వివరణ ఇవ్వాలనుకుంటున్నాం.

భారతదేశ ప్రజలపై దోపిడీ సాగుతున్నంత కాలం , వారి సహజ వనరులు అతి కొద్ది మంది పరాన్నభుక్కులు కొల్లగొట్ట బడుతున్నంత కాలం ఈ యుద్ధం కొనసాగుతూనే వుంటుంది. వారు బ్రిటిషు పెట్టుబడిదారులే కావచ్చు. లేదా భారతీయ మిశ్రమ వర్గీయులే కావచ్చు. లేదా అచ్చమైన భారతీయులే కావచ్చు. వారు ఈ దారుణమైన దోపిడీని మిశ్రమ పద్ధతిలో గాని లేక పూర్తిగా భారతీయ అధికార యంత్రాంగం ద్వారా గాని సాగిస్తుండవచ్చు. కాని ఎలా జరిగినా వీటి మధ్య పెద్ద తేడా వుండదు. మీ బ్రిటీషు ప్రభుత్వం భారతీయ సమాజంలో కులీన వర్గానికి చెందిన కొంత మంది నాయకులను రాయితీలతో లోబరుచుకొని రాజీలకు వచ్చినా దాని వల్ల తాత్కాలిక నిరుత్సాహం తప్ప ప్రధాన శక్తుల స్ఫూర్తి ఏ విధంగానూ దెబ్బ తినదు. భారతీయ ఉద్యమ అగ్రస్థానంలో వున్న పార్టీ ఇప్పుడు మరోసారి యుద్ధ రంగంలో చిక్కుకు పోయింది. మా గురించి ఆ నాయకులు సానుభూతి వ్యక్తం చేసినందుకు నేను కృత్యములుగా వుంటాము. కాని వారు ఎంతగా కళ్లు మూసుకుపోయి వున్నారంటే వారు మీతో కలిసిన శాంతి సంప్రదింపుల్లో నిరాశ్రయులైన, అనాధలైన, నిర్భాగ్యులైన మహిళా కార్మికులను కూడా మర్చిపోయారు. ఈ మహిళలు తమ వూహాజనిత అహింసా వాదానికి వ్యతిరేకులుగా తాము పరిగణించే శత్రువులకు అగ్రగాములుగా వున్నారని వారి భావన. నిజానికి అదంతా గడచిపోయిన ఘట్టం. ఈ వీరనారులు, మీ ప్రభుత్వం నిషిద్ధ వ్యక్తులుగా ప్రకటించిన తమకు ప్రియతమ భర్తల కోసం సోదరుల కోసం నిస్వార్థంగా త్యాగాలు చేశారు. చేయడానికి సిద్ధపడ్డారు. ఆఖరుకు తమను తాము బలి చేసుకున్నారు. మీ తాజీదార్లు వారి ప్రతిష్టను వారి పార్టీ గౌరవాన్ని దెబ్బ తీసేందుకు కట్టుకథలు అల్లే నీచత్వానికి దిగజారవచ్చు గాని వారు వాస్తవంలో నిష్కళంక వ్యక్తిత్వానికి ప్రతీకలుగా వున్నారు. ఈ సమరం కొనసాగవలసిందే.

అది ఆయా దశలలో రకరకాల రూపాలు ధరించవచ్చు. కొన్ని సార్లు బహిరంగంగా, మరికొన్ని సార్లు రహస్యంగా వుండవచ్చు. కొన్ని సార్లు ప్రచార రూపంలో ఉంటే మరొక సందర్భంలో జీవన్మరణ సంగ్రామంగా మారవచ్చు. అది ఎలా వుంటుందనేది మీ చేతలను బట్టి వుంటుంది. రక్తసిక్తంగా వుంటుందా, సాపేక్షంగా శాంతియుతంగా సాగుతుందా అనేది మీ చేతలను బట్టి నిర్ణయమవుతుంది. అయితే అది నిర్విరామంగా కొనసాగుతూనే వుంటుంది. అల్పమైన అర్థరహితమైన నైతిక మీమాంసలతో నిమిత్తం లేకుండా సాగవలసిందే. బహుశా మరింత శక్తివంతంగా, మరింత సాహసోపేతంగా, అచంచల సంకల్పంతో సోషలిస్టు రిపబ్లిక్ స్థాపించే దాకా సాగవలసిందే. ప్రస్తుత సామాజిక వ్యవస్థ స్థానంలో ఒక నూతన వ్యవస్థ ఏర్పడే వరకూ సామాజిక సౌభాగ్యం ప్రాతిపదికంగా అన్ని రకాల దోపిళ్లకు భరత వాక్యం పలికే వరకూ ఆ సమరం సాగవలసిందే. మానవాళికి నవోదయం కలిగే వరకూ ఈ పోరాటం సాగవలసిందే. సమీప భవిష్యత్తులోనే అంతిమ పోరాటం జరిగి తుది పరిష్కారం సాధించుకోవలసి వుంటుంది.

పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద దోపిడీకి రోజులు చెల్లనున్నాయి. ఈ యుద్ధం మాతో ప్రారంభం కాలేదు. మాతోనే ముగిసిపోదు. చారిత్రక ఘటనలు, ప్రస్తుత వాతావరణం అనివార్యంగా అందుకు దారి తీస్తాయి. మేము సవినయంగా చేసే త్యాగాలు ఆ పోరాట హారంలో చిన్న చిన్న లింకుల వంటివి. ఆ హారాన్ని జతిన్ దాస్, అనుపమ త్యాగం, అత్యంత విషాదకర మైనప్పటికీ మహోన్నతమైన భగవతీ చరణ్ త్యాగం, మా ప్రియతముడైన పోరాట వీరుడు ఆజాద్ మహత్తర అమరత్వం అత్యంత నిశితంగా సుందరవంతంగా తీర్చిదిద్దాయి.

ఇక మా విధికృతానికి సంబంధించి ఒక విషయం చెప్పదలచాము. మీరు మా ప్రాణాలు తీయదల్చుకుంటే తప్పక చేస్తారు. అధికారం మీ చేతుల్లో వుంది. ప్రపంచంలో అధికారమే అతి పెద్ద సమర్థనగా వుంటుంది. బలమున్నవాడి మాటే చెల్లుతుందన్న మాట మాకు తెలుసు. మా మొత్తం విచారణక్రమం అందుకు నిదర్శనంగా వుంది. మీ కోర్టు తీర్పు ప్రకారం మేము మీ ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించాం. కనక మేము యుద్ధ ఖైదీలం. మమ్మల్ను అలాగే పరిగణించవలసిందిగా మేము కోరుతున్నాము. ఇక మీరు ఉరి తీయడానికి బదులు మమ్మల్ని యుద్ధఖైదీల మాదిరిగా తుపాకితో కాల్చి చంపాలి. మీ కోర్టు చెప్పిన మాట నిజమో కాదో నిరూపించుకుంటారో లేదో మీ ఇష్టం.

మమ్మల్ని తుపాకీతో కాల్చి వేయడానికి ఒక దళాన్ని పంపించవలసిందిగా మీ సైన్య విభాగానికి ఉత్తర్వులివ్వగలరని ఆశిస్తూ అలా చేయవలసిందిగా కోరుతున్నాం. ❑

భవదీయులు

**భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్**

భగత్‌సింగ్ వర్ధంతి వ్యాసాలు

# నాకు క్షమాభిక్ష ప్రసాదించండి

**వి.డి. సావర్కర్**

**సెల్యూలర్ జైల్, అండమాన్ దీవులు, 1913**

భారత ప్రభుత్వ హోమ్‌శాఖ సభ్యుల వారికి,

తమ పరిశీలన కొరకు ఈ క్రింది అంశాలను సవినయంగా సమర్పించుకొంటున్నాను.

1. 1911 జూన్‌లో మా పార్టీకి చెందిన ఇతర నేరస్థులతో కలిపి నన్ను చీఫ్ కమీషనర్ వారి కార్యాలయానికి తీసుకు వచ్చినప్పుడు నన్ను 'డి' తరగతి ఖైదీగా, అంటే ప్రమాదకరమైన (డి–డేంజరస్) ఖైదీగా వర్గీకరించారు. తోటి నేరస్థులెవ్వరినీ ఈ తరగతిలో చేర్చలేదు. ఫలితంగా నేను ఆరు నెలలు ఏకాంత నిర్బంధంలో ఉండవలసి వచ్చింది. ఇతరులకు ఆ శిక్ష పడలేదు. ఆ సమయంలో నా చేతుల రక్తమోడుతున్నప్పటికీ నా చేత కాయిర్ పౌండింగ్ పని చేయించారు. తర్వాత నన్ను జైలు పనులన్నిటిలోకి కష్టమైన ఆయిల్ మిల్లు పనిలో పెట్టారు. ఈ ఆరునెలలూ నా ప్రవర్తన ఎంతో మంచిగా ఉన్నప్పటికీ నా సహ నేరస్థులకు లభించిన విడుదల నాకు లభించలేదు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సత్ప్రవర్తన కలిగి ఉండడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాను.

2. ఖైదీగా పదోన్నతి కోసం నేను అర్జీ పెట్టుకున్నప్పుడు 'ప్రత్యేక తరగతి ఖైదీ'గా నాకు ఆ అవకాశం లేదన్నారు. కానీ మంచి ఆహారాన్నో, కొన్ని సందర్భాలలో ప్రత్యేక ఆదరణనో కోరినప్పుడు మాత్రం "మీరూ సాధారణ ఖైదీలే. వారేం తింటే మీరూ అదే తినాలి" అంటున్నారు. అయ్యా, అట్లా కేవలం అవకాశాల నిరాకరణలోనే ప్రత్యేకత చూపిస్తున్నారని తమ దివ్య సముఖమునకు విన్నవించుకుంటున్నాను.

3. నా కేసులోని ఇతరులు విడుదలైనప్పుడు నన్ను కూడా విడుదల చేయమని కోరాను. వారిలో పది, పన్నెండు కేసులున్న వారు కూడా విడుదల కాగా, కేవలం రెండు మూడు కేసులున్న నన్ను వారు విడుదల చేయలేదు. చివరికి నా విడుదల ఆజ్ఞలు జారీ అయిన తర్వాత బయట కొందరు రాజకీయ నేరస్థులు సమస్యలు సృష్టించడంతో వారి కేసుకు సంబంధించిన వాడిననే సాకు చూపించి నన్ను వారితో పాటు మళ్ళీ నిర్బంధించారు.

4. నేను భారతదేశ జైలులో ఉండి ఉంటే ఈపాటికి ఎంతో శిక్ష తగ్గింపు పొందడమే కాక, ఇంటికి లేఖలు రాసుకునే అవకాశమూ, బంధుమిత్రుల్ని కలుసుకునే అవకాశమూ పొంది ఉండేవాణ్ణి. కనీసం ద్వీపాంతర వాస ఖైదీల్లో సాధారణ ఖైదీని అయినా ఈపాటికి విడుదలై తిరుగు ప్రయాణపు టికెట్ కోసం ఎదురుచూస్తూ ఉండేవాణ్ణి. కానీ భారతీయ జైళ్ళలోని అవకాశాలూ లేక, ద్వీపాంతర వాస షరతులూ వర్తించక, రెండింటికీ చెడ్డ రేవణ్ణయ్యాను.

5. కాబట్టి నన్ను భారతీయ జైలుకి పంపడమో లేక ఇక్కడి ఖైదీలతో సమానంగా చూడడమో చేయడం ద్వారా ఈ వివక్షకు స్వస్తి పలకగలరని గౌరవనీయులైన మిమ్మల్ని కోరుతున్నాను. నేనేమీ ఇతరులకు లేని సౌకర్యవంతమైన ఆదరణను కోరుకోవడం లేదు. నిజానికి ఒక రాజకీయ ఖైదీగా స్వతంత్రదేశాల నాగరిక పరిపాలనలలో మాదిరిగా అటువంటి సదుపాయాలు కోరుకునే అవకాశం ఉన్నప్పటికీ కరడుకట్టిన నేరస్థులకు సైతం లభించే మినహాయింపుల్ని మాత్రమే కోరుతున్నాను. ఈ జైలులో శాశ్వతంగా అమానుషంగా నన్ను బంధించి ఉంచే ఈ ప్రణాళిక నా ప్రాణాన్నీ, నమ్మకాన్నీ నిలుపుకోగల ఆశ నుంచి నన్ను దూరం చేస్తోంది. సాధారణ ఖైదీలైతే ఫర్వాలేదు కానీ అయ్యా, నాకు విధించబడిన యాభై ఏళ్ళ శిక్ష నావైపు భీకరంగా చూస్తోంది. ఈ దారుణ నిర్బంధంలో కిరాతకులైన నేరస్థులకు సైతం లభించే సదుపాయాలు కూడా నిరాకరింపబడిన పరిస్థితుల్లో ఈ శిక్షను అనుభవించడానికి నైతిక శక్తిని నేనెట్లా పుంజుకో గలను? కాబట్టి అయ్యా దయచేసి నన్ను భారతదేశంలోని జైలుకు బదిలీ చేయండి. అక్కడ శిక్ష తగ్గింపు, నాలుగు నెలలకొకసారైన బంధుమిత్రుల్ని కలుసుకునే అవకాశం వంటి వాటిని పొందనివ్వండి. అరుదుగా నైనా నా అనే వాళ్ళని చూడగలగడం ఎంత ఆనందాన్నిస్తుందో మీకు తెలియంది కాదు కదా. అక్కడైతే అన్నిటినీ మించి 14 సంవత్సరాల తర్వాత విడుదలయ్యే చట్టబద్ధమైనది కాకపోయినప్పటికీ నైతికమైన హక్కయినా లభిస్తుంది. మరికొన్ని ఉత్తరాలూ, సదుపాయాలూ పొందగలుగుతాను. ఒకవేళ నన్ను భారతదేశం పంపడం సాధ్యపడకపోతే, ఇతర నేరస్థులకు ఇచ్చిన విధంగా ఐదు సంవత్సరాల కొకసారి ఇంటికి వెళ్ళే అవకాశమో లేక నా కుటుంబ సభ్యుల్ని ఇక్కడికి రప్పించడమో ఏర్పాటు చెయ్యండి. ఇది కనుక మంజూరైతే నేను చేసిన తప్పులకు నన్ను నేను నిందించుకోవడం ఒక్కటే ఇక మిగిలి ఉంటుంది. ప్రతిమనిషి ప్రాథమిక హక్కయిన ఈ స్వేచ్ఛను కూడా అడగవలసి రావడం నా దౌర్భాగ్యం. ఇరవై మంది యువ ఔత్సాహిక అవిశ్రాంత రాజకీయ ఖైదీలొకవైపు, భావప్రకటనా స్వేచ్ఛను నిర్బంధించి ఉంచే ద్వీపాంతర వలస విధి విధానాలు మరొకవైపు ఉన్న సందర్భంలో వారిలో ఎవరో ఒకరు ఒకటో రెండో నిబంధనల్ని ఉల్లంఘిస్తున్నప్పుడు ప్రతి ఉల్లంఘనకీ అందర్నీ బాధ్యుల్ని చేస్తున్నంత కాలం నాకు విముక్తి లభించే అవకాశమే లేదు.

చివరిగా, 1911లో క్షమాభిక్ష కోరుతూ నేను పెట్టుకున్న అర్జీని భారత ప్రభుత్వానికి పంపగలరని మరోసారి గౌరవనీయులైన మిమ్మల్ని కోరుతున్నాను.

భారత రాజకీయాలలో ఇటీవలి పరిణామాలు, భారత ప్రభుత్వ సామరస్య విధానమూ రాజ్యాంగ బద్ధ విధానానికి తలుపులు తెరిచాయి. ఈ పరిస్థితుల్లో దేశం పట్ల, మానవ జాతి పట్ల సానుకూల దృక్పథం ఉన్నవాడెవ్వడైనా శాంతి, అభివృద్ధి మార్గాల నుంచి మా వంటి వారిని తప్పించిన 1906–07 నాటి నిరాశాజనక పరిస్థితులు లేవనీ, ఆ ముళ్ళబాటలోకి మళ్ళీ ప్రవేశించడం గుడ్డితనమే అవుతుందనీ గ్రహిస్తాడు.

అందువల్ల ప్రభుత్వం వారు అనేక కోణాల నుంచి ఉన్న ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నాకు క్షమాభిక్ష ప్రసాదించి నన్ను విడుదల చేసినట్లయితే, ఇంగ్లీషు ప్రభుత్వ అభివృద్ధి సాధనకు ఆయువు పట్టయిన రాజ్యాంగ ప్రగతికి, ప్రభుత్వం పట్ల విధేయతకు నేను గట్టి సమర్థకుణ్ణవుతాను. మా వంటి వారు జైళ్ళలో మగ్గుతున్నంత కాలం ఘనత వహించిన చక్రవర్తికి చెందిన భారతదేశంలోని వందల వేల కుటుంబాల ప్రజల్లో నిజమైన ఆనందోత్సాహాలు వెల్లివిరియవు. ఎందుకంటే నీళ్ళ కన్నా రక్తం చిక్కనైనది. మమ్మల్ని విడుదల చేసి దండించడం, ప్రతీకారం తీర్చుకోవడంలో కన్నా క్షమించడం తప్పును సరిదిద్దడమే బాగా తెలిసిన ప్రభుత్వం పట్ల ప్రజలు హర్షాతిరేకాన్ని కృతజ్ఞతనీ ఎలుగెత్తి చాటుతారు.

భగత్‌సింగ్ వర్ధంతి వ్యాసాలు

పైగా రాజ్యాంగ సాధన రహదారిలోకి నా రాక, దేశ విదేశాల్లో నన్నొక మార్గదర్శిగా గుర్తిస్తూ తప్పుడు దారిలో ఉన్న ఎంతో మంది యువకుల్ని ఆ దారిలోకి రప్పిస్తుంది. నాలో జరిగిన ఈ మార్పు పూర్తి స్పృహతో జరుగుతున్నందువల్ల నా భవిష్యత్ ప్రవర్తన ఇదే పంథాలో కొనసాగుతుందని విశ్వసిస్తూ ప్రభుత్వం కోరుకున్న హోదాలో ప్రభుత్వం తరపున పని చెయ్యగలనని తెలియచేస్తున్నాను. నన్ను జైలులోనే నిర్బంధించి ఉంచడం వల్ల విడుదల వల్ల జరిగే ప్రయోజనాలకు అవకాశమే ఉండదని మనవి చేస్తున్నాను.

సర్వశక్తి సంపన్నుడే క్షమించగలడు. కాబట్టి దారి తప్పిన కొడుకు చివరికి తల్లిదండ్రుల గుమ్మం ముందుకు రాక ఎక్కడకు వెళతాడు? ప్రజలకు ప్రభుత్వమే కదా తల్లీ, తండ్రీ!

గౌరవనీయులైన తమరు ఈ అంశాలను మీ అభిప్రాయాలుగా స్వీకరిస్తారని ఆశిస్తున్నాను. ❑

## చిన్న పుస్తకం, గొప్ప జీవితం భగత్‌సింగ్ !

**(4వ పేజీ తరువాయి)**

తమ నిరసనను దేశ ప్రజల దృష్టికి తేవాలని తప్ప ఎవరినీ చంపాలని ఈ దాడి చేయలేదు గనుక తర్వాత భగత్‌సింగ్, ఆయన సహచరుడు ఘటకేశ్వర్ దత్తులు కావాలనే పట్టుబడ్డారు. అప్పటి నుంచి విచారణ జరిగినంత కాలమూ విప్లవం గురించి శక్తివంతంగా వివరించాడు భగత్ సింగ్. కోర్టుల్లోనూ, జైళ్లలోనూ ఆ విప్లవకారులు తమ పోరాటం కొనసాగించారు. ముఖ్యంగా భగత్ సింగ్ జైలును గ్రంథాలయంగా మార్చుకున్నాడు. జాబితాలు రాసి మరీ పుస్తకాలు తెప్పించుకుని చదివాడు. తమ విశ్వాసాలను, అభిప్రాయాలను వెల్లడించే అనేక వ్యాసాలు రాశాడు. 'నేనెందుకు నాస్తికుడయ్యాను?' 'వీలునామా', (యువతకు విజ్ఞప్తి) వంటివి వాటిలో మనకు దక్కాయి. మరికొన్ని అమూల్యమైన రచనలు దక్కలేదు. ప్రచురితమైన మేరకు ఆయన ప్రతి రచనలోనూ విప్లవం పట్ల, ప్రజలను చైతన్యపరచడం పట్ల అంతులేని శ్రద్ధ గోచరిస్తుంది. తానెప్పుడూ టెర్రరిస్టును కానని ఆయన గట్టిగా వివరిస్తాడు.

వ్యక్తిగత ఔన్నత్యం మరింత గొప్పది. ఉరికొయ్య కళ్ల ముందు వేలాడుతున్నా వారు చలించలేదు. తన తండ్రి తనకు క్షమాభిక్ష కోసం ప్రయత్నించాడని తెలిసి 'నా జీవితం నా ఆశయాల కన్నా విలువైనదేం కాదు' అని ఆగ్రహం, ఆవేదన కలగలిపి రాస్తాడు భగత్ సింగ్. దోపిడీ శక్తులు ఏ రూపంలో పెత్తనం చేస్తున్నా ఆ స్వాతంత్రం సంపూర్ణం కాదన్నాడు. 'జీవించాలనే కాంక్ష చాలా సహజమైనది. అయినా నేను ఏవో ఆంక్షల మధ్య ఖైదీగా బతకాలనుకోవడం లేదు. భారత విప్లవోద్యమానికి నా పేరు ఒక ప్రతీకగా మారింది. మరికొంత కాలం వుంటే నా లక్ష్య సాధనకు ఇంకా కృషి చేయగలిగే వాడినన్న భావన తప్ప మరో బాధ లేదు. అయినా నా జీవితం పట్ల గర్విస్తున్నా' అని చివరి దశలో ఒక మిత్రుడి ప్రశ్నకు జవాబుగా రాశాడు. చివరి రోజున తలారి వచ్చి సిక్కుల పవిత్ర గ్రంథం గురు గ్రంథ సాహెబా ఇస్తే వద్దని సున్నితంగా తిరస్కరించాడు. పైగా లెనిన్ విప్లవ జీవితం చదివి ఉరిశిక్షకు సిద్ధమయ్యాడు. 'విప్లవం వర్ధిల్లాలి' అనే నినాదాల మధ్య భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లు 1931 మార్చి 23న ఉరికంబమెక్కారు.

ఈ పరిణామాలన్నిటినీ ఈ పుస్తకంలో క్లుప్తంగా తెలుసుకోవచ్చు. భగత్ సింగ్ బృందాన్ని కాపాడటంలో గాంధీజీ శ్రద్ధ చూపాడా లేదా అన్న విషయాన్ని కూడా పరిశోధకుల రచనల నుంచి రచయిత చక్కగా వివరించారు. భగత్ సింగ్ విప్లవ జీవిత ప్రస్థానాన్ని తెలుసు కోవడానికి 'నిరంతర పోరాట స్ఫూర్తి భగత్‌సింగ్' పుస్తకం బాగా దోహదపడుతుంది. ❑

భగత్‌సింగ్
వర్ధంతి
వ్యాసాలు

# భగత్ సింగ్ పిస్టల్ 85 ఏళ్ల తర్వాత ఎలా దొరికింది?

దలీప్ సింగ్
బీబీసీ ప్రతినిధి

ఆంగ్లేయుల పాలనపై పోరాటం చేసిన భగత్ సింగ్‌పై ఎన్నో పుస్తకాలు వచ్చాయి, సినిమాలు తీశారు. రకరకాల ఐడియాలజీ ఉన్న ఎంతోమంది ఆయన సాహసాన్ని తమదైన శైలిలో వర్ణించారు.

భగత్ సింగ్‌పై తీసిన సినిమాల్లో మీరు తరచూ ఒక సీన్ చూసే ఉంటారు. అందులో ఆయన పాత్ర పోషించిన నటుడు. ఆంగ్లేయ అధికారి జాన్ సాండర్స్‌ను తుపాకీతో కాల్చి చంపుతారు.



భగత్ సింగ్ ఆయన సహచరులకు సంబంధించిన వస్తువుల ప్రదర్శన కూడా చాలామంది చూసే ఉంటారు.

కానీ భగత్ సింగ్‌కు సంబంధించిన ప్రత్యేక వస్తువు ఒకటుంది. అది తెరమీద, కార్డు, గోడలపై ఉన్న ఆయన చిత్రంలో కనిపిస్తూ ఉంటుంది. అదే ఆయన ఉపయోగించిన పిస్టల్.

## భగత్ సింగ్ పిస్టల్

భగత్ సింగ్‌కు ఉరిశిక్ష వేశాక ఆయన ఉపయోగించిన పిస్టల్ ఏమయ్యింది? 20వ శతాబ్దంలో ఉపయోగించిన పిస్టల్, ఇన్నేళ్లూ ఎక్కడ ఉండిపోయింది? అది 21వ శతాబ్దంలో ప్రజల ముందుకు ఎలా వచ్చింది?

అప్పుడు జరిగిన మొత్తం ఘటనపై ఒక పుస్తకం రాస్తున్న జర్నలిస్ట్ జుపిందర్ సింగ్, భగత్ సింగ్ పిస్టల్‌ను ఇప్పుడు ప్రపంచం ముందుకు తెచ్చారు. పిస్టల్ అన్వేషణ గురించి ఆయన బీబీసీకి వివరంగా చెప్పారు.

అమెరికాలో తయారైన పాయింట్ 32 బోర్ కోల్ట్ సెమీ ఆటోమేటిక్ పిస్టల్‌తో ఆంగ్లేయ అధికారి సాండర్స్‌ను హత్య చేశాడని భగత్ సింగ్‌పై ఆరోపణ ఉంది.

## పిస్టల్ అన్వేషణ

చంద్రశేఖర్ ఆజాద్ ఉపయోగించిన ఆయుధం గురించి అందరూ మాట్లాడుకోవడం, దానితో సెల్ఫీ తీసుకోవడం గురించి కూడా జుపిందర్ సింగ్ విన్నారు.

ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం ఈ ఆయుధాన్ని చాలా జాగ్రత్తగా భద్రపరిచింది.

చాలా ఏళ్ల క్రితం "భగత్ సింగ్ ఉపయోగించిన పిస్టల్ ఏమయ్యుంటుంది అనే ఆలోచన తన మనసులో వచ్చిందని, అది ఎక్కడికెళ్లింది, ఎవరి దగ్గర ఉంది" అనుకున్నానని జుపిందర్ చెప్పారు.

"2016లో పిస్టల్ కోసం వెతకడం ప్రారంభించా" అని ఆయన చెప్పారు.

అన్వేషణలో భగత్ సింగ్‌ను ఉరితీసిన తర్వాత పిస్టల్‌ను ఎక్కడికి పంపించారో ఆయన చాలా కష్టపడి తెలుసుకోగలిగారు.

## ఫిల్లోర్ పోలీస్ అకాడమీకి పిస్టల్

2016లో పిస్టల్ నంబర్ దొరకడంతో ఆయనకు మొదటి విజయం లభించింది.

భగత్ సింగ్ ఉపయోగించిన ఆ పాయింట్ 32 బోర్ కోల్ట్ సెమీ ఆటోమేటిక్ పిస్టల్ నంబర్-168896

పిస్టల్ పత్రాలు, తన అన్వేషణ ఆధారంగా "1931లో లాహోర్ హైకోర్టు ఆ పిస్టల్‌ను పంజాబ్‌లో ఉన్న ఫిల్లోర్ పోలీస్ ట్రైనింగ్ అకాడమీకి పంపించాలని ఆదేశించిందని ఆయన చెప్పారు. ఆ పిస్టల్ ఇక్కడికి చేరుకోడానికి 13 ఏళ్లు పట్టిందనేది తర్వాత విషయం, 1944లో భగత్ సింగ్ పిస్టల్‌ను ఫిల్లోర్ తీసుకొచ్చారు" అన్నారు.

పిస్టల్ నంబర్ తెలుసు, తర్వాత పోలీసులు దాన్ని ఎక్కడ పెట్టారో కూడా తెలిసింది.

"కొందరు సీనియర్ అధికారుల సాయంతో పోలీస్ ట్రైనింగ్ అకాడమీలో పిస్టల్ వెతకడం ప్రారంభించాను" అని జుపిందర్ సింగ్ తెలిపారు.

## 1968లో పిస్టల్ మధ్యప్రదేశ్ చేరింది

"ఫిల్లోర్‌లో అది అంత సులభంగా దొరకలేదు. రికార్డుల్లో వెతికిన తర్వాత లాహోర్ నుంచి వచ్చిన వాటిలో 8 ఆయుధాలను

1968లో మధ్యప్రదేశ్ ఇండోర్‌లో ఉన్న బీఎస్ఎఫ్ సెంట్రల్ స్కూల్ ఆఫ్ వెపన్స్ అండ్ టాక్టిక్స్‌కు పంపించారనే విషయం తెలిసింది" అని ఆయన చెప్పారు.

ఇది బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ ఏర్పడిన సమయంలో జరిగింది. ఇండోర్లో బీఎస్ఎఫ్ ట్రైనింగ్ అకాడమీ పెట్టారు.

ఆ సమయంలో ఆయుధాల కోసం రాష్ట్రపతి అన్ని రాష్ట్రాలకూ లేఖలు రాశారు. అకాడమీలో ట్రైనింగ్ కోసం ఆయా రాష్ట్రాలు తమ దగ్గరున్న ఆయుధాలను ఇండోర్ పంపించాలని కోరారు.

పంజాబ్ నుంచి అకాడమీకి వచ్చిన 8 ఆయుధాల్లో భగత్ సింగ్ ఉపయోగించిన పిస్టల్ కూడా ఉంది.

పిస్టల్ పెయింట్ తీసి నంబర్ వెతికారు

"ఇండోర్‌లో కూడా పిస్టల్ వివరాలు తెలుసుకోవడం చాలా కష్టమైంది" అని జుపిందర్ జీత్ చెప్పారు.

"నేను చాలా కష్టపడి బీఎస్ఎఫ్ ఐజీ పంకజ్‌ను కలవ గలిగాను. ఆయన ఆ ఆయుధాల గురించి వివరాలు ఇవ్వవచ్చు" అన్నారు.

ఆయుధాలకు తుప్పు పట్టకుండా ఉంచేందుకు వాటికి పెయింట్ వేసి ఉంచేవారు

"ఐజీ పంకజ్, పంజాబ్ నుంచి వచ్చిన ఆయుధాల లిస్ట్ తీసుకున్నారు. ఆ లిస్టులో ఉన్న ఆయుధాలపై పెయింట్ గీకడం మొదలు పెట్టారు. మూడో పిస్టల్‌కు ఉన్న పెయింట్ తీయగానే మేం వెతుకుతున్న పిస్టల్ అదే అని తెలిసింది. భగత్ సింగ్ పిస్టల్ నంబర్ ఆ పిస్టల్ నంబర్‌తో మ్యాచ్ అయ్యింది" అని జుపిందర్ చెప్పారు.

**భగత్‌సింగ్ వర్ధంతి వ్యాసాలు**

"తర్వాత ఆ పిస్టల్‌ను పంజాబ్ ఎలా తీసుకెళ్లాలా అనే సమస్య ఎదురైంది"

"పిస్టల్ పత్రాల ఆధారంగా పంజాబ్, హర్యానా హైకోర్టులో ఒక పిటిషన్ వేశాం. అందులో పిస్టల్‌పై అసలు హక్కు పంజాబ్‌కే దక్కుతుందని చెప్పాం. అందుకే దీన్ని పంజాబ్ స్వాధీనం చేయాలని కోరాం"

ఈ అంశాన్ని పెద్ద ఎత్తున లేవనెత్తి, కోర్టులో పిటిషన్ వేయడంతో పిస్టల్‌ను పంజాబ్ పంపించడానికి అడ్డంకులు తొలగిపోయాయి.

### పంజాబ్ హుస్సేనీవాలాలో పిస్టల్

భగత్ సింగ్ ఉపయోగించిన ఈ పిస్టల్‌ను ఇప్పుడు పంజాబ్‌లోని హుస్సేనీవాలా మ్యూజియంలో భద్రపరిచారు.

హుస్సేనీవాలా సరిహద్దు దగ్గరకు ప్రతి రోజూ జనం భారీ సంఖ్యలో వస్తుంటారు. వారందరూ దాన్ని చూడాలనే భగత్ సింగ్ స్వగ్రామం ఖట్కర్ కలాన్ మ్యూజియంలో ఈ పిస్టల్‌ను పెట్టలేదు.

అమెరికాలో తయారైన ఈ పిస్టల్ భగత్ సింగ్‌కు ఎవరు తీసుకొచ్చి ఇచ్చారనే ఆధారాలు లభించలేదు. జుపిందర్ ఆ వివరాలు కూడా తెలుసుకునే ప్రయత్నాల్లో ఉన్నారు.

భగత్ సింగ్ జైలు డైరీని వెలుగులోకి తెచ్చిన ప్రొఫెసర్ మాలవిందర్జిత్ సింగ్ వడాచ్ కూడా జుపిందర్ జీత్ అన్వేషణకు పుస్తక రూపం ఇచ్చేందుకు సాయం చేశారు. ❑

---

## భగత్‌సింగ్ జీవిత సంగ్రహం


**(7వ పేజీ తరువాయి)**

డైరీని వ్రాసే అలవాటు ఉన్న భగత్ సింగ్ చివరకి 404 పుటలను నింపాడు. తాను సమర్థించే పలువురు ప్రముఖుల ఉల్లేఖనాలు మరియు వారి గొప్ప వాక్యాలకు సంబంధించి సింగ్ తన డైరీలో పలు సూచనలు చేశాడు. అందులో కార్ల్ మార్క్స్ మరియు ఫ్రెడ్రిచ్ ఏంజిల్స్ ఆలోచనలను ప్రముఖంగా ప్రస్తావించాడు. భగత్ సింగ్ డైరీలోని పలు వ్యాఖ్యలు ఆయన విశిష్టమైన దార్శనిక అవగాహనకు అద్దం పడుతాయి. "దేవుడిపై విశ్వాసం లేని అహంకారి అనిపించుకున్న సింగ్ మరణానికి ముందు కూడా నేను ఎందుకు నాస్తికుడనయ్యాను?" అనే శీర్షికతో ఒక వ్యాసాన్ని రాశాడు.

23 మార్చి 1931న భగత్ సింగ్‌తో పాటు ఆయన సహచరులు రాజ్‌గురు మరియు సుఖ్‌దేవ్‌ను లాహోర్‌లో ఉరి తీశారు. సింగ్ ఉరిని వ్యతిరేకిస్తూ నిరసన చేపడుతున్న ఆయన మద్దతుదారులు ఆయన్ను ఆ క్షణమే షహీద్ లేదా అమరవీరుడుగా ప్రకటించారు. అప్పటి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ V.N. స్మిత్ ప్రకారం, సింగ్‌ను ముందుగానే ఉరి తీశారు.

సాధారణంగా ఉదయం 8 గంటలకు ఉరితీసేవారు. అయితే ఏమి జరిగిందో ప్రజలు తెలుసుకునే లోగానే ఆయన్ను ఉరి తీయాలని నిర్ణయించారు...సుమారు రాత్రి 7 గంటల ప్రాంతంలో జైలు లోపల నుంచి ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ నినాదాలు వినిపించాయి. సింగ్ జీవితానికి చివరగా తెర దించబోతున్నారన్న విషయానికి అది సంకేతమయింది.

సట్లెజ్ నది ఒడ్డున ఉన్న హుస్సేనివాలా వద్ద సింగ్‌ను దహనం చేశారు. భగత్ సింగ్ స్మారకచిహ్నం నేడు భారత స్వాతంత్ర్య సమరయోధులను గుర్తుకు తెస్తుంది. ❑



# భగత్ సింగ్ పిస్టల్ అనేకానేక స్మృతులు

ఎన్ వేణుగోపాల్
ఎడిటర్, వీక్షణం మాసపత్రిక



భగత్ సింగ్‌కు సంబంధించిన ప్రత్యేక వస్తువు ఒకటుంది. అది తెరమీద, కార్లు, గోడలపై ఉన్న ఆయన చిత్రంలో కనిపిస్తూ ఉంటుంది. అది దాదాపు 85 ఏండ్ల తర్వాత దొరికిందట. దాని గురించే వీక్షణం ఎడిటర్ ఎన్. వేణుగోపాల్ తన ఫేస్‌బుక్ వాల్‌పై రాసుకొచ్చారు. అది యధాతథంగా..

నవంబర్ 2-3 తేదీల్లో ఆర్మూరులో రైటర్స్ మీట్ నిర్వహించిన కథా ఉత్సవంలో కలిసిన జుపిందర్ జీత్ సింగ్ అమరవీరుడు భగత్ సింగ్ గురించి అనేక జ్ఞాపకాలకు తెర తీశాడు. ఈసారి కథా ఉత్సవానికి 'డిస్కవరీ ఆఫ్ భగత్ సింగ్స్ పిస్టల్ అండ్ హిజ్ అహింస' పుస్తక రచయిత, జర్నలిస్టు, కథా రచయిత జుపిందర్ జీత్ సింగ్ వస్తున్నాడని ఖదీర్ ఫేస్ బుక్ పోస్ట్ పెట్టినప్పుడే ఆసక్తి కలిగి, ఆయన ఫేస్ బుక్ మీద ఉన్నాడని చూసి ఫ్రెండ్ రిక్వెస్ట్ కూడా పంపాను. చిరకాల మిత్రుడు, పంజాబీ ప్రజా ఉద్యమాల నాయకుడు, ఇటీవలి కాలంలో రైతాంగ సమస్యలపై పనిచేస్తున్న దర్శన్ పాల్ కూడా ఉమ్మడి స్నేహితులలో ఉండడం చూసి జుపిందర్ మీద ఆసక్తి ఇంకా పెరిగింది. నవంబర్ 1 సాయంత్రం ఆర్మూరుకు బయల్దేరేటప్పుడు ఆయన మర్నాడు సాయంత్రానికి వస్తాడని ఖదీర్ చెప్పాడు.

ఆ మర్నాడు సాయంత్రం ఆర్మూరులో అరగంట సేపు ఆపకుండా భోరున వాన. కరెంటు పోయింది. ఆ చీకట్లోనే వెలుగుల రవ్వల జడిగా జహా ఆరా గారి ఉపన్యాసం. హిందుత్వ ఫాసిజం కేవలం ముస్లిం ప్రజానీకానికి మాత్రమే కాక మొత్తంగా భారత సమాజానికి ఎంత హానికరమో, ప్రగతిశీలంగా కనబడే వారిలో కూడ హిందుత్వ ఎలా ప్రచ్ఛన్నంగా ఉంటుందో ఆమె వాగ్ధారతో మరొకసారి మరింత బలంగా ఆర్ద్రంగా అర్థమవుతూ ఆలోచిస్తూ ఉండగానే కరెంటు వచ్చి మరొక సెషన్ జరుగుతుండగా జుపిందర్ ప్రవేశించాడు. ప్రగతిశీల రచయితలందరూ నాస్తికులూ హేతువాదులూ కావాలని ఆశించడం అత్యాశేనేమో గాని, 'నేనెందుకు నాస్తికుణ్నయాను' అని అద్భుతమైన రచన చేసిన భగత్ సింగ్‌ను ప్రేరణగా తీసుకున్న వ్యక్తులు ఆస్తికులుగా ఉన్నారంటే ఆశ్చర్యపోతాను. అలాగే నుదుట కుంకుమ బొట్టుతో ప్రవేశించిన జుపిందర్‌ను చూసి కాస్త దిగులు పడ్డాను. దిగగానే అక్కడ ఉన్న ఆలయంలోకి వెళ్లాలన్నాడని, అక్కడ బొట్టు పెట్టుకున్నాడని తెలిసింది. ఒక వైపేమో అంత గొప్ప విషయం మీద పుస్తకం రాసిన అభినివేశం, మరొకవైపు ఈ హిందుత్వ దుర్మార్గ వేళ బహిరంగ హిందుత్వ చిహ్న ప్రదర్శన. ఏమిటిది అని విచారమే ఆ రాత్రంతా.

మర్నాడు హైదరాబాదులో జరూరు పని వల్ల ఉదయమే బయల్దేరుతానని అంటే ఖదీర్ మొదటి సెషన్‌లోనే జుపిందర్‌తో మాట్లాడిస్తానని, దానికి అధ్యక్షత వహించి వెళ్లిపొమ్మని అన్నాడు. మర్నాడు ఉదయమే ఆ సెషన్‌కు అధ్యక్షత వహించే ముందు, చూస్తారా అని సురేష్ డిస్కవరీ ఆఫ్ భగత్ సింగ్స్ పిస్టల్ నా చేతిలో పెట్టాడు. భగత్ సింగ్ ఆ ఆయుధాన్ని ఒకే ఒక్కసారి పోలీసు అధికారి సాండర్స్‌ను చంపడానికి వాడడం మినహా, మొత్తంగా అహింసావాది అనే వైఖరి తీసుకున్నాడని పుస్తకం శీర్షిక, ముందుమాట చెపుతున్నాయి. భగత్ సింగ్ వ్యక్తిత్వం గురించి ఈ కోణం కాస్త ఆసక్తి కలిగించి అక్కడక్కడా తిరగేస్తూ పుస్తకంలో ఏమున్నదో దాదాపుగా గ్రహించాను.

సైమన్ కమిషన్‌ను బహిష్కరిస్తూ దేశవ్యాప్తంగా జరిగిన అనేక ప్రదర్శనల్లో భాగంగా లాహోర్‌లో జరిగిన ఊరేగింపు మీద అక్కడి పోలీసు సూపరింటెండెంట్ జేమ్స్ స్కాట్ ఆదేశాల మీద పోలీసులు విరుచుకుపడ్డారు. ఊరేగింపుకు నాయకత్వం వహిస్తున్న లాలాలజపత్‌రాయ్ మీద లాఠీలు విరగ్గొట్టారు. అత్యంత గౌరవనీయుడైన పుర ప్రముఖుడు, జాతీయవాది లాజపత్ రాయ్ ఆ దెబ్బలతో రెండువారాల తర్వాత మరణించాడు. అందుకు కారణమైన స్కాట్‌కు శిక్ష విధించి దేశంలో బ్రిటిష్ పాలకులకు పాఠం చెప్పాలని హిందుస్తాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ నిర్ణయించింది. ఆ పనిని చంద్రశేఖర్ ఆజాద్ భగత్ సింగ్‌కు అప్పజెప్పి, ఒక అమెరికన్ తయారీ కోల్ట్ పాయింట్ 32 పిస్టల్ ఇచ్చాడు. స్కాట్ జిల్లా పోలీసు కార్యాలయం నుంచి బైటికి వస్తుండగా కాల్చి చంపాలని ప్రణాళిక వేసుకున్నారు. బైటికి రాగానే అక్కడ నిలబడిన జయగోపాల్ (?) సైగ చేయాలి. ఆ సైగ చూసి రాజ్‌గురు కాల్పులు జరపాలి. అయినా తప్పించుకుంటే భగత్ సింగ్ కాల్పులు జరపాలి. పని అయిపోగానే ముగ్గురూ తప్పుకోవాలి. ఇదీ ప్రణాళిక. లాజ్ పత్ రాయ్ మరణించిన నలభై రోజులకు, 1928 డిసెంబర్ 17 సాయంత్రం వేళ పోలీసు కార్యాలయం నుంచి ఒక తెల్ల పోలీసు అధికారి మోటార్ సైకిల్ మీద బైటికి వస్తుంటే, అతనే స్కాట్ అనుకుని సుఖదేవ్ సైగ చేశాడు. వెంటనే భగత్ సింగ్ తన చేతిలో పిస్టల్‌కు పని చెప్పాడు. మోటార్ సైకిల్ మీంచి జాన్ సాండర్స్ కుప్ప కూలిపోయాడు. మర్నాడు హిందుస్తాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ తరఫున తామే ఈ పని చేశామని పోస్టర్లు వేశారు. కాని పోలీసులు మాత్రం

భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు లను పట్టుకోలేకపోయారు.

తర్వాత నాలుగు నెలలకు, 1929 ఏప్రిల్ 8న, ఢిల్లీలో సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ (ప్రస్తుత పార్లమెంట్) లో బాంబులు విసిరి, తప్పించుకునే అవకాశం ఉండి కూడా భగత్ సింగ్ పోలీసుల చేత చిక్కాడు. సాండర్స్ హత్య కేసు, అది ఒక భాగంగా తయారు చేసిన లాహోర్ కుట్రకేసు, విచారణ జరిగి, 1930 అక్టోబర్ 7న ముగ్గురికీ ఉరిశిక్ష విధించారు. భగత్ సింగ్ వాడిన పిస్టల్ అలా కోర్టు ముందుకు ఎగ్జిబిట్ గా వచ్చింది. తీర్పు తర్వాత 1931లో ఆ పిస్టల్‌ను పోలీసు మాల్‌ఖానాలో ఉంచమని కోర్టు పోలీసులకు అప్పగించింది. అది అక్కడి నుంచి న్యాయమూర్తి ఆదేశాల మేరకే జలంధర్ జిల్లాలోని ఫిల్లార్ పోలీసు అకాడమీ శిక్షణా కేంద్రానికి చేరింది. అది అక్కడికి చేరిందనేది కూడా ఇప్పుడు పాకిస్తాన్‌లో ఉన్న లాహోర్ న్యాయస్థానపు కవిలెకట్టల్లో ఎవరికీ దొరకని సమాచారంగా మిగిలిపోయింది. 1965లో బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ ఏర్పాటు చేసి, దాని ప్రధాన ఆయుధ శిక్షణా కేంద్రం ఇండోర్‌లో స్థాపించాక, ఫిల్లార్ నుంచి ఇండోర్ కు 1969లో బదిలీ చేసిన ఆయుధాలలో ఈ పిస్టల్ కూడా చేరింది. ఈ ప్రయాణమంతటిలోనూ అది 168896 అనే గుర్తింపు సంఖ్య గల ఆయుధంగా మాత్రమే గుర్తింపు పొందింది గాని అది భగత్ సింగ్ అరచేతిలో ఇమిడిన, ఆ ట్రిగ్గర్ మీద భగత్‌సింగ్ మునివేలు ఆడిన పిస్టల్ అని ఎవరికీ తెలియదు. 1931 తర్వాత ఎవరికీ జాడ తెలియని ఈ పిస్టల్ ప్రయాణాన్నంతా వెతికి పట్టుకుని 2017లో జుపిందర్ ఇండోర్‌లో ఆ పిస్టల్‌ను కనిపెట్టాడు. తన అన్వేషణా అనుభవాన్నంతా అక్షరీకరించి ఈ పుస్తకం రాసి 2018లో ప్రచురించాడు.

సెషన్ ప్రారంభమయ్యే ముందు కొన్ని నిమిషాలు జుపిందర్ తో మాట్లాడాను. ఈ పుస్తకాన్ని భగత్ సింగ్ మేనల్లుడు ప్రొ. జగ్‌మోహన్‌సింగ్ ఆవిష్కరించారని విని, నా పుస్తకం Understanding Maoists కూడా జగ్మోహనసింగే హైదరాబాదులో ఆవిష్కరించారని చెప్పాను. పుస్తకం చదివితే, మాట్లాడితే రాత్రి కలిగిన నొప్పి కాస్త తగ్గినట్టే అనిపించింది. తెలుగులో భగత్ సింగ్ మీద చాలా ప్రేమాభిమానాలు, ఆసక్తి ఉన్నాయని, ఈ పుస్తకం తెలుగులో వస్తే బాగుంటుందని, ఇప్పటికి ఎవరూ అడిగి ఉండకపోతే నేను చేస్తానని చెప్పాను. ఆయన సరేనన్నాడు. పుస్తకం ఎలాగూ తెలుగులో కొన్ని నెలల్లో మీ చేతుల్లో ఉంటుంది గాని ఈలోగా ఈ పుస్తకం ప్రేరేపించిన జ్ఞాపకాలు మీతో పంచుకోవాలి.

భగత్‌సింగ్ పేరు ఎనిమిదో తరగతికి ముందే విని ఉన్నానేమో గాని అంత గుర్తు లేదు. ఎనిమిదో తరగతికి హనుమకొండ వస్తుండగానే, సృజన మార్చి–ఏప్రిల్ 1973 సంచిక ముఖచిత్రం భగత్ సింగ్. కొన్నాళ్లకే 'విప్లవమంటే...' అనే భగత్‌సింగ్ కోర్టు ఉపన్యాసానికి ముదార్ వేణు గారి అనువాదం కూడా సృజనలో వేశాం. అప్పటి నుంచీ ఈ దేశంలో కోట్లాది మందికి లాగానే నాకూ భగత్ సింగ్ ఆరాధ్యుడయ్యాడు.

**భగత్‌సింగ్ వర్ధంతి వ్యాసాలు**

ఎమర్జెన్సీ అయిపోగానే, అంటే నేను ఇంటర్మీడియట్‌లో ఉండగా, అప్పుడే కావలిలో కెవిఆర్ తదితరులు ప్రారంభించిన సంస్థ తరపున భగత్ సింగ్ 'నేనెందుకు నాస్తికుణ్నయ్యాను' చిన్న బుక్‌లెట్ గా ప్రచురించారు. ఆ పుస్తకం అమ్ముతూ, చదువుతూ, కంఠోపాఠం గా ఉటంకిస్తూ ఆ రోజులు గడిచాయి. బహుశా ఆ తర్వాత రెండు మూడేళ్లకే జనసాహితి ప్రచురించిన భగత్ సింగ్ రచనల సంకలనం 'నా నెత్తుటి కోనేటిలో', ఆలూరి భుజంగరావు గారు అనువాదం చేసిన యశ్ పాల్ 'సింహావలోకనం' మూడు భాగాలూ ప్రచురించారు. ఆ కాలమంతా భగత్‌సింగ్‌తో, ఆ వీరులతో సహజీవనమే.

అప్పటిదాకా మిత్రుల మధ్య, చిన్న గదుల్లో మాత్రమే మాట్లాడుతున్నవాణ్ణి, 1983 జనవరిలో ఆర్ ఎస్ యు సభల సందర్భంగా బహిరంగ సభల్లో మాట్లాడడం మొదలు పెట్టానని ఇది వరకు రాశాను. ఆ క్రమంలో 1983 మార్చ్ 23న గద్వాలలో తేరు మైదానంలో పటేల్ సుధాకర్ రెడ్డి, సాయి రెడ్డిల నిర్వహణలో భగత్ సింగ్ సంస్మరణ సభ. నేనక్కడ వక్తను. ఒక బహిరంగ సభా వేదిక మీదినుంచి, నాలుగైదు వేల మంది శ్రోతల ముందు భగత్ సింగ్ జీవితం గురించీ, స్ఫూర్తి గురించీ, ఇవాళ్టికీ ప్రాసంగికత గురించీ మాట్లాడాను. ఆ తర్వాత గడిచిన ముప్పై ఆరేళ్లలో భగత్ సింగ్ గురించి ఎన్నోచోట్ల ఎన్నోసార్లు మాట్లాడాను, రచనల్లో, ఉపన్యాసాల్లో ప్రస్తావించాను. ఇంగ్లీష్ లో వచ్చిన భగత్ సింగ్ రచనలన్నీ, భగత్ సింగ్ జీవిత చరిత్రల్లో అత్యధికం చదివాను. ఇరవై మూడేళ్లు నిండకుండానే ఎన్నెన్ని విషయాల మీద ఎంత స్పష్టతతో, ఎంత గాఢమైన వలసవాద వ్యతిరేక దృక్పథంతో ఆలోచించాడో చూసి ఆశ్చర్యపోతుంటాను. ప్రాణ త్యాగం వల్ల మాత్రమే కాదు, ఆ త్యాగానికి ముందు చేసిన సాయుధ చర్య వల్ల మాత్రమే కాదు, విస్తారమైన, విస్పష్టమైన ఆలోచన వల్ల భగత్ సింగ్ భారతీయ యువతరానికి ఎప్పటికీ ఆదర్శంగానే నిలుస్తాడు.

నా ఇంగ్లీష్ పుస్తకం ఆవిష్కరణకు ఎవరిని పిలవాలని ఆలోచిస్తున్నప్పుడు భగత్ సింగ్ పోరాటానికీ, ఇవాళ సాగుతున్న పోరాటాలకూ వారధిగా ఉన్న భగత్ సింగ్ మేనల్లుడు ప్రొ. జగ్ మోహన్ సింగ్ ను ఆహ్వానించాలని అనుకున్నాను. జగ్ మోహన్ హైదరాబాదు వచ్చి నా పుస్తకం ఆవిష్కరించడం అద్భుతమైన అనుభవం. మొన్నటికి మొన్న ఏదో అవసరం కొద్దీ మళ్లీ ఒకసారి దరిశి చెంచయ్య గారి 'నేనూ నా దేశం' చదువుతూ, అందులో గదర్ పార్టీ వీరోచిత ప్రయత్నాల గురించి చదువుతూ కూడ భగత్ సింగ్ ను ఎంతగానో తలచుకున్నాను.

భారత ప్రజా పోరాటాలలో, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలలో ఎన్నటికీ ఆరని అరుణతార భగత్ సింగ్. ❑

భగత్‌సింగ్ వర్ధంతి వ్యాసాలు

# 90 ఏళ్ల క్రితం కులం గురించి భగత్‌సింగ్ ఏం చెప్పారు?

వెంకట కిషన్ ప్రసాద్
బీబీసీ

"ఎంపుడు కుక్కను ఒళ్లో కూర్చోబెట్టుకుంటాం.. కానీ సాటిమనిషిని ముట్టుకుంటే మైలపడిపోతాం. ఎంత సిగ్గుచేటు?" ఈ మాటలు 'షహీద్' భగత్‌సింగ్ రాసిన 'అఛూత్ కా సవాల్' (అంటరానితనం సమస్య) అనే వ్యాసంలోనివి.

పంజాబ్ నుంచి వెలువడే 'కిర్తీ' అనే పత్రికలో 'విద్రోహి' (తిరుగుబాటుదారు) అనే కలం పేరుతో భగత్ సింగ్ వ్యాసం రాశారు.



"మన దేశంలో ఉన్నంత దుర్భర పరిస్థితులు మరే దేశంలోనూ లేవు" అంటూ ఆయన వ్యాసం మొదలవుతుంది.

"ఇక్కడ చిత్రవిచిత్రమైన సమస్యలున్నాయి. వీటిలో ముఖ్యమైంది అంటరానితనం. సమస్యేంటంటే, 30 కోట్ల జనాభా ఉన్న దేశంలో 6 కోట్ల మందిని అస్పృశ్యులుగా పరిగణిస్తున్నారు. వారిని ముట్టుకుంటే చాలు అధర్మం జరిగిపోతుందని చెబుతారు. వాళ్లు గుడిలో అడుగుపెడితే దేవుళ్లకు కోపం వస్తుందంటారు. వారు బావి నుంచి నీటిని తోడితే బావి అపవిత్రమై పోతుందంటారు. ఇరవై శతాబ్దంలో కూడా ఈ సమస్య ఇలా కొనసాగుతోందంటే వినడానికే సిగ్గుగా ఉంది" అన్నవి భగత్‌సింగ్ వ్యాసంలో ప్రారంభ వాక్యాలు.

1928 జూన్‌లో, అంటే అంటరానితనాన్ని నిషేధిస్తూ నాటి నేషనల్ అసెంబ్లీలో చట్టం చేయడానికి సరిగ్గా 22 ఏళ్ల కిందట, ఈ వ్యాసం అచ్చయ్యే నాటికి భగత్‌సింగ్ వయసు కేవలం 20 ఏళ్లే.

## చిరుప్రాయంలోనే..

భారతదేశ స్వాతంత్ర్యం కోసం 23 ఏళ్ల యువప్రాయంలోనే ఉరికంబం ఎక్కిన భగత్‌సింగ్ నేటికీ ఎందరికో ఆదర్శంగా నిలుస్తాడనే విషయంలో సందేహం లేదు.

చరిత్రకారులు ఆయనను సోక్రటీస్, జోన్ ఆఫ్ ఆర్క్, చేగువేరా వంటి ప్రపంచ ప్రసిద్ధి గాంచిన విప్లవకారుల సరసన లెక్కిస్తారు.

భగత్‌సింగ్ ఒక విప్లవకారుడే కాదు, మంచి చదువరి, వక్త, రచయిత కూడా.

ఆయన లాహోర్ జైలులో ఉన్న కాలంలో రాసిన 404 పేజీల డైరీని చూసినా, తనకు ఫలానా పుస్తకాలు పంపించాలని కోరుతూ బయట ఉన్న తన సహచరులకూ, బంధుమిత్రులకు రాసిన లేఖలను పరిశీలించినా ఆయన విశ్వ సాహిత్యాన్ని చదవడం కోసం ఎంత పరితపించాడో తెలుస్తుంది.

చిన్న వయసులోనే ఆయన తన అధ్యయనానికీ, రచనా వ్యాసంగానికి ఎంచుకున్న విస్తృతిని గమనిస్తే మనకు ఆశ్చర్యం వేస్తుంది.

భగత్‌సింగ్ ప్రధానంగా భారత స్వాతంత్ర్యోద్యమం, ప్రపంచ రాజకీయాలు, సోషలిజం-విప్లవం, కార్మికోద్యమాలు, మతం, నాస్తికత్వం వంటి అంశాలపై రచనలు చేశారన్నది తెలిసిందే.

అయితే నేడు దళిత సమస్యగా వ్యవహరిస్తున్న అంటరానితనం గురించి ఆయన భావాలేమిటో కేవలం పైన పేర్కొన్న ఒక్క వ్యాసం ద్వారానే లభ్యమవుతున్నప్పటికీ ఆయన లేవనెత్తిన విషయాలలో గాఢత, లోతు ఉన్నాయి.

## సమకాలీన ఘటనల ప్రభావం

భగత్‌సింగ్ 1928లో ఈ వ్యాసం రాయడానికి కాస్త ముందుగా కొన్ని ముఖ్య ఘటనలు జరిగాయని చరిత్రకారుడు అశోక్ యాదవ్ గుర్తు చేస్తారు.

1927 డిసెంబర్ 25న బీఆర్ అంబేద్కర్, ఆయన అనుచరులు కలిసి 'మనుస్మృతి'ని దగ్ధం చేశారు.

అదే సంవత్సరం మార్చి 20న వారు 'మహద్ సత్యాగ్రహం' చేపట్టి మహద్ అనే ప్రాంతంలో చెరువులో నీటిని తాగారు.

అప్పటి వరకు అంటరానివారికి చెరువులలో, బావులలో నీటిని కూడా ముట్టుకునే హక్కు లేదు.

1926లో సింధ్ ప్రాంతానికి చెందిన నూర్ మహ్మద్ అనే శాసనసభ్యుడు బాంబే కౌన్సిల్‌లో ప్రసంగిస్తూ, "సాటి మనిషికి తాగడానికి నీళ్లు కూడా మీరు ఇవ్వనపుడు, వాళ్లను స్కూళ్లలో చదువుకోవడానికే అనుమతించనపుడు, మీకు మరిన్ని అధికారాలు

కావాలని పరాయి పాలకులను అడగడంలో అర్థం ఏముంది? సాటి మనిషికే సమాన హక్కులు ఇవ్వడానికి మీరు సిద్ధంగా లేనపుడు మరిన్ని రాజకీయ హక్కులు కావాలని అడగడంలో ఔచిత్యం ఏముంది?" అని అన్నారు.

పై మాటలను భగత్‌సింగ్ తన వ్యాసంలో ఉల్లేఖించడమే కాదు, "ముస్లిం కాబట్టి అంటరానివారిని తమ మతంలో చేర్చుకోవడం కోసమే ఇలా మాట్లాడాడంటూ ఆయనపై నిందలు వేయకండి" అని కూడా అందులో రాశారు.

కేథరీన్ మేయో అనే అమెరికన్ పరిశోధకురాలు రాసిన 'మదర్ ఇండియా' పుస్తకం కూడా దాదాపు అదే సమయంలో విడుదల కావడం మరొక ముఖ్య పరిణామం.

భారతదేశంలో, ముఖ్యంగా హిందూ సమాజంలో ఉన్న చెడులను ఆమె తన పుస్తకంలో కళ్లకు గట్టినట్టుగా రాశారు.

అయితే గాంధీజీ ఈ పుస్తకాన్ని 'మురికికాల్వల ఇన్‌స్పెక్టర్ నివేదిక' అంటూ మండిపడ్డారు.

కానీ భగత్‌సింగ్ మాత్రం మేయో రాసిన "స్వాతంత్ర్యాన్ని కోరుకునే వారు తమపై తాము కూడా పోరాడాలి" అన్న మాటను తన వ్యాసంలో ప్రముఖంగా ఉల్లేఖించారు.

ఇలా ఈ మూడు ఘటనలు - మహద్ సత్యాగ్రహం, మనుస్మృతి దహనం, మదర్ ఇండియా పుస్తకం - సామాజిక సమస్యల అంశాన్ని జాతీయోద్యమంలో బలంగా ముందుకు తెచ్చిన నేపథ్యంలోనే భగత్‌సింగ్ పై వ్యాసాన్ని రాశాడని అశోక్ యాదవ్ అంటారు.

## మనుషుల్లా చూడకపోతే మతం మారరా?

మతమార్పిడుల గురించి ఇటీవలి దశాబ్దాలలో చాలానే చర్చ జరుగుతోంది.

అయితే అంటరానివారు (దళితులు) తాము ఎదుర్కొంటున్న అవమానాల నుంచి తప్పించుకోవడానికి ఇతర మతాల్లో చేరాలని భావిస్తుంటే అందులో తప్పేంటని భగత్ సింగ్ తన వ్యాసంలో ఆనాడే ప్రశ్నించారు.

"మీరిలా సాటి మనుషులనే పశువులకన్నా హీనంగా చూస్తుంటే వాళ్లు ఇతర మతాల్లోకి వెళ్లాలని భావించడంలో తప్పేముంది? తమకు ఎక్కువ హక్కులు లభిస్తాయని, తమతో సాటిమనుషుల్లా ప్రవర్తిస్తారని నమ్మకం ఉన్న ఇతర మతాల్లోకి వెళ్లిపోతారు. అప్పుడు మీరు ..క్రైస్తవులు, ముస్లింలు కలిసి హిందూ మతానికి నష్టం చేకూరుస్తున్నారని వాపోతే అందులో అర్థమేముంది?" అని భగత్‌సింగ్ తన వ్యాసంలో రాశారు.

భగత్‌సింగ్ వర్ధంతి వ్యాసాలు

## తిరగబడకుండా అడ్డుకోవడం కోసమే పునర్జన్మ సిద్ధాంతం!

మనుషులందరూ సమానమేననీ, పుట్టుక వల్ల గానీ పని విభజన వల్ల గానీ ఎవరూ ఎక్కువ లేదా తక్కువ కారని భగత్‌సింగ్ అభిప్రాయపడ్డారు.

అంటరాని వారి పట్ల అనుసరిస్తున్న అన్యాయమైన, అమానవీయమైన పద్ధతులతో వారెక్కడ తిరుగుబాటుకు పూనుకుంటారోనన్న భయంతోనే పునర్జన్మ సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చారని ఆయన తీవ్రంగా విమర్శించారు.

"ఇదంతా నువ్వు పూర్వ జన్మలో చేసుకున్న పాపాల ఫలితం. ఇప్పుడు చేసేదేముంది? నోరు మూసుకొని ఇదంతా అనుభవించు అంటూ వారికి ఓపిక పట్టాలనే ఉపదేశాలు చేసి చేసి చాలా కాలం పాటు వారిని నోరెత్తకుండా చేశారు. కానీ ఇదే అతి పెద్ద పాపం. మీరు మనిషిలో మానవత్వాన్నే లేకుండా చేశారు. ఆత్మవిశ్వాసం, స్వావలంబన వంటి భావనలను అంతమొందించారు. అంటరానివారిపై చాలా దమనకాండకూ, అన్యాయానికి పాల్పడ్డారు. ఇప్పుడు వాటన్నింటికి గాను ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది" అని భగత్‌సింగ్ రాశారు.

## సమాజానికి అవసరమైన పనుల పట్ల ఏవగింపా?

మలాన్ని శుభ్రం చేసినంత మాత్రాన మనుషులు అంటరాని వాళ్లెట్లా అవుతారని భగత్‌సింగ్ తన వ్యాసంలో ప్రశ్నిస్తారు.

"తల్లులు తమ పిల్లల మలాన్ని శుభ్రం చేయడానికీ, పాకీపని చేసే ఓ వ్యక్తి మలాన్ని శుభ్రం చేయడానికి తేడా ఏముంది" అని ఆయన తన వ్యాసంలో వాదిస్తారు.

ఇలా మనుషులను అంటరానివారిగా చేసే దురాచారం వల్ల సమాజానికి అవసరమైన పనుల పట్ల మనుషుల్లో ఏవగింపు మొదలైందని, దాంతో సమాజ పురోగమనానికి అడ్డంకి ఏర్పడిందని ఆయన అభిప్రాయపడ్డారు.

"మనం బట్టలు నేసేవాళ్లను చీదరించుకున్నాం. ఈరోజు నేత పని చేసే వాళ్లను కూడా చాలా చోట్ల అంటరానివారిగా చూస్తున్నారు. యూపీ వైపు డోలీలను మోసేవారిని కూడా అంటరానివారిగానే చూస్తారు. దీంతో సమాజంలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. సమాజం ముందుకు సాగకుండా అడ్డంకులు ఏర్పడ్డాయి" అని ఆయన రాశారు.

☞ మిగతా 36వ పేజీలో

భగత్‌సింగ్ వర్ధంతి వ్యాసాలు

# భగత్ సింగ్ దళిత దార్శనికత

ఆచార్య వి. కృష్ణ

అస్పృశ్యతా దురాచారంపై తిరుగుబాటు కోసం యువకులతో కూడిన సామాజిక విప్లవ సంస్థను స్థాపించేందుకు భగత్ సింగ్ ప్రయత్నించారు. ఒక్క అంబేద్కర్‌ని మినహాయిస్తే, భగత్ సింగ్ అర్థం చేసుకున్నట్లుగా కుల సమస్యను ఏ సంస్కర్త కూడా అర్థం చేసుకోలేదు.

మన దైనందిన జీవితంలో ఒక ప్రత్యేక స్థానం కలిగి ఉన్నాడు భగత్ సింగ్. స్వాతంత్ర్య పోరాటంలో వీర మరణం పొందిన యోధులలో ఆయన ప్రథముడు. భగత్ సింగ్ పోరాటం స్వాతంత్ర్యోద్యమ స్వరూప స్వభావాలను నిర్దేశించడమే కాకుండా లౌకిక, జాతీయవాదాలకు నిర్దిష్టమైన నిర్వచనాలను నిర్దేశించింది. కమ్యూనిస్టులు అప్పటికి దేశంలో బలబడలేదు. కాంగ్రెస్ దాని నాయకులు రాజీ రాజకీయాలు చేస్తున్నారు. అలాంటి సమయంలో పూర్తి స్వాతంత్ర్యం కోసం ఆయన ఒక కార్యక్రమాన్ని రూపొందించారు.

సామ్రాజ్యవాదులను దేశం నుంచి వెళ్ల గొట్టడం, బూర్జువా, భూస్వామ్య శక్తుల నుంచి దేశ ప్రజలను విముక్తం చేయడం స్వాతంత్ర్యోద్యమ లక్ష్యం అని చెప్పారు. దాని కోసం విప్లవాన్ని కోరుకున్నారు. వారి దృష్టిలో విప్లవం అంటే 'ప్రజల ద్వారా ప్రజల కోసం రాజకీయ అధికారాన్ని సాధించడమే...' ప్రజలను సంఘటిత పరచడం, సిద్ధాంతాలకు సాన పట్టడం ద్వారానే అది సాధ్యమవుతుందని భగత్ సింగ్‌కి బాగా తెలుసు. 'బాంబులు, పిస్తోల్ ద్వారా విప్లవాన్ని తీసుకు రాలేమనే' విషయం కూడ తెలుసు. ఒక రకంగా చెప్పాలంటే విప్లవం, శ్రామిక రాజ్యం, సమానత్వ సిద్ధాంతాల మీద ఆధార పడిన సామ్యవాద వ్యవస్థను స్థాపించే కార్యక్రమాన్ని భారత దేశ ప్రజలకు పరిచయం చేసిన గొప్ప యువ మేధావి భగత్ సింగ్. అట్లాగే మతం, మత తత్త్వం, దళితుల స్థితిగతుల గురించి వారి విశ్లేషణలు కూడ నేటి సమాజానికి ఎంతో ఉపయోగకరం.

జూన్ మాసంలో 'కీర్తి' మ్యాగజైన్‌లో 'అస్పృశ్య సమస్య' అనే శీర్షికతో ఆయన రాసిన వ్యాసం చాలా ముఖ్యమైనది. దళితుల దయనీయ స్థితికి దారి తీసిన చారిత్రిక, సామాజిక అంశాలను లోతుగా పరిశీలించడంతో పాటు దళిత సమస్యకు పరిష్కారాలను కూడ ఈ వ్యాసంలో చూపారు. దీన్ని రాసినప్పుడు ఆయన



వయస్సు దాదాపు 20 ఏళ్లు. స్వాతంత్ర్యంతో పాటు దళిత సమస్యను కూడ పరిష్కరించాలనే ఆలోచన ఆ వయసులో రావడం వారి సిద్ధాంత పరిపక్వతను ఆవిష్కరిస్తుంది. దళితుల దయనీయ పరిస్థితులకు హిందూ మతమే కారణం అని చెప్పారు. దయానంద్, మాలవీయ వంటి సంస్కర్తలు ఉద్యమాలు నడిపినప్పటికీ అస్పృశ్యతను దూరం చేయలేక పోవడానికి మనువాద మనస్తత్వం నుంచి వారు బయట పడక పోవడమే ప్రధాన కారణం అని భగత్ అన్నారు. బ్రాహ్మణవాద ఫ్యూడల్, బూర్జువా భూస్వామ్య శక్తుల నిర్మూలనలోనే దళిత సమస్యకు పరిష్కారముందని ఆయన భావించారు. ఈ వ్యవస్థపై తిరుగుబాటు కోసం యువకులతో కూడిన సామాజిక విప్లవ సంస్థను స్థాపించే యత్నం చేశారు. 'సామాజిక ఉద్యమంతో విప్లవాన్ని పుట్టించండి. రాజకీయార్థిక విప్లవం కోసం నడుం బిగించండి. దేశానికి పునాదులు, నిజమైన శక్తి మీరే' అని పిలుపునిచ్చారు. ఒక్క అంబేద్కర్ని మినహాయిస్తే, భగత్ సింగ్ అర్థం చేసుకున్నట్లుగా కుల సమస్యను ఏ సంస్కర్త కూడా అర్థం చేసుకోలేదు. భగత్ సింగ్ ఇంకో 10, 15 ఏళ్లు బతికి ఉంటే దేశ స్వరూప స్వభావాలే మారిపోయేవి. ❑

భగత్‌సింగ్ వర్ధంతి వ్యాసాలు

# అంబేడ్కర్ పత్రికకు వందేళ్లు



డా॥ జి.కె.డి. ప్రసాద్
ఫ్యాకల్టీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగం,ఏయూ, విశాఖపట్నం

భారత సామాజిక వ్యవస్థలో స్వేచ్ఛ, సమానత్వాలకు నోచుకోక, అంటరానితనానికి గురవుతున్న నిమ్నకులాల కోసం తొలిసారిగా కలం పట్టిన అక్షరయోధుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్. ఆయన గ్రంథకర్తగానే గాక ప్రజాహిత పాత్రికేయునిగా ముద్రవేసుకున్న మేధావి. ఆంగ్లేయ పాలనలో నిమ్నకులాలకు అంచలంచెలుగా రక్షణలు సాధించేందుకు కృషి చేశారు. అంటరానితనాన్ని రూపుమాపడానికి ఎస్.కె.బోలే, ఘోలప్ వంటి సంస్కర్తలతో కలిసి 1924లో బహిష్కృత హితకారిణి సభను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ ద్వారా నిమ్నకులాల విద్యార్థులకు పాఠశాలలు, హాస్టళ్ళ ఏర్పాటుతో పాటు 'సరస్వతి విలాస్' పత్రికను ఏర్పాటు చేశారు. నిమ్నకులాల ఉద్యమంలో భాగంగా పత్రికా రచనకు పూనుకున్నారు. స్వయంగా పత్రికలను నిర్వహించారు. సామాజిక పునర్నిర్మాణం కోసం ఆయన పత్రికలు కీలకపాత్ర పోషించాయి. డాక్టర్ అంబేడ్కర్ నిర్వహించిన 'మూక్‌నాయక్', 'బహిష్కృత్ భారత్', 'సమత', 'జనత' పత్రికలు నిమ్నకులాల ఆత్మగౌరవ, హక్కుల ఉద్యమానికి వాహికగా నిలిచాయి.

కొల్హాపూర్ మహారాజా ఆర్థిక సహకారంతో 31, జనవరి, 1920లో డాక్టర్ అంబేడ్కర్ 'మూక్‌నాయక్' పక్ష పత్రికను ప్రారంభించారు. నిమ్నకులాల పోరాటాలు, అంబేడ్కర్ చేసిన ప్రసంగాలు, రచనలు ఈ పత్రిక ప్రచురించేది. విషయం పట్ల అవగాహనతో, ఆధారాలతో, పాఠకులు వాస్తవాలను గ్రహించి, అంగీకరించే రీతిలో 'మూక్‌నాయక్'' పత్రికను ఆయన నిర్వహించారు. అంటరానితనం నిర్మూలన, సంఘసంస్కరణ మీద జరుగుతున్న చర్చలు, వాదప్రతివాదాలు ఈ పత్రికలో ప్రచురించే వారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ఎమ్మెస్సీ చదివే అవకాశం రావడంతో ఆయన తన మిత్రులకు 'మూక్‌నాయక్' పత్రిక నిర్వహణను అప్పగించారు. ఆర్థిక కారణాలతో పత్రిక ప్రచురణ ఆగిపోయింది.

డాక్టర్ అంబేడ్కర్ 1927, ఏప్రిల్ 3న 'బహిష్కృత భారత్' మరాఠీ పక్ష పత్రికను బొంబాయి కేంద్రంగా ప్రారంభించారు. తాగునీటి కోసం జరిగిన మహద్ పోరాటంలో సంఘసంస్కర్తలను తన రచనలతో సమన్వయపరిచిన ఘనత ఆయనదే. నిమ్న కులాలను ఒక తాటిమీదకు తీసుకొచ్చి ఆత్మస్థైర్యాన్ని నింప గలిగారు. 'బహిష్కృత భారత్' పత్రిక ద్వారా అంబేడ్కర్ నిమ్నకులాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగలిగారు. 'అంటరానితనం నిర్మూలన నా జన్మహక్కు' అనే నినాదాన్ని 27 నవంబర్, 1927న 'బహిష్కృత్ భారత్' పత్రికలో ప్రచురించారు. ఈలోపు సైమన్ కమిషన్‌తో సంప్రదింపులు, అనంతరం రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌కు హాజరు కావలసి రావడం వల్ల అంబేడ్కర్ 'బహిష్కృత్ భారత్' పత్రిక ప్రచురణ నిలిపివేశారు.

అంబేడ్కర్ తన పత్రికల ద్వారా కోట్లాది మంది అంటరాని ప్రజానీకంలో కొంతమేర సామాజిక, రాజకీయ, ఆర్థిక స్థితి గతుల్లో మార్పు తీసుకొచ్చారు. నిమ్నకులాలకు పత్రికా రచన వారసత్వాన్ని తీసుకొచ్చారు. భారత రాజ్యాంగ నిర్మాణంలో పత్రిక స్వేచ్ఛకు అధిక ప్రాధాన్యత నిచ్చారు. మాట్లాడే స్వేచ్ఛ లేని, దోపిడీకి గురవుతున్న కోట్లాదిమంది నిమ్నకులాల కోసం అంబేడ్కర్ పాత్రికేయునిగా అవతరించారు. అణగారిన వర్గాల దాస్యవిమోచకునిగా నాటి పత్రికా రంగం ఆయన సేవలను కొనియాడింది. టైమ్స్ ఆఫ్ ఇండియా, ది హిందుస్తాన్ టైమ్స్, ది ఫ్రి ప్రెస్ జర్నల్, ది అమృత్ బజార్ పత్రిక, ది న్యూయార్క్ టైమ్స్, ది టైమ్స్ (లండన్) మొదలైన పత్రికలు అంబేడ్కర్ స్వాతంత్ర్య ఉద్యమంలోను, భారత సామాజిక పునర్నిర్మాణంలోనూ పోషించిన పాత్రను కొనియాడుతూ సంపాదకీయాలను ప్రచురించాయి. నిర్మాణాత్మక తప్పిదాలపై ఉద్యమించి ఫలితాలు సాధించిన వ్యక్తిగా డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్‌ను ఈ దేశం సుదీర్ఘ కాలం గుర్తించుకోవలసి వుంటుందని 'ది ఫ్రి ప్రెస్ జర్నల్' పేర్కొంది. 'ది అమృత బజార్ పత్రిక' తాను అనుకున్న లక్ష్యాలను సాధించడంలో, దేశభక్తునిగా వ్యవహరించడంలో భారత ఉపఖండంలోనే ఉన్నతునిగా డాక్టర్ అంబేడ్కర్‌ను కీర్తించింది. మానవహక్కుల కోసం, ప్రజాహితం కోసం పోరాటం చేసిన మరుపురాని వ్యక్తిగా ఆయన్ని కొనియాడింది.

*(అంబేడ్కర్ 1920 జనవరి 31న స్థాపించిన 'మూక్ నాయక్' పత్రికకు వందేళ్ళు పూర్తయిన సందర్భంగా)* ❑

భగత్‌సింగ్ వర్ధంతి వ్యాసాలు

# రాజ్యాంగ పఠనమే ప్రాణవాయువు

ప్రొ॥ కంచ ఐలయ్య
షెపర్డ్ డైరెక్టర్, సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్
సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇంక్లూజివ్ పాలసీ



మహాత్మాగాంధీని, ఆయన్ని హత్యచేసిన నాథూరాం గాడ్సేని సరిసమాన దేశభక్తిపరులుగా పరిగణించినట్లయితే మన జాతి కానీ భారత ప్రజాస్వామ్యం కానీ మనలేవు. హంతకుడు, హత్యకు గురైనవాడు ఎన్నటికీ సమానులు కారని మన పిల్లలు నేర్చుకోవాలి. అహింసా ప్రబోధకుడిని, క్రూర హింస సమర్థకుడిని ఒకే స్థాయిలో గౌరవించకూడదని వారు నేర్చుకోవాలి. కానీ ఇప్పుడు మన జాతి గాంధీని, గాడ్సేని సమానం చేసి చూస్తున్న ఒక రకమైన మానసిక జాడ్యంలో కూరుకుపోతోంది. మనుషులు జన్మరీత్యా సమానులు కారని చెబుతున్న ప్రాచీన పరంపర స్థానంలో భారతీయులందరూ సమానులే అని ప్రకటించిన కొత్త పరంపరను భారత రాజ్యాంగం ప్రవేశపెట్టింది. పిల్లలు ప్రతిరోజూ రాజ్యాంగ పీఠికను పఠించడం, ప్రతి యువతీయువకుడూ రాజ్యాంగాన్ని పఠించడం మాత్రమే భారతదేశాన్ని అనేక ప్రమాదాల నుంచి కాపాడగలదు.

ప్రతిరోజూ పాఠశాల ప్రార్థనా సమావేశంలో భారత రాజ్యాంగ పీఠికను తప్పకుండా చదివి వినిపించాలని మహారాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ప్రాథమిక పాఠశాల నుంచి ఉన్నత పాఠశాల వరకు విద్యార్థులందరూ తాము రాజ్యాంగం పరిధిలో ప్రజాస్వామ్యంలో జీవిస్తున్నామని విద్యార్థులు తప్పక గుర్తుంచుకోవాలి. ఇది గొప్ప జాతీయవాద ముందడుగు. దేశంలోని ప్రతి రాష్ట్ర ప్రభుత్వమూ ప్రస్తుత మన జాతీయ సంక్షోభ సంధి దశలో దీన్ని తప్పక పాటించాల్సిన అవసరముంది. పౌరసత్వ సవరణ చట్టం, జాతీయ పౌర పట్టికకు వ్యతిరేకంగా జరుగుతున్న అన్ని ప్రదర్శనలూ రాజ్యాంగ పీఠికను, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్తరువును తమ ఉద్యమ చిహ్నాలుగా మార్చుకున్నాయి. మహిళలూ, ఇంటి బయటకు సాధారణంగా రాని ముస్లిం మహిళలతో పాటు విశ్వవిద్యాలయాల విద్యార్థులూ వీధుల్లోకి వచ్చి అరాచకంలోకి జారిపోతున్న జాతిని కాపాడారు. ప్రజాస్వామ్యం కోసం, సమానత్వం కోసం పోరాటంలో రాజ్యాంగ పీఠికను, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను సమర సంకేతాలుగా ఎత్తిపట్టిన వీరు.. భారతీయ ప్రజాస్వామ్యం, దాని పనివిధానం గురించి అంతర్జాతీయంగా ఏర్పడుతున్న ప్రతి కూల భావం నుంచి కూడా భారతదేశాన్ని కాపాడారు.

పౌరసత్వ సవరణ చట్టం, జాతీయ పౌర పట్టిక రూపంలో కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన ఒక భయంకరమైన భారత వ్యతిరేక జాడ్యం నేపథ్యంలో రాజ్యాంగ పీఠిక అనేది ప్రజలందరికీ ఒక ఆక్సిజన్ మాస్క్‌లాంటిది. ప్రజాస్వామిక ప్రభుత్వం, సమాజానికి సంబంధించిన జాతీయ స్ఫూర్తి, జీవ ధాతువుగా మన జాతి నిర్మాతలు మనకు ప్రసాదించిన రాజ్యాంగ పీఠిక, రాజ్యాంగ నీతిని విశ్వసించే ప్రస్తుత తరం పిల్లల పైనే మన రాజ్యాంగం భవిష్యత్ మనుగడ ఆధారపడి ఉంది. మహాత్మాగాంధీని, ఆయన్ని హత్యచేసిన నాథూరాం గాడ్సేని సరిసమాన దేశభక్తిపరులుగా పరిగణించినట్లయితే మన జాతి కానీ భారత ప్రజాస్వామ్యం కానీ మనలేవు. జీవితం తొలి దశలోనే మన పిల్లలు మంచికీ చెడుకీ మధ్య తేడాని గుర్తించగలగాలి. హంతకుడు, హత్యకు గురైనవాడు ఎన్నటికీ సమానులు కారని వారు నేర్చుకోవాలి. అహింసా ప్రబోధకుడిని, క్రూర హింస సమర్థకుడిని ఒకే స్థాయిలో గౌరవించకూడదని వారు నేర్చుకోవాలి. కానీ ఇప్పుడు మన జాతి గాంధీని, గాడ్సేని సమానం చేసి చూస్తున్న ఒకరకమైన మానసిక జాడ్యంలో కూరుకుపోతోంది.

'భారతప్రజలమైన మేము, మా మతం, కులం, జాతి, లింగం వంటివి చూసుకోకుండానే ఈ రాజ్యాంగాన్ని 1950 జనవరి 26న మాకు మేముగా ఇచ్చుకుంటున్నాము' అని రాజ్యాంగ పీఠిక ప్రకటించింది. ఆరోజు నుంచి అన్నిరకాల కులపరమైన, మతపరమైన, వలసవాద, లింగపరమైన అసమానతలన్నింటి ప్రాతిపదికన నడుస్తున్న ప్రాచీన భారతదేశ వారసత్వ పరంపర స్థానంలో అంబేద్కర్ పేర్కొన్నటువంటి ప్రతి వ్యక్తికీ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే సూత్రం వచ్చి చేరింది. ఈ హక్కులు దేశంలోని ప్రతి కులం, మతం, జాతి, లింగ భేదంతో పనిలేకుండా అందరికీ వేరుపర్చలేని హక్కులుగా ఉంటాయి. ఈ హక్కుల్ని జాతీయ పౌరసత్వ పట్టిక తొలగించలేదు. ఏదైనా కారణాల వల్ల ఇతర దేశాలనుంచి వలస వచ్చినవారికి కూడా మనం రక్షణ, జీవనాన్ని కల్పించాలని భావిస్తే, మతంతో పనిలేకుండా అలాంటి వారందరికీ మన దేశ పౌరసత్వాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. అలా వలస వచ్చిన వారిలో మానవత్వాన్నే తప్ప వారి మతాన్ని మనం చూడకూడదు. భారతదేశం లౌకికదేశం అని రాజ్యాంగ పీఠిక ప్రకటిస్తోంది. మతం అనేది వ్యక్తిగతమైన

ఎంపిక అని ఒక ప్రైవేట్ వ్యవహారమని ప్రాథమిక పాఠశాల దశ నుంచి మన పిల్లలు తెలుసుకోవాలి. పౌరసత్వం ఇవ్వడానికి మతం పునాదిగా మారినట్లయితే అది రాజ్యాంగం హామీపడిన లౌకికవాదాన్ని ఉల్లంఘించినట్లే అవుతుంది. జాతి మొత్తం మీద తమ వ్యక్తిగత మతాన్ని రుద్దాలని చూస్తున్నవారు మన రాజ్యాంగ నీతినే వ్యతిరేకిస్తున్నట్లు లెక్క.

రాజ్యాంగ పీఠికలో పొందుపర్చిన సోషలిజం భావన వాస్తవానికి కమ్యూనిస్టు సామ్యవాదం గురించి చెప్పడం లేదు కానీ, అది ఆధునిక ప్రజాస్వామిక సంక్షేమ వ్యవస్థకు గట్టి పునాదిని కల్పించింది. విద్యా హక్కు, ఉపాధి హక్కు, శ్రమను గౌరవించే హక్కు, గృహవసతి హక్కు, వృద్ధాప్య పింఛన్లు వంటి ప్రభుత్వాలు ఇవ్వాళ అందిస్తున్న హక్కులన్నింటికీ మన రాజ్యాంగ పీఠికే హామీ ఇస్తోంది. కాబట్టి భవిష్యత్ తరాల పౌరులు ప్రజాస్వామ్యాన్ని, గణతంత్ర ప్రభుత్వ వ్యవస్థ రూపాన్ని కాపాడే విషయంలో పోరాడక పోతే మన మొత్తం వ్యవస్థ ఏ మార్గంలోనైనా పయనించవచ్చు. ఈ క్రమంలో ప్రజాస్వామ్యం రద్దయి నియంతృత్వం ముందుకు రావచ్చు కూడా. మన పాలకుల ఆలోచనలు మన అంచనాలకు అందకుండా పోతున్నప్పుడు, ప్రస్తుత ప్రజాస్వామిక, గణతంత్ర వ్యవస్థను నిలబెట్టుకోవాలంటే పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాలు మాత్రమే మన ఏకైక ఆశాదీపంగా ఉంటున్నాయి. ఇక్కడే మన యువతీయువకులు మన స్వాతంత్ర్య యోధుల పోరాటాలు, వలస పాలకులకు వ్యతిరేకంగా వారు చేసిన త్యాగాల ప్రాధాన్యతను తెలుసుకోవాలి. ఒక ప్రజాస్వామిక రాజ్యాంగాన్ని స్థాపించుకోవడం కోసం వేలాదిమంది ప్రాణత్యాగాలు చేశారని మన పిల్లలు తెలుసుకోవాలి.

మన రాజ్యాంగాన్ని న్యాయస్థానాలు కాపాడతాయని, ప్రజలు దీని గురించి పట్టించుకోవాల్సిన అవసరం లేదని భావించడం సరైంది కాదు. న్యాయవ్యవస్థ కూడా తమ సొంత అభిప్రాయాలు, భావజాలాలు కలిగి ఉన్న మనుషుల నాయకత్వంలోనే ఉంటున్నాయి. ప్రజల అప్రమత్తత న్యాయవ్యవస్థను మరింత బాధ్యతాయుతంగా మలిచి రాజ్యాంగ సంరక్షణ ప్రక్రియను కాపాడగలుగుతుంది. చారిత్రకంగా చూస్తే భారతీయులు క్రమం తప్పకుండా పుస్తకాలు చదివే అలవాటు కానీ, ఇళ్లలో పుస్తకాలు భద్రపరచుకునే అలవాటు కానీ కలిగి లేరు. ప్రతి భారతీయుడూ రాజ్యాంగాన్ని చదవడం తమ విధిగా భావించాల్సి ఉంటుందని మన పిల్లలకు తెలియజెప్పాల్సిన సమయం ఆసన్నమైంది. సాధారణంగా రాజ్యాంగాన్ని చదవడం అనేది న్యాయవాదులు, రాజనీతి శాస్త్రం అధ్యాపకులకు సంబంధించిన పనిగా ప్రజలు భావిస్తుంటారు. కానీ ఈ అభిప్రాయం పూర్తిగా తప్పు. ప్రతి భారతీయుడూ పాఠశాల విద్యా దశలోనూ, తదనంతర జీవితం లోనూ రాజ్యాంగాన్ని తప్పకుండా పఠించవలసిన అవసరం ఉంది.

**భగత్‌సింగ్ వర్ధంతి వ్యాసాలు**

మత గ్రంథాలను ఆ మతానికి చెందిన ప్రజలు మాత్రమే చదువుతారు. కాని ఏ మతానికి, భాషకు చెందిన వారైనా సరే.. ప్రతి ఒక్క భారతీయుడూ చదవాల్సిన గ్రంథమే భారత రాజ్యాంగం. రాజ్యాంగ గ్రంథాన్ని ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంచడానికి అత్యంత ప్రాముఖ్యత ఉంది. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని భాషల ప్రజానీకానికి రాజ్యాంగ ప్రతిని తప్పనిసరిగా అందించాల్సి ఉంది. అత్యవసర పరిస్థితి విధించిన 1975-77 మధ్య కాలంలో రాజ్యాంగంపై కాస్త చర్చ చోటు చేసుకుంది కానీ ఆ సమయంలో విద్యావంతులైన ప్రజల సంఖ్య చాలా తక్కువ. ఇప్పుడు మనకు ఉన్న పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు నాటి భారతదేశంలో ఉండేవి కావు. ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉంది. విద్యావంతులు స్వార్థ దృక్పథంతో వ్యవహరించినప్పుడు, వారు రాజ్యాంగాన్ని విచ్ఛిన్నపరిచే కార్యకలాపాలలో మునిగితేలుతారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే రాజ్యాంగ సూత్రం సారాంశానికి విద్య మాత్రమే హామీ ఇవ్వలేదు.

విద్యావంతులే భారత్‌లో కులాన్ని, అస్పృశ్యతను సృష్టించి పెట్టారు. వారు ఇతరులను కూడా మన ఈ వారసత్వాన్ని ఆచరించాలని కోరుతూ వచ్చారు. కానీ మన రాజ్యాంగం ఆ పరంపరను వ్యతిరేకిస్తోంది. భారతీయులందరూ సమానులే అని అది ప్రకటిస్తోంది. సమానత్వానికి సంబంధించిన సరికొత్త పరంపరను అది ప్రారంభించింది. కానీ ఈ రాజ్యాంగ సూత్రాన్ని ఇప్పుడు అనేకమంది వ్యతిరేకిస్తున్నారు. ఇలాంటి దుష్ట శక్తులను మనం వ్యతిరేకించి తీరాలి. ప్రస్తుతం విద్యావంతులు సంపన్నులకు, శక్తిమంతులకు మాత్రమే సర్వస్వం అనే భావనకు బదులుగా అందరికీ మంచి, అందరికీ సమానత్వం, అందరికీ సంక్షేమం అనే భావనలను గురించి ఆలోచించాలి. ప్రజలందరి మేలుకోసం ప్రజలు జీవించడమే రాజ్యాంగానికి అసలైన అర్థం. భారతీయ పిల్లలు ప్రతిరోజూ రాజ్యాంగ పీఠికను పఠించడం, ప్రతి యువతీ యువకుడూ మన రాజ్యాంగాన్ని పఠించడం అనేది మాత్రమే భారతదేశాన్ని అనేక ప్రమాదాల నుంచి కాపాడగలదు. ❑

భగత్‌సింగ్ వర్ధంతి వ్యాసాలు

# సమైక్య స్ఫూర్తిగా బాపు, బాబాసాహెబ్


రామచంద్ర గుహ
చరిత్రకారుడు




**న్యూఢిల్లీలో విద్యార్థుల నిరసనలలో అంబేద్కర్, గాంధీ పోస్టర్లను కలిసికట్టుగా ప్రదర్శించడాన్ని చూసినప్పుడు దేవనూర్ మహదేవ మాటలను నేను గుర్తు చేసుకున్నాను. బాపు, బాబాసాహెబ్ చిత్రాలను పక్కపక్కనే ప్రదర్శించడం ఇదే మొదటి సారి కానప్పటికీ చాలా అరుదైన విషయం. గతంలో గాంధీ అభిమానులు, ఈ ఇరువురినీ పరస్పర ప్రత్యర్థులుగా చూసేవారు. సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తున్న హిందూత్వ శక్తులను ఓడించేందుకు అంబేద్కర్, గాంధీ ఒకే పక్షాన ఉండవలసిన అవసరమున్నది.**

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, మహాత్మా గాంధీ పరస్పర ప్రత్యర్థులా, విరోధులా? ఇరవయ్యో శతాబ్ది మహోన్నత భారతీయులైన ఆ ఇరువురినీ అలా భావించవద్దని ప్రజాస్వామిక వాదులకు దేవనూర్ మహదేవ (కన్నడ రచయిత, సామాజిక క్రియాశీలి) విజ్ఞప్తి చేశారు. నిజమైన సమానత్వ సాధనా ప్రస్థానంలో సహ యాత్రికులుగా వారిని చూడాలని ఆయన అన్నారు. 'నిద్రాణ స్థితిలో వున్న దళితులను అంబేద్కర్ మేలుకొలిపారు. ఆ జాగృతితో సమానత్వ వెలుగుల దిశగా జాతి పయనమయింది. కుల మతాల సంకుచితత్వంలో వున్న హిందువులను మానవతా వెలుగుల వైపు నడిపించడానికి గాంధీ మహా ప్రయత్నం చేశారు. అంబేద్కర్ ఉనికి లేకపోయినట్టయితే, బహుశా, గాంధీ తన లక్ష్య సాధనలో అంతగా ముందుకు వెళ్ళగలిగి వుండేవారు కాదేమో? అదే విధంగా హిందువులలో గాంధీ ఉదారవాద, సహనశీల వైఖరులను పెంపొందించి వుండక పోయినట్టయితే అంబేద్కర్‌ను ఈ క్రూర సవర్ణ సమాజం అంతగా సహించి, గౌరవించి వుండేది కాదు' అని కూడా మహదేవ వ్యాఖ్యానించారు. ఆయన ఇంకా ఇలా అన్నారు:

'భారత్ తనను తాను కుల శృంఖలాల నుంచి విముక్త పరచుకోవాలంటే సవర్ణులు మారవలసిన అవసరమున్నది. ఇందుకు గాంధీ అవసరం. దళితుల పౌర హక్కుల పోరాటానికి అంబేద్కర్ తప్పనిసరి. అందుకే వారిరువురినీ ఒకే పక్షానికి తీసుకు రావాలని నేను అంటున్నాను'. మహదేవ తన అభి ప్రాయాలను మరింత విపులంగా వెల్లడిస్తూ ఇలా అన్నారు: "అస్పృశ్యతను గాంధీ ఒక 'పాపం'గా పేర్కొనగా, అంబేద్కర్ ఒక 'నేరం'గా అభివర్ణించారు. ఆ రెండిటినీ మనం పరస్పర వ్యతిరేకమైనవిగా ఎందుకు చూస్తున్నాం? అస్పృశ్యత దురాచార నిర్మూలనకు ఆ రెండు భావనలు తప్పనిసరి అని అర్థం చేసుకోవడమే విజ్ఞత అవుతుంది".

న్యూఢిల్లీలో విద్యార్థుల నిరసనలలో అంబేద్కర్, గాంధీ పోస్టర్లను కలిసికట్టుగా ప్రదర్శించడాన్ని చూసినప్పుడు దేవనూర్ మహదేవ మాటలను నేను గుర్తు చేసుకున్నాను. బాపు, బాబాసాహెబ్ చిత్రాలను పక్కపక్కనే ప్రదర్శించడం ఇదే మొదటి సారి కానప్పటికీ చాలా అరుదైన విషయం. గతంలో గాంధీ అభిమానులు, ఈ మహోన్నత భారతీయులు ఇరువురినీ పరస్పర ప్రత్యర్థులుగా చూసేవారు. 1930, 40 దశకాలలో అంబేద్కర్ తరచు గాంధీ, ఆయన భావాలపై వివాదాత్మక భాషలో విమర్శలు చేస్తుండేవారు. కాంగ్రెస్ వాదులకు అవి తీవ్ర ఆగ్రహావేశాలు తెప్పించేవి. తమ ప్రియతమ బాపును అలా విమర్శించడాన్ని వారు సహించేవారు కాదు. బ్రిటిష్ వలసపాలనకు అంబేద్కర్ ఒక సంజాయిషీదారు అని వారు ప్రతి విమర్శలు చేస్తుండేవారు. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో వైస్రాయ్ కార్యనిర్వాహక వర్గంలో అంబేద్కర్ చేరడాన్ని గాంధీ అనుయాయులు తీవ్రంగా ఆక్షేపించేవారు.

ఇటీవలి దశాబ్దాలలో అంబేద్కర్ వాదులు మరింత తరచుగా గాంధీని విమర్శిస్తున్నారు. కుల వ్యవస్థను సంస్కరించడంలో ఆయన కృషి చిత్తశుద్ధితో చేసినది కాదని కొట్టివేస్తున్నారు. పూణే ఒడంబడిక సందర్భంలోనూ, ఆ తరువాత తమ ప్రియతమ నాయకుడి పట్ల గాంధీ వైఖరిని వారు తప్పుపడుతున్నారు. అలాగే గాంధీ రాజకీయ వారసుడు జవహర్‌లాల్ నెహ్రూ , అంబేద్కర్ ప్రతిభాపాటవాలను సరైన విధంగా వినియోగించుకోకపోవడాన్ని దుయ్యబడుతున్నారు (నెహ్రూ కేబినెట్‌లో అంబేద్కర్ రెండు సంవత్సరాల పాటు న్యాయశాఖ మంత్రిగా వున్నారు). ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలలో గాంధీపై దళిత మేధావులు తీవ్ర విమర్శలు చేస్తుంటారు. అయితే కర్ణాటకలో నిమ్న శ్రేణుల రచయితలు గాంధీని ఒక విశాల దృష్టితో చూస్తున్నారు. అంబేద్కర్, గాంధీల కృషిని పరస్పర పూరకమైనదిగా చూడాలని కీర్తిశేషుడు డి. ఆర్. నాగరాజ్ తన ప్రశస్త పుస్తకం 'ది ఫ్లేమింగ్ ఫీట్'లో మనకు విజ్ఞప్తి చేశారు.

జమియా మిలియా ఇస్లామియా విద్యార్థులకు, షాహీన్ బాగ్ మహిళలకు డి.ఆర్. నాగరాజ్, దేవనూర్ మహదేవ మేధో కృషి గురించి బహుశ, తెలిసి వుండకపోవచ్చు. ఆ కన్నడ మేధావులు విశాల దృక్పథంతో గాంధీ గురించి చేసిన విశ్లేషణను జమియా విద్యార్థులు, షాహీన్ బాగ్ మహిళా ఉద్యమకారులు ధ్రువీకరించారు. కర్ణాటక చింతనాపరుల వలే అంబేద్కర్, గాంధీలను పరస్పర విరోధులుగా చూడవద్దని ఆ సాహసోపేత

ఢిల్లీ నిరసనకారులు మనకు విజ్ఞప్తి చేశారు. ఆ ఇరువురు మహోన్నతులను ఒక సమున్నత లక్ష్య సాధనలో సహచరులుగా చూడాలని వారు కోరారు. మరింత మెరుగైన ప్రజాస్వామ్యానికి, బహుత్వవాద సంస్కృతికై జరుగుతున్న పోరాటంలో అంబేద్కర్, గాంధీ మేథో కృషి, మానవతావాద కార్యాచరణల వారసత్వాలను సమ్మిళితం చేయవలసిన అవసరమున్నదని జమియా విద్యార్థులు, షాహీన్ బాగ్ మహిళలు మనకు విజ్ఞప్తి చేశారు.

ఢిల్లీ రచయిత ఒమైర్ అహ్మద్ ఇటీవల షాహీన్ బాగ్‌ను సందర్శించిన తరువాత ట్విట్టర్‌లో ఒక ఆసక్తికరమైన వ్యాఖ్య పోస్ట్ చేశారు. ఆ నిరసన ప్రదర్శనలలో గాంధీ చిత్రాల కంటే అంబేద్కర్ చిత్రాలే ఎక్కువగా ప్రదర్శితమవడం పట్ల ఆయన ఇలా వ్యాఖ్యానించారు: 'తమకు స్వాతంత్ర్యం సాధించిన నాయకుడికి ధన్యవాదాలు తెలిపే సంప్రదాయం నుంచి, స్వేచ్ఛాయుత పౌరులుగా తమ సొంత హక్కుల గురించి నిశ్చితంగా మాట్లాడేందుకు అవసరమైన రాజ్యాంగ ఉపకరణాలనిచ్చిన నాయకుడికి ధన్యవాదాలు చెప్పే ఆనవాయితీకి ప్రజలు మారారు'. అహ్మద్ ట్వీట్‌కు నేనిలా ప్రతిస్పందించాను: 'మీతో నేను ఒక షరతుపై అంగీకరిస్తున్నాను. హిందూ–ముస్లిం సమైక్యతను పటిష్టం చేయడంలో గాంధీతో సరిసమానులైన నాయకులు మరెవ్వరూ లేరు (నెహ్రూ సైతం ఇందుకు మినహాయింపు కాదు). ఇది మరింత వివరంగా చర్చించాల్సిన విషయం. ఏమైనా అంబేద్కర్, గాంధీలను సమష్టిగా ఆవాహన చేసుకోవడానికి ప్రయత్నించడం చాలా ముదావహమైన విషయం'. దేశ వ్యాప్తంగా పౌరసత్వ సవరణ చట్టాని (సిఏఏ) కి వ్యతిరేకంగా వెల్లువెత్తుతున్న నిరసనలు పలు విధాల ఉత్తేజపరుస్తున్నాయి. ప్రజలు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా పాల్గొనడం, ఆ నిరసనలకు మహిళలు నాయకత్వం వహించడం ఒక గాఢానుభూతిని కలిగిస్తున్నాయి. మహిళలను ప్రోత్సహించే విషయమై కూడా అంబేద్కర్, గాంధీలను సమష్టిగా ప్రస్తావించడం సముచితంగా ఉంటుంది.

జెండర్ సమానత్వానికి అంబేద్కర్, ఎటువంటి మినహాయింపులు లేకుండా సంపూర్ణంగా నిబద్ధుడైన విశాల హృదయుడు. ఆ నిబద్ధత రాజ్యాంగ రచనలో నిండుగా ప్రతిబింబించింది. హిందూ మత చట్టాలను సంస్కరించేందుకు ఆయన సలిపిన రాజీలేని కృషి కూడా ఆ నిబద్ధతకు ఒక తిరుగులేని తార్కాణమే. గాంధీ తన వ్యక్తిగత జీవితంలో పితృస్వామ్య సంప్రదాయాలు, ఆచారాలనే పాటించినప్పటికీ ప్రజా జీవితంలో మాత్రం మహిళా సాధికారతకు పరిపూర్ణంగా కృషి చేశారు. 1925లో భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలుగా సరోజినీ నాయుడు ఎన్నికవ్వడానికి గాంధీయే ప్రధాన కారకుడు. ఆ కాలంలో అమెరికా, బ్రిటన్ మొదలైన పాశ్చాత్య ప్రజాస్వామ్య దేశాలలోని ఏ ప్రధాన రాజకీయ పార్టీకీ ఒక మహిళ అధినేత్రి కావడమనేది పూర్తిగా అనూహ్య విషయం మరి.

భగత్‌సింగ్ వర్ధంతి వ్యాసాలు

'బోధించు, సంఘటితపరచు, ఉద్యమించు' అని అణగారిన భారతీయులకు అంబేద్కర్ పిలుపునిచ్చారు. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా విద్యార్థులు, మహిళలు మొక్కవోని దీక్షతో నిర్వహిస్తున్న నిరసనలు పూర్తిగా అంబేద్కర్ స్ఫూర్తిదాయక పిలుపు నకు అనుగుణంగా వున్నాయి. హిందూ అధిక సంఖ్యాకవాద ధోరణులను నిలువరించి ప్రజాస్వామ్యాన్ని, బహుత్వ వాదాన్ని సంరక్షించుకోవడానికి జరుగుతోన్న చైతన్యశీల కృషిలో అంతర్–మత సామరస్యం కోసం గాంధీ జీవితాంతం చేసిన పోరాటం ప్రతిధ్వనిస్తోంది.

హిందూత్వ శక్తులతో ఎదురవుతున్న ముప్పును ఎదుర్కోవడానికి అంబేద్కర్, గాంధీలను సమష్టిగా ఆవాహన చేసుకోవాలని దేవనూర్ మహాదేవ నొక్కి చెప్పారు. ఆయన ఇలా అన్నారు: "వారణాసికి చెందిన పదహారేళ్ళ బాలుడు ఒకరు అన్న మాటలను మనం విని తీరాలి'. 'గాడ్సే దేశంలో నేను గాంధీతో నిలబడతాను' అని ఆ చిరుప్రాయుడు అన్నాడు. అలా నిలబడని పక్షంలో ఏ ఛాందసవాదమైనా సరే తొలుత మీ కళ్ళను పెరికి వేసి మిమ్ములను అంధులను చేస్తుంది. ఆ తరువాత మీ మెదడును చితగ్గొట్టి, హేతుయుక్తంగా ఆలోచించలేకుండా చేస్తుంది. పిదప మీ గుండెను పగుల గొట్టి మిమ్ములను రాక్షసుడిగా చేస్తుంది. అంతిమంగా ఒక త్యాగం చేయమని మిమ్ములను అడుగుతుంది. ఈ ధోరణి నేడు పెచ్చరిల్లిపోతోంది. మనం మన బిడ్డల నయనాలను, వారి హృదయాలను, వారి మస్తిష్కాలను ఛాందసవాద కోరల నుంచి తక్షణమే కాపాడుకోవాలి. ఇటువంటి చైతన్యశీలతను సంతరించుకోకపోతే దళితులకు మరింత మహా ముప్పు వాటిల్లగలదని నేను ఆందోళన చెందుతున్నాను'.

అంబేద్కర్ గానీ, గాంధీ గానీ మానవాతీతులు కారనడంలో సందేహమేమీ లేదు. ఇరువురూ మహా తప్పులు చేశారు. ఆ మహోన్నతులిరువురినీ యాంత్రికంగా ఆవాహన చేసుకోకూడదు; గుడ్డిగా అనుకరించకూడదు. వారు ఈ భూమిపై నడయాడిన కాలానికి సంపూర్ణంగా భిన్నమైన ప్రపంచంలో మనం జీవిస్తున్నాం. 21 వ శతాబ్ది మూడో దశాబ్ది రాజకీయ, సాంకేతికతా సవాళ్లు 20వ శతాబ్ది మధ్యనాళ్ళ రాజకీయ, సాంకేతికతా సవాళ్లకు పూర్తిగా భిన్నమైనవి. అప్పటికీ, ఇప్పటికీ నైతిక, సామాజిక సవాళ్లు మాత్రం ఒకే విధంగా వున్నాయి. కుల నిర్మూలన, జెండర్ సమానత్వ పోరాటాలు ముగియలేదు. అంతర్–మత సామరస్య సాధన అత్యావశ్యక, అతి ప్రధాన కర్తవ్యంగా మిగిలిపోయింది. సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తున్న హిందూత్వ శక్తులను ఓడించేందుకు అంబేద్కర్, గాంధీ ఒకే పక్షాన ఉండవలసిన అవసరమున్నది. ❑

# ఇదే భగత్‌సింగ్ పూర్వీకుల ఇల్లు!

*'ఇంక్విలాబ్ జిందాబాద్' అనే నినాదానికి మారుపేరుగా నిలిచిన భగత్‌సింగ్ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చాలా ముఖ్యమైన పాత్ర పోషించారు. ఆయన ఇల్లు ఇప్పుడెలా ఉందో తెలుసా?*



భగత్ సింగ్ పంజాబ్‌లోని ఆనంద్‌పూర్ సాహిబ్‌కు దగ్గరలో ఉన్న ఖట్కర్ కలాన్ గ్రామంలో నివసించారు. ఆయన 1907 సెప్టెంబర్ 28న ప్రస్తుత పాకిస్తాన్‌లోని పంజాబ్‌లో బాంగా గ్రామంలో జన్మించారు.




ఇది ఆనాడు ఒక పల్లెటూరు. ఇప్పుడు అనేక భవంతులు వెలిశాయి. అయితే భగత్‌సింగ్ పూర్వీకుల ఇల్లు మాత్రం ఇప్పటికీ అలాగే ఉంది.




భగత్‌సింగ్ తల్లి 1975 వరకు ఇక్కడే నివసించారు. ఆమె చనిపోయిన తర్వాత మిగతా కుటుంబ సభ్యులు వేర్వేరు ప్రాంతాలకు వెళ్లిపోయారు.



భగత్ సింగ్ పూర్వీకుల ఇంటిని ఇప్పుడు జాతీయ వారసత్వ సంపదగా ప్రకటించారు. అప్పుడప్పుడు చిన్న చిన్న మరమ్మత్తు పనులు చేస్తున్నారు.





పర్యాటకులకు సమాచారం కోసం ఈ ఇంటి ద్వారం వద్ద పురాతత్వ శాఖ ఒక బోర్డును ఏర్పాటు చేసింది.



ప్రధాన ద్వారం నుంచి లోపలికి వెళ్లే మార్గం ఇది. ఈ పసుపు రంగు ఇంట్లోనే భగత్ సింగ్ బాల్యం గడిచింది.




భగత్‌సింగ్ తల్లికి చెందిన వస్తువులను సురక్షితంగా ఉంచడం కోసం ఈ ఇంటి లోపలి భాగాన్ని పురాతత్వ శాఖ మూసేసింది.




నగిషీలు చెక్కిన ఈ నవ్వారు మంచం, అల్మారీ వందేళ్లు దాటినా ఇంకా చెక్కు చెదరలేదు.



బొగ్గుల ఇస్త్రీ పెట్టె వంటి వస్తువులు ఈ అల్మరాలో ఉన్నాయి.



ఆనాడు స్నానానికి ఉపయోగించిన బాత్ టబ్, బకెట్ ఇంకా అలాగే ఉన్నాయి.



భగత్ సింగ్ తల్లి 1975 దాకా ఈ వస్తువుల్ని ఉపయోగించే వారట.



వంటింట్లో కనిపించే పాత్రల్లో ఎక్కువ భాగం రాగి, ఇత్తడివే.



ఖట్కర్ కలాన్ గ్రామంలో పంజాబ్ ప్రభుత్వం భగత్ సింగ్ స్మృత్యర్థం ఒక మ్యూజియం ఏర్పాటు చేసింది.



ఈ మ్యూజియంలో ఆయనకు సంబంధించిన అనేక ఇతర వస్తువుల్ని ఉంచారు.